


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

GSTIN 37AMRPM5719R1ZX

RNI-APTEL/2023/88162


**వాణిజ్య సిలిండర్‌పై మళ్లీ బాదుడు**




ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 92 | గురువారం 02 - 04 -2026 | పేజీలు : 12 | వెల-3


# ఖజానాకు కాసుల కిక్కు!

**తొలిసారి రూ.44 వేల కోట్లు దాటిన ఎక్సైజ్ శాఖ ఆదాయం**

**2025-26లో రూ.40,209 కోట్ల మద్యం అమ్మకాలు**

**తగ్గిన బీరు సేల్స్.. పెరిగిన లిక్కర్ ఘాటు**

**డిసెంబరులో అత్యధికంగా రూ.5,051 కోట్ల విక్రయాలు**



# రేషన్ కార్డుల తొలగింపు దుర్మార్గపు చర్య



**5లక్షలు ఇచ్చామని చెప్పి 15లక్షలు తొలగించే కుట్ర**

**ప్రభుత్వ తీఈరుపై మండిపడ్డ జాగృతి అధ్యక్షురాలు కవిత**

రాష్ట్రంలో పేదలను రేవంత్ రెడ్డి సర్కార్ వేధిస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. రేషన్ కార్డుల విషయంలో పేదలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. రేషన్ కార్డుల ఏరివేత అనే దుర్మార్గపు చర్యలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయాలని కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై కవిత సీరియస్ అయ్యారు. పేదలకు అన్యాయం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆగ్రహించారు. గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేదని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని కవిత విమర్శించారు. 5 లక్షల రేషన్ కార్డులు ఇచ్చామని చెప్పుకుంటూ.. మరోవైపు 15 లక్షల కార్డులు తొలగించే ప్రయత్నం జరుగుతోందని సంచలన ఆరోపణలు చేశారు. ఐటీ రిటర్న్ ఫైల్ చేయడం, ప్రైవేట్ ఉద్యోగాలు చేయడం వంటి కారణాలతో కార్డులు తీసేయడం

# నేటి నుంచి భూభారతి అమలు

**ఐదు మండలాల్లో ప్రయోగాత్మకం అధికారులతో సమీక్షించిన మంత్రి పొంగులేటి**



# కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తీపి కబురు

**ఇక నేరుగా ఖాతాల్లో జీతాలు జమచేయనున్న ప్రభుత్వం**

**వేలాది మంది ఉద్యోగులకు లబ్ది చేకూరే అవకాశం**

తెలంగాణ రాష్ట్రంలోని వేలాది మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక తీపి కబురు అందించింది. గత కొన్నేళ్లుగా వేతనాల చెల్లింపులో ఎదురవుతున్న తీవ్ర జాప్యం, మధ్యవర్తుల అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఏప్రిల్ నెల నుంచి ఈ ఉద్యోగులందరికీ నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోనే జీతాలు జమ చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా వేతనాలు అందుతుంటాయి. దీనివల్ల కమిషన్ల పేరిట కొంత మొత్తం కట్ అవ్వడమే కాకుండా, నెలల తరబడి జీతాలు రాక కార్మికులు ఇబ్బందులు పడేవారు. తాజా నిర్ణయంతో మున్సిపాలిటీలు, గురుకులాలు, విద్యా సంస్థలు, ఆరోగ్య శాఖ

# జగన్.. 'మావిగన్'!



**విశాఖ వద్దనుకుంటే 'ప్లాన్-బి' అట**

**మచిలీపట్నం, విజయవాడ, గుంటూరుతో 'మావిగన్'**

**అమరావతి మాత్రం ఆచరణ సాధ్యం కాదు**

**మేమొచ్చాక అసెంబ్లీ తీర్మానంతో మార్చేస్తాం**

**రాజ్యాంగంలో 'రాష్ట్ర రాజధాని' అనేదే లేదు**

**సానుకూల మీడియాతో జగన్ పలుకులు**

అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానుల పాట పాడిన వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్.. ఇప్పుడు 'ప్లాన్-బి' పేరుతో కొత్త పల్లవి అందుకున్నారు. బుధవారం ఒకవైపు అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుపై లోక్‌సభలో చర్చ జరుగుతుండగా... మరోవైపు తాడేపల్లి ప్యాలెసలో తన అనుకూల మీడియాతో మాట్లాడారు. విశాఖలో ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ నచ్చకపోతే.. ప్లాన్-బీ కింద మచిలీపట్నం (మా) -విజయవాడ (వి)-గుంటూరు (గన్) నగరాలను రాజధానిగా అభివృద్ధి చేయొచ్చని తెలిపారు. దీనికి ఎంచక్కా 'మావిగన్' అని పేరు పెట్టొచ్చన్నారు. 'గన్'లో తన పేరు ఉన్నందున, అది నచ్చకపోతే ఇంకోపేరు పెట్టుకోవచ్చని కూడా సలహా ఇచ్చారు. మచిలీపట్నం-విజయవాడ-గుంటూరు మధ్య 110 కిలోమీటర్ల హైవే ప్రాంతం పరిధిలో 110 ఎకరాల్లో రాజధాని నగరాన్ని ఏర్పాటు చేయొచ్చని జగన్ పేర్కొన్నారు. 'మావిగన్'పై తన అభిప్రాయాన్ని విన్నాక .. రాష్ట్ర ప్రజలు తనతో ఏకీభవిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. అమరావతి మాత్రం ఆచరణ సాధ్యం కాదని తేల్చేశారు. భవిష్యత్తులో తమ ప్రభుత్వం వచ్చాక అసెంబ్లీలో చట్ట సవరణ ద్వారా రాజధానిని మార్చేస్తామన్నారు. "రూ.10 లక్షల కోట్లు ఖర్చు చేసినా ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేని రాజధాని అమరావతితో రాష్ట్రానికి సంక్షోభం. కేవలం రోడ్లు, డ్రైనేజీ, నీటి సరఫరా, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకే రూ.2 లక్షల కోట్లు ఖర్చుచేస్తే రాష్ట్రంలో సంక్షేమం, పరిపాలన స్తంభించిపోతాయి" అని వివరించారు.

**నేనొస్తే మార్చేస్తా...** రాజ్యాంగంలో దేశ రాజధానిపై నిర్వచనం ఉందే తప్ప.. రాష్ట్రాల రాజధాని ప్రస్తావనే ఎక్కడా లేదని జగన్ చెప్పారు. రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటులో చట్ట సవరణ చేసినా నిలువదన్నారు. భవిష్యత్‌లో ప్రజాభీష్టం మేరకు ఏర్పడే రాష్ట్రప్రభుత్వం..

**అమరావతి బిల్లుకు చట్టబద్ధత కల్పించడాన్ని స్వాగతిస్తున్నాం...**



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ఏర్పాటుకు చట్టబద్ధత కల్పిస్తూ లోక్ సభలో బిల్లు ఆమోదించడాన్ని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఆయన అభినందనలు తెలియజేశారు. ఇదే సమయంలో ఆయన కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. తెలంగాణ రాష్ట్రానికి విభజన సందర్భంగా ఇచ్చిన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014లో తెలంగాణకు పలు కీలక హామీలు ఉన్నాయని, వాటి అమలు విషయంలో కేంద్రం వివక్షపూరితంగా వ్యవహరించడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు.బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐఐఎం, సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా వంటి కీలక ప్రాజెక్టులు ఇంకా ఆచరణకు నోచుకోలేదని అన్నారు. ఈ ప్రాజెక్టులు తెలంగాణ అభివృద్ధికి కీలకమని గుర్తుచేశారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు వంటి అంశాల్లో కూడా కేంద్రం మాట తప్పిందని ఆవేదన వ్యక్తం చేశారు.

# అమరావతికి జై

## రాజధాని బిల్లుకు లోక్‌సభ ఆమోదం



**లోక్‌సభలో దాదాపు 2 గంటలు చర్చ**

**18 మంది ఎంపీల ప్రసంగం**

**జగన్ తీరును ఎండగట్టిన సభ్యులు**

**మూజువాణి ఓటుతో సభ ఆమోదం**

జగన్ ఐదేళ్ల పాలనలో అంధకారంలో పడిన అమరావతి భవిష్యత్ ఇక దేదీప్యమానంగా ప్రకాశించేందుకు మార్గం సుగమమైంది. ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ కేంద్రం ప్రవేశపెట్టిన రాష్ట్ర పునర్విభజన చట్ట సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. 2024 జూన్ 2 నుంచి అమరావతిని రాష్ట్ర రాజధానిగా చట్టం ద్వారా గుర్తిస్తున్నట్లుగా ఈ బిల్లులో పేర్కొన్నారు.

# అమరావతికి జై

దానితోపాటు రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) రాజధానిగా నోటిపై చేసిన ప్రాంతమంతా అమరావతి పరిధిలోకి వస్తుందని తెలిపారు. కేంద్ర హోం శాఖ సహాయమంత్రి నిత్యానంద రాయ్ బుధవారం ప్రవేశపెట్టిన ఈ బిల్లుపై దాదాపు రెండు గంటలపాటు చర్చ జరిగింది. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ సహా 11 పార్టీలకు చెందిన 18 మంది ఎంపీలు ఇందులో పాలుపంచుకున్నారు. బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించిన వైసీపీ ఎంపీలు సభ నుంచి వాకౌట్ చేశారు. ఆ తర్వాత బిల్లును మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. గురువారం రాజ్యసభ ముందుకు ఈ బిల్లు రానుంది. అక్కడ ఆమోదం పొందడం కూడా లాంఛనమే. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం లభించగానే చట్టరూపం దాలుస్తుంది. 2014 ఫిబ్రవరి 18న లోక్‌సభలో తీవ్ర గందరగోళం, వాగ్యుద్ధాలు, ఎంపీల పరస్పర దాడులు, తోపులాటలు, పెప్పర్ స్ప్రే ప్రయోగాల మధ్య రాష్ట్ర పునర్విభజన బిల్లు-2014ను ఆమోదించిన నాటి దృశ్యాలకు భిన్నంగా.. సదరు చట్ట సవరణ బిల్లుపై బుధవారం చాలా ఆహ్లాదకరమైన వాతావరణంలో చర్చ జరిగింది. ఆమోదమూ లభించింది. వైసీపీ లోక్‌సభా పక్ష నేత మిథున్‌రెడ్డి వ్యాఖ్యలను టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు.. బీజేపీ ఎంపీ సీఎం రమేశ్‌ను మిథున్‌రెడ్డి అడ్డుకునేందుకు చేసిన ప్రయత్నాలు తప్ప.. బిల్లుపై చర్చ, ఆమోదానికి ఎటువంటి అంతరాయం కలుగలేదు. కాంగ్రెస్, ఇతర ఇండీ కూటమి పార్టీలు, ఎన్‌డీఏ పార్టీలన్నీ ముక్తకంఠంతో అమరావతి రాజధానికి చట్టబద్ధతను స్వాగతించాయి. వైసీపీ ఒక్కటే వ్యతిరేకించింది. రాజధానికి భూములిచ్చిన రైతుల ప్రయోజనాలకు బిల్లులో ప్రాధాన్యం లేదని మిథున్‌రెడ్డి అన్నారు. దానిని ఓటింగ్‌కు పెట్టినప్పుడు ఆయనతోపాటు మిగతా ముగ్గురు వైసీపీ ఎంపీలు వైఎస్ అవినాశ్‌రెడ్డి, తనూజారాణి, ఎం.గురుమూర్తి వాకౌట్ చేశారు.

**జగన్‌ను ఎండగట్టిన కూటమి ఎంపీలు** చట్టబద్ధత చట్టసవరణ బిల్లును ఆమోదించే క్రమంలో జగన్‌ను తీవ్రంగా ఎండగట్టేందుకు వచ్చిన అవకాశాన్ని టీడీపీ, బీజేపీ, జనసేన సభ్యులు పూర్తిగా వినియోగించుకున్నారు. బిల్లుపై చర్చను ప్రారంభించిన కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్.. తాను అమరావతి భూమిపుత్రుడిగా మాట్లాడుతున్నానన్నారు. మూడు రాజధానుల పేరుతో జగన్ వికృత క్రీడను తీవ్రంగా విమర్శించారు. అమరావతి రైతులపై ఆయన చేసిన దాడులు, ముఖ్యంగా మహిళా రైతులకు జరిగిన అవమానాలను కళ్లకు గట్టినట్లు వివరించారు. ఆడబిడ్డల కన్నీటి చుక్కలే జగన్ పతనానికి కారణమని టీడీపీ సభ్యుడు క లిశెట్టి అప్పలనాయుడు అన్నారు. చంద్రబాబు ప్రారంభించిన రాజధానిని.. జగన్ ప్రభుత్వం రహదారులు సహా విధ్వంసం చేసిన తీరును బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ వివరించారు. ఐదేళ్లపాటు జరిగిన దోపిడీ, దౌర్జన్యాలు, విధ్వంస కాండ, లిక్కర్ మాఫియా అకృత్యాలను సభ దృష్టికి తెచ్చారు. అమరావతిని ధ్వంసం చేసినందుకే ప్రజలు జగన్‌కు కేవలం 11 సీట్లు ఇచ్చి పక్కనపెట్టారని.. కూటమిని అఖండ మెజారిటీతో గెలిపించారని జనసేన ఎంపీ వల్లభనేని బాలశౌరి తెలిపారు. ఏపీకి ఎట్టకేలకు మంచి రాజధాని నిర్మించుకునే అవకాశ ం లభించిందని బీజేపీ ఎంపీ పురందేశ్వరి వ్యాఖ్యానించారు.

**సమాజ్‌వాదీ సంపూర్ణ సమర్థన** రాష్ట్ర పునర్విభజన చట్ట సవరణ బిల్లును ఆకస్మికంగా ప్రవేశపెట్టడంపై సమాజ్‌వాదీ ఎంపీ ధర్మేంద్ర యాదవ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అయితే బిల్లును సమర్థిస్తున్నానని, ఆలస్యంగానైనా ఒక రాష్ట్రానికి స్థిరమైన రాజధాని అవసరమని చెప్పారు. అన్ని సౌకర్యాలూ ఉన్న విశాఖను కాకుండా రైతుల నుంచి పెద్దఎత్తున భూములను తీసుకుని అమరావతిని రాజధానిగా చేయాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. రైతులకు భూసేకరణ చట్టం కింద తగిన నష్టపరిహారం ఇస్తున్నారా అని అడుగగా.. అంతకంటే ఎక్కువే చెల్లిస్తున్నామని శ్రీకృష్ణదేవరాయలు జవాబిచ్చారు. అలాగైతే బిల్లును ఆహ్వానిస్తానని ధర్మేంద్రయాదవ్ చెప్పారు. బజరంగ్ సోన్వానే (ఎన్‌సీపీ-శరద్ పవార్), హర్‌సిమ్రత్ కౌర్(అకాలీదళ్), శ్రీకాంత్ షిండే (శివసేన), అరవింద్ సావంత్ (ఉద్ధవ్ శివసేన), పప్పూయాదవ్ (బిహార్ స్వతంత్ర ఎంపీ) కూడా బిల్లుకు మద్దతిస్తూ ప్రసంగించారు.

**రేవంత్ ఆర్‌ఆర్ టాక్స్: కిషన్‌రెడ్డి** అమరావతిని ఏపీ రాజధానిగా అభివృద్ధి చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. అయితే తెలంగాణలో ఆర్ ఆర్ టాక్స్ పేరిట సీఎం రేవంత్ రెడ్డి పన్నులు వసూలు చేస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. పునర్విభజన చట్టంలో తెలంగాణకు ఇచ్చిన హామీలను ఇంతవరకు నెరవేర్చలేదని ఆ రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ ఎంపీలు గడ్డం వంశీకృష్ణ, మల్లు రవి, రఘురామరెడ్డి విమర్శించారు.

**బిల్లుకు వైసీపీ వ్యతిరేకం: మిథున్‌రెడ్డి** తాము అమరావతికి వ్యతిరేకం కాదని.. కానీ స్పష్టత లేని అమరావతి రాజధాని బిల్లుకు వ్యతిరేకమని మిథున్ రెడ్డి అన్నారు.అమరావతి రాష్ట్ర ప్రజల కోసం నిర్మిస్తున్న రాజధాని కాదని.. అది చంద్రబాబు, ఆయన బినామీలు కలిసి సాగిస్తున్న అడ్డగోలు రియల్ ఎస్టేట్ వ్యాపారమని ఆరోపించారు. 'దక్షిణాఫ్రికా, నెదర్లాండ్స్ దేశాల్లో 3రాజధా నులు, బహుళ రాజధానుల విధానం విజయ వంతంగా కొన సాగుతోంది. అమరావతి పేరుతో ప్రజాధనాన్ని దుర్వి నియోగం చేస్తూ, భూము లిచ్చిన రైతుల పొట్టగొడుతూ, బినామీ రియల్ ఎస్టేట్ వెంచర్‌గా మార్చే విధానాన్ని వ్యతిరేకిస్తు న్నాం. అందుకే బిల్లును ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్నాం' అంటూ సహచరు లతో కలిసి వాకౌట్ చేశారు.

## అమ్మాయి పుడితే లక్ష రూపాయిలు... పుదుచ్చేరి సీఎం ఎన్నికల హామీ

పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్. రంగసామి కీలక ఎన్నికల హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే, రాష్ట్రంలో ఆడపిల్ల పుడితే ఆమె పేరిట రూ.లక్ష ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తామని ప్రకటించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వీరపట్టిణం ప్రాంతంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన ఈ హామీ ఇచ్చారు.

ప్రస్తుతం తమ ప్రభుత్వం ఆడబిడ్డ పుట్టిన వెంటనే రూ.50 వేలు డిపాజిట్ చేస్తోందని, మళ్లీ అవకాశం ఇస్తే ఆ మొత్తాన్ని రూ.లక్షకు పెంచుతామని రంగసామి స్పష్టం చేశారు. ఈ పథకం ద్వారా బాలికల భవిష్యత్తుకు, ఉన్నత విద్యకు ఆర్థిక భరోసా కలుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మరికొన్ని హామీలు కూడా ఇచ్చారు. మత్స్యకారుల చిరకాల డిమాండ్ అయిన అత్యంత వెనుకబడిన తరగతుల (ఎంబీసీ) జాబితాలో చేర్చడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే, పుదుచ్చేరిలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ప్రజాపనుల శాఖ (పీడబ్ల్యూడీ) ద్వారా రూ.3వేల కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయని, రానున్న ఎన్నికల్లో గెలిస్తే కేంద్ర ప్రభుత్వ సహకారంతో మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తామని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు.

## ఆగ్రా జంట హత్యల కేసులో సంచలన తీర్పు.. భర్త సహా ముగ్గురికి మరణశిక్ష

ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో నాలుగేళ్ల క్రితం జరిగిన జంట హత్యల కేసులో స్థానిక కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. కట్టుకున్న భార్యను, ఆమె బంధువును అత్యంత కిరాతకంగా హత్య చేసిన కేసులో భర్త, అతడి తండ్రి, సోదరుడికి మరణశిక్ష విధించింది. దోషులు ముగ్గురికీ తలో లక్ష రూపాయల చొప్పున జరిమానా కూడా విధించింది. 2022లో ఏత్మాద్‌పూర్ ప్రాంతంలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. గౌరవ్ అనే వ్యక్తి తన భార్య పూజకు, ఆమె బంధువైన శివం సిసోడియాకు వివాహేతర సంబంధం ఉందనే అనుమానం పెంచుకున్నాడు. మే 27, 2022న శివం.. పూజను కలిసేందుకు వారి ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో వారిద్దరినీ చూసిన గౌరవ్ కుటుంబ సభ్యులు, వారిని పట్టుకుని వీధిలోకి లాక్కొచ్చారు. అనంతరం గౌరవ్, అతడి తండ్రి మదన్, సోదరుడు అభిషేక్ కలిసి కర్రలతో దాడి చేసి, కిందపడిన తర్వాత గొడ్డలి వంటి పదునైన ఆయుధంతో ఇద్దరి గొంతులు కోసి హత్య చేశారు. ఈ ఘటన తర్వాత గౌరవ్ తండ్రి, సోదరుడు పోలీసులకు లొంగిపోగా, పోలీసులు హత్యకు ఉపయోగించిన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు విచారణలో భాగంగా కోర్టు 14 మంది సాక్షులను విచారించింది. సీసీటీవీ ఫుటేజీ, మృతుడు శివం సోదరుడి సాక్ష్యం ఈ కేసులో కీలకంగా మారాయి. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, ముగ్గురినీ దోషులుగా నిర్ధారించి మరణశిక్ష విధించింది. సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో గౌరవ్ తల్లిని నిర్దోషిగా విడుదల చేసింది. తీర్పు వెలువడిన తర్వాత దోషులు ఎలాంటి భావోద్వేగం ప్రదర్శించలేదు. ఈ తీర్పును హైకోర్టులో సవాలు చేస్తామని తెలిపారు.

# బీసీ రిజర్వేషన్ల బిల్లుపై చిత్తశుద్ధి ఏదీ?

తొలి దశ జనగణన ఈ ఏడాది మొట్టమొదటగా డిజిటల్ విధానంలో చేపడుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆరువేల కోట్లు కేటాయించి, 33 ప్రశ్నలతో కూడిన గెజిట్‌ను విడుదల చేసింది. ఆ ప్రశ్నావళిలోని 12వ కాలమ్‌లో ఎస్సీ, ఎస్టీ, ఇతరులు అని పేర్కొన్నారు. కానీ దేశంలో 60 శాతం ఉన్న ఓబీసీల జనాభా లెక్కింపు కోసం ప్రత్యేక కాలమ్ లేదు. ప్రజలు ఏ ఇంట్లో ఉంటున్నారు? ఆ ఇంటి నిర్మాణంలో ఏ మెటీరియల్ వాడారు? ఆ ఇంటి నేల, గోడ, పైకప్పు ఏ రకం? ఏ రకమైన ఆహారం తింటున్నారు? ఏ నీళ్లు తాగుతున్నారు? ఏ పొయ్యి వాడుతున్నారు? టీవీ, కంప్యూటర్, టూవీలర్స్, కార్లు, ఇంటర్నెట్ సౌకర్యాలు లాంటి డేటా సేకరిస్తున్నారు. మంచిదే కానీ, బీసీల డేటా సేకరించలేరా? సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ, వ్యాపారాల్లో తీవ్ర అసమానతలు ఎదుర్కొంటున్న, ఉత్పత్తి కులాలైన ఓబీసీలకు చట్టబద్ధంగా రావలసిన రిజర్వేషన్లు అందుకోవడానికి బీసీ సమాజం ఎందుకు ఇంకా బలహీనంగా పోరాడుతోంది? బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తే భవిష్యత్తులో గ్రామాలలో, పట్టణాలలో అగ్రకులాల ప్రాబల్యం, ఆధిపత్యం, పెత్తందారి నియంతృత్వానికి భారీగా గండిపడుతుంది. బీసీలు భవిష్యత్తులో చట్టసభలలోకి ప్రవేశిస్తే దేశ, రాష్ట్ర రాజకీయాలలో ఓబీసీల ఆధిపత్యం పెరుగుతుందనే భయం ఉంది. అందుకే అగ్రకులాలు రాజకీయంగా, కోర్టుల ద్వారా రిజర్వేషన్లను అడ్డుకుంటున్నాయి. విచిత్రం ఏమిటంటే తెలంగాణ అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లకు అన్ని పార్టీలు మద్దతు ఇచ్చాయి. బీజేపీ ఈసారైనా పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్లో చేర్చి మండల్ కమిషన్ చెప్పినట్లు వారికి విద్యా, ఉద్యోగ, రాజకీయాలలో 52శాతం రిజర్వేషన్లు ఇచ్చే విషయంపై చర్చ పెట్టాలి. రాష్ట్రస్థాయిలో బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చుకోవచ్చని చెప్పింది బీజేపీ. ఆ బిల్లును రాష్ట్రపతి, ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఇంతవరకు ఆమోదించలేదు. ఇది పార్లమెంట్‌లో చట్టం చేయాల్సిన అంశమని, బీజేపీ రాష్ట్ర నాయకులు కేంద్రంలో పెద్దలకు ఎందుకు చెప్పి ఒప్పించలేకపోతున్నారు? 42శాతం బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా అగ్రకులాలు కోర్టులో పిటిషన్ వేస్తే, బీసీలకు మద్దతుగా ఇంప్లీడ్ పిటిషన్లు కూడా వేయని పార్టీలు బీజేపీ, బీఆర్ఎస్ మాత్రమే. ఇందిరా సహాని కేసులో సుప్రీంకోర్టు విద్య, ఉద్యోగాలలో మాత్రమే రిజర్వేషన్లు 50శాతం పరిమితి మించరాదని చెప్పింది. ఎక్కడా రాజకీయ రిజర్వేషన్ల గురించి మాట్లాడలేదు. ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రపతికి, గవర్నర్‌కు పంపిన బిల్లుల విషయంలో పరిమిత గడువులోపు వారు ఆమోదించడమో, వ్యతిరేకించడమో చేయాలి. లేకపోతే ఆ బిల్లు ఆటోమేటిక్‌గా చట్టంగా మారుతుంది. ఆ మార్గదర్శకాలను హైకోర్టు పాటించకపోవడం రాజ్యాంగ విరుద్ధం కాదా? సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం చూస్తే రిజర్వేషన్లు 50శాతం పరిమితి దాటొద్దు కానీ కేంద్రంలో బీజేపీ, తెలంగాణలో కేసీఆర్ వల్ల విద్య, ఉద్యోగాల్లో 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఇవ్వడంతో మొత్తంగా 60శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. ఇక్కడ సుప్రీంకోర్టు గత తీర్పు వర్తించదా! ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలలో ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు తప్ప మిగతా మెజారిటీ సీట్లలో అగ్రకులాలదే ఆధిపత్యం. అదేవిధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50శాతం రాజకీయ రిజర్వేషన్లు ఉంటే, 10శాతం లేని ఓసీలు మిగిలిన సీట్లన్నీ అనుభవిస్తున్నారు. దీన్ని ఎలా అనుమతిస్తాయి కోర్టులు? ఇది రాజ్యాంగపరంగా సమన్యాయమేనా? ఓబీసీలకు 42శాతం, ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 10శాతం రిజర్వేషన్లు ఇచ్చినా 67శాతం అవుతుంది. ఇక మిగిలిన 33శాతం సీట్లను 10 శాతం కూడా లేని ఓసీలే అనుభవిస్తారు కదా! ఏ రకంగా చూసినా ఎక్కువ ప్రయోజనం పొందేది అగ్రకులాలే! దీనిని కోర్టులు ఎందుకు గమనించడం లేదు? ఇంకో విషయం ఏమిటంటే ట్రిపుల్ టెస్ట్ చేయాలి అంటున్నాయి కోర్టులు. అసలు ఈ ట్రిపుల్ టెస్ట్‌లో ఏముందంటే 1) స్థానికంగా ఓబీసీల సమగ్ర వివరాలు సేకరించాలి, దానికి ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలి. 2) కమిషన్ అధ్యయనం తర్వాత రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించాలి. 3) మొత్తం రిజర్వేషన్లు 50శాతానికి మించకూడదు. మూడో పాయింట్‌కు సంబంధించి బీసీల ఎంపిరికల్ డేటా ప్రకారం పెంచాలని ఉన్నా, అది 50శాతం దాటొద్దు. మరి పెరిగిన బీసీల జనాభా డేటాతో రిజర్వేషన్లు పెంచకపోతే, సేకరించిన ఆ డేటాతో పని ఏం ఉంటుంది? 50శాతానికి మించి రిజర్వేషన్లు ఇవ్వనప్పుడు ఆ ట్రిపుల్ టెస్ట్ అవసరమే లేదు.

మిగతా సామాజికవర్గాలతో పాటు ఓసీలకు కూడా విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో వారి జనాభా ఎంతో అంత రిజర్వేషన్లు ఇవ్వాలి. బీజేపీ తక్షణమే పార్లమెంటులో బీసీ బిల్లును తొమ్మిదో షెడ్యూల్లో పెట్టి, దేశవ్యాప్తంగా ఓబీసీల జనాభా ఎంత ఉందో,

అంత శాతం రిజర్వేషన్లు విద్యా, ఉద్యోగ, రాజకీయాలలో కల్పించాలి. లేకపోతే ఆ పార్టీ భవిష్యత్తును వారే ప్రమాదంలో పడవేసుకున్నట్టు అవుతుంది.

## ఇరాన్‌తో యుద్ధం.. ట్రంప్ వ్యాఖ్యలతో తీవ్ర గందరగోళం

అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర గందరగోళానికి దారితీశాయి. ఇరాన్ తమను కాల్పుల విరమణ కోరిందని ట్రంప్ ప్రకటించగా, ఆ వార్తలను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. ఈ నేపథ్యంలో, ఇరాన్‌పై అమెరికా వైఖరిని స్పష్టం చేస్తూ ట్రంప్ మరికొన్ని గంటల్లో (భారత కాలమానం ప్రకారం ఉదయం 6:30 గంటలకు) ప్రసంగించనున్నారు.బుధవారం ట్రంప్ మాట్లాడుతూ.. ఇరాన్ కొత్త అధ్యక్షుడు తమను సంప్రదించి కాల్పుల విరమణ కోరినట్లు తెలిపారు. అయితే, హార్మూజ్ జలసంధిని స్వేచ్ఛగా తెరిచి ఉంచినప్పుడే ఈ ప్రతిపాదనను పరిశీలిస్తామని ఆయన షరతు పెట్టారు. అప్పటివరకు ఇరాన్‌ను రాతియుగంలోకి నెట్టేస్తామని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అయితే, ట్రంప్ వాదనలను ఇరాన్ విదేశాంగ శాఖ తోసిపుచ్చింది. అమెరికాను తాము కాల్పుల విరమణ కోరినట్లు వస్తున్న వార్తలు పూర్తిగా "అబద్ధం, నిరాధారం" అని స్పష్టం చేసింది. అలాంటి అభ్యర్థన ఏదీ చేయలేదని తేల్చి చెప్పింది. ఇదిలా ఉండగా, యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు దక్షిణ ఇజ్రాయెల్‌పై బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేశారు. ఇరాన్, హిజ్బుల్లాలతో సమన్వయంతోనే ఈ దాడికి పాల్పడినట్లు వారు ప్రకటించారు. అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్, దాని మిత్రపక్షాలు ఉమ్మడి సైనిక చర్యలను ముమ్మరం చేయడంతో ఈ ఘర్షణ మరింత తీవ్రమవుతోంది.

## ఖజానాకు కాసుల కిక్కు!

ఆదాయంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ సరికొత్త రికార్డు సృష్టించింది. శాఖ చరిత్రలోనే తొలిసారిగా ఆదాయం రూ.44,000 కోట్ల మార్కు దాటింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో మద్యం అమ్మకాలు ఏకంగా రూ.40,209 కోట్లకు చేరాయి. ఈ అమ్మకాల ద్వారా ఎక్సైజ్ శాఖకు దాదాపు రూ.39,368 కోట్ల ఆదాయం సమకూరింది. ఇది కాక, మద్యం దుకాణాల ఫీజుల రూపంలో రూ.1,771 కోట్లు, బార్ల ద్వారా రూ.549 కోట్లు, కొత్త షాపుల కేటాయింపు లైసెన్స్ దరఖాస్తుల రూపంలో మరో రూ.2,869 కోట్లు సమకూరాయి. మొత్తంగా 2025-26లో ఎక్సైజ్ శాఖ ఖజానాకు రూ.44,557 కోట్లు ఆదాయం సమకూరింది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఓ ఆర్థిక సంవత్సరంలో రూ.44వేల కోట్ల మార్కును దాటడం ఇదే తొలిసారి. ఏడేళ్ల కాలంలోనే ఆదాయం రెట్టింపు కావడం గమనార్హం. 2018-19లో రూ.20,859 కోట్లుగా ఉన్న ఆదాయం 2025-26 నాటికి రూ.44వేల కోట్లు దాటింది. 2024-25తో పోలిస్తే 2025-26లో మద్యం అమ్మకాలు 7శాతం పెరిగాయి. 2024-25లో రూ.37,487కోట్ల అమ్మకాలు జరగ్గా 2025-26లో రూ.39,368 కోట్ల అమ్మకాలు జరిగాయి. అంటే అదనంగా దాదాపు రూ.2,722 కోట్లు సమకూరాయి. 2025-26లో 382.91 లక్షల కేసుల మద్యం అమ్మకాలు జరగ్గా 2024-25లో 372.25 లక్షల కేసులు విక్రయించారు. బీరు అమ్మకాలు పరిశీలిస్తే.. 2024-25లో 536.13 లక్షల కేసులు అమ్ముడవ్వగా 2025-26లో 387.34 లక్షల కేసులు మాత్రమే అమ్ముడయ్యాయి. బీరు అమ్మకాలు 9 శాతం మేర తగ్గాయి.

**2025-26లో అమ్మకాలు ఇలా..** పంచాయతీ ఎన్నికలు, కన్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో 2025 డిసెంబరులో మద్యం ఏరులై పారింది. ఒక్క డిసెంబరులోనే రికార్డు స్థాయిలో రూ.5,051 కోట్ల అమ్మకాలు జరగ్గా.. వేసవి ప్రభావంతో మే నెలలో బీర్ల అమ్మకాలు పెరిగి రూ.3,561 కోట్లు వచ్చాయి. అత్యల్పంగా అక్టోబరులో రూ.2,709 కోట్లు వసూలయ్యాయి. జూన్‌లో రూ.3,273 కోట్లు, జూలైలో రూ.3,320కోట్లు, ఆగస్టులో రూ. 3,082కోట్లు, సెప్టెంబరులో రూ. 3,048కోట్లు, నవంబరులో రూ.2,868 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. ఇక 2026 జనవరిలో రూ.3325 కోట్లు, ఫిబ్రవరిలో రూ.3,208కోట్లు, మార్చిలో రూ.3,486కోట్లతో కలిపి మొత్తం రూ.40,209 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. అమ్మకాల్లో 80 శాతం ఎక్సైజ్ శాఖకు సమకూరే ఆదాయమే. అంటే కేవలం మద్యం అమ్మకాల ద్వారానే రూ.39,368 కోట్ల ఆదాయం సమకూరింది.

**లైసెన్స్ ఫీజుల పంట...** లైసెన్స్ ఫీజుల రూపంలో 2025-26లో ఎక్సైజ్ శాఖకు భారీ ఆదాయం సమకూరింది. రాష్ట్రంలోని 2,620 వైన్ దుకాణాల(ఎ4) ద్వారా అద్దె రూపంలో రూ.1,771 కోట్లు వచ్చాయి. 1,214 బార్ల ద్వారా మరో రూ.549కోట్లు లభించాయి. కొత్త దుకాణాల కోసం వచ్చిన 95,628దరఖాస్తుల ద్వారారూ.2,869 కోట్ల నాన్-రిఫండబుల్ ఆదాయం రావడం విశేషం. అంటే..మద్యం అమ్మకాల ద్వారా వచ్చిన రూ.39,368 కోట్ల ఆదాయంతో పాటు అన్ని రకాల ఫీజులు, దరఖాస్తు రుసుములతో కలిపి ఆదాయం రూ.44,557 కోట్లకు చేరింది. కాగా, తెలంగాణ ఏర్పడిన తర్వాత నుంచి ఎక్సైజ్ ఆదాయం నిరంతరాయంగా పెరుగుతూనే ఉంది. 2015-16లో కేవలం రూ.12,706 కోట్ల మద్యం అమ్మకాలు జరగ్గా.. ఇప్పుడు అది రూ.40వేల కోట్లకు చేరింది. అంటే మద్యం అమ్మకాలు సుమారు మూడు రెట్లు పెరిగాయి.

## రేషన్ కార్డుల తొలగింపు దుర్మార్గపు చర్య

అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు ఉపయోగపడే రేషన్ కార్డుల విషయంలో ఇలాంటి చర్యలు మానుకోవాలని హితవుపలికారు. కొండగట్టు చలువ పందిళ్ల ప్రమాదంపైనా కవిత స్పందించారు. పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. కొండగట్టు అంజన్న ఆలయంలో చలువ పందిళ్లు కూలి 15 మంది గాయపడడంపై విచారం వ్యక్తం చేశారు. హనుమాన్ చిన్న జయంతి వేడుకల కోసం నాసిరకం పందిళ్లు వేయడంతోనే ప్రమాదం జరిగిందని కవిత ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఉత్సవాల సమయంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆగ్రహించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు. గాయపడిన భక్తులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలన్నారు. ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## నేటి నుంచి భూభారతి అమలు

తెలంగాణలో భూ వివాదాలకు ప్రభుత్వం చెక్ పెట్టనుంది . ఏప్రిల్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా భూభారతి సేవలు అమలు చేయనుంది. ప్రయోగాత్మకంగా 5 మండలాల్లో పోర్టల్ ప్రారంభం కానుంది. ఖమ్మం జిల్లా కూసుమంచి, భద్రాద్రి జిల్లా అశ్వరావుపేట, రంగారెడ్డి జిల్లా ఆమన్ గల్, సంగారెడ్డి జిల్లా వట్ పల్లి,నారాయణపేట జిల్లా కోస్గి మండలాల్లో భూభారతి అమలు సేవలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పోర్టల్ ప్రారంభంపై బుధవారం అధికారులతో మంత్రి పొంగలేటి శ్రీనివాస్ రెడ్డి రివ్యూ నిర్వహించారు . ఈ సందర్భంగా భూభారతితో భూవివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ ఐదు మండలాల్లో వచ్చే ఫలితాలను బట్టి అవసరమైన మార్పులు చేసి, రెండో దశలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని చెప్పారు. ఎన్నికల హామీ మేరకు భూభారతి చట్టాన్ని తెచ్చామని, వ్యవసాయ భూముల క్రయవిక్రయాల సమయంలో సర్వే మ్యాపును జతపరిచే నిబంధనను కూడా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఐదు మండలాల్లో ప్రతీ సర్వే నంబర్‌కు ఆధార్ తరహాలోనే భూధార్ నంబర్‌ను కేటాయించనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. ఇప్పటికే నక్ష లేని ఐదు గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసి, భూధార్ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఒక్క క్లిక్‌తో రైతుల భూములకు సంబంధించిన పూర్తి సమాచారం లభించేలా పోర్టల్‌ను రూపొందించామని, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్ ద్వారా లాగిన్ అయ్యి వివరాలు పొందవచ్చని చెప్పారు. ధరణిలో 36 మాడ్యూల్స్ ఉండగా.. వాటి గందరగోళానికి చెక్?పెడుతూ భూభారతిలో అన్నింటినీ ఒకే చాప్టర్ కిందకు తీసుకువచ్చినట్లు స్పష్టం చేశారు.

## కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తీపి కబురు

, మైనార్టీ సంక్షేమ శాఖల్లో పనిచేసే వేలాది మందికి లబ్ధి చేకూరనుంది. నేరుగా ఖాతాల్లో జమ కావడం వల్ల పారదర్శకత పెరుగుతుంది.ప్రభుత్వ శాశ్వత ఉద్యోగులకు ప్రస్తుతం ఏ విధంగానైతే 'ఇంటిగ్రేటెడ్ ÷నాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' ద్వారా జీతాలు అందుతున్నాయో, అదే విధానాన్ని కాంట్రాక్ట్ సిబ్బందికి కూడా వర్తింపజేస్తున్నారు. దీని కోసం ఇప్పటికే అన్ని జిల్లాల అధికారులు సిబ్బంది ఆధార్ కార్డులను వారి బ్యాంక్ ఖాతాలతో అనుసంధానం చేసే ప్రక్రియను పూర్తి చేశారు. ఉన్నతాధికారులకు ఇందుకు సంబంధించిన డేటాను కూడా పంపడం జరిగింది. ముఖ్యంగా మున్సిపాలిటీల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు, టెక్నికల్ వర్కర్లు గతంలో అనేక కష్టాలు పడేవారు. స్థానిక పన్నులు వసూలైతేనే జీతాలు ఇస్తామనే నిబంధనలతో అధికారులు వారిపై ఒత్తిడి తెచ్చేవారు. టా÷-గ్గ÷ట్లు పూర్తికాకపోతే నెలల తరబడి వేతనాలు ఆగిపోయేవి. దీంతో కార్మికులు తమ నిత్యవసరాల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులపాలయ్యేవారు. ఇప్పుడు ప్రభుత్వం నేరుగా నిధులు విడుదల చేయనుండటంతో, పన్నుల వసూళ్లతో సంబంధం లేకుండా ప్రతి నెలా ఒకటో తేదీనే జీతం వచ్చే అవకాశం ఏర్పడింది.

## కాజీపేట రైల్వే డివిజన్‌ను తక్షణమే ఏర్పాటు చేయండి:

డబ్లింగ్ పనులు పూర్తయితే ఈ ట్రాక్ పరిధి 3,150 కిలోమీటర్లకు చేరుకుంటుందని తెలిపారు. భారతీయ రైల్వేల పరిపాలనా ప్రమాణాల ప్రకారం ఒక డివిజన్‌కు ఉండాల్సిన పరిమితి కంటే ఇది ఎక్కువ అన్నారు. ఎక్కువ కిలోమీటర్లు, పనిభారం కారణంగా సికింద్రాబాద్ డివిజన్ నిర్వహణ క్లిష్టంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది రైళ్ల రాకపోకలపై తీవ్ర ప్రభావం చూపుతోందని అన్నారు. కాజీపేట కేంద్రంగా డివిజన్‌ను ఏర్పాటు చేస్తే పరిపాలనా సులువు అవుతుందని అన్నారు. పరిపాలనా సౌలభ్యం, కార్యకలాపాల రీత్యా కాజీపేట డివిజన్ అత్యవసరమని ఆ లేఖలో పేర్కొన్నారు.

## అమరావతి బిల్లుకు చట్టబద్ధత కల్పించడాన్ని స్వాగతిస్తున్నాం...

ఒక రాష్ట్రానికి చట్టబద్ధతతో ముందుకు తీసుకెళ్లే చర్యలు తీసుకుంటూ, మరో రాష్ట్రానికి ఇచ్చిన హామీలను విస్మరించడం సరైనది కాదని మంత్రి అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ విభజన చట్టంలో పొందుపరిచిన అన్ని హామీలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# నారాయణపురం లో డి .ఎం.హెచ్.ఓ వెంకటరమణ



## గిరిజన మహిళకు ప్రోత్సాహకం

**బండి ఆత్మకూరు నంది పత్రిక ఏప్రిల్ 1:** నంద్యాల జిల్లా ఆరోగ్య వైద్యాధికారి వెంకటరమణ బుధవారం మధ్యాహ్నం బండి ఆత్మకూరు మండలం పరిధిలో ఉన్న నారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో వైద్య శాఖకు సంబంధించిన వివిధ రికార్డులను డిఎంహెచ్వో పరిశీలించారు. ఏ బి హెచ్ ద్వారా ప్రతి గర్భవతికి అభా కింద లింకు అయిందా లేదా అన్న విషయాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు. బుధవారం తెల్లవారుజామున నారపురెడ్డి కుంటకు చెందిన వెంకటమ్మ అనే గిరిజన మహిళలకు మహిళ కు ఏడవ కాన్పు చేశారు. సందర్భంగా ఆమె ఆరోగ్య పరిస్థితులను గురించి డి .ఎం.హెచ్ అడిగి తెలుసుకున్నారు. గిరిజన మహిళలకు ప్రోత్సాహం కింద రెండు వేల రూపాయల నగదును డిఎంహెచ్వో వెంకటరమణ స్వయంగా అందజేశారు. గర్భకోశ క్యాన్సర్ వ్యాధులు రాకుండా 19 సంవత్సరాల లోపు వయసు కలిగిన వారికి వ్యాక్సిన్ వేసే విధానాన్ని గురించి వైద్య సిబ్బందితో వాకబు చేశారు. అనంతరం డిఎంహెచ్వో నారపురెడ్డి గుంట చెంచుగూడెం ని సందర్శించారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ ఇటీవల లాంచ్ చేసిన మీ ఇంటికి మీ డాక్టర్ ప్రోగ్రామ్ను పరిశీలించారు. మీ ఇంటికి మీ డాక్టర్ వాహనంలో సరియైన వైద్య సిబ్బంది ఉన్నారా లేదా అన్న విషయాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు. వేసవికాలం కాబట్టి గిరిజన ప్రాంతాల్లోని ప్రజలు డీహైడ్రేషన్ కు గురి అయ్యే అవకాశం ఉంటుందని, వారి కి అనునిత్యం ఓ ఆర్ ఎస్ పాకెట్లను అందజేయాలని సూచించారు. తన వాహనంలో సుమారు రెండు డబ్బాలకు పైగా టిఆర్ఎస్ పాకెట్లను తీసుకుని వచ్చి చెంచుగూడెంలో గిరిజనులకు అందజేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది తమ పర్ఫార్మెన్స్ ను పెంచుకోవాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించి భోజనాల



ఏర్పాటు పై వాకబు చేశారు. సూపర్వైజర్ లు అనునిత్యం ప్రజాక్షేత్రంలో పర్యటించి ప్రజల ఆరోగ్యం విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. రక్తహీనత కలిగిన వారందరినీ గుర్తించి వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రజా ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ అనునిత్యం అప్రమత్తంగా వ్యవహరించాలని వైద్య సిబ్బందిని డిఎంహెచ్వో వెంకటరమణ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్సిసిడి, ఆర్ బి ఎస్ కె జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ కాంతారావు నాయక్ తో పాటు, వైద్యాధికారులు దినేష్ కుమార్, హేమంతా సమీరా, ఎం పి హెచ్ ఓ వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్ మోహన్ నాయక్ తో పాటు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# పాణ్యం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

### సేవల మెరుగుదలకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు



**పాణ్యం/నంద్యాల బ్యూరో, ఏప్రిల్ 01(నంది పత్రిక):–** జిల్లాలో ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవల నాణ్యతను మరింత మెరుగు పరచాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం పాణ్యం మండల కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో అందిస్తున్న సేవలు, ప్రజలకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు, సేవల అందించే సమయం, ప్రజల సంతృప్తి స్థాయి వంటి అంశాలపై కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. సేవలలో పారదర్శకత, వేగం, ప్రజలకు సులభతరం కావడం వంటి అంశాలపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తనిఖీ సమయంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో ఉన్న డాక్యుమెంట్ రైటర్లు జిల్లా కలెక్టర్ గారిని గమనించగానే తమ దుకాణాలను వదిలి వెళ్లిపోవడం గమనించిన ఆమె, దీనిని తీవ్రంగా పరిగణించారు. అనుమతులు, నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్నట్లు అనుమానాస్పదంగా ఉన్న సంబంధిత దుకాణాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అవసరమైన చట్టపరమైన చర్యలలో భాగంగా ఆయా దుకాణాలను సీజ్ చేయించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలలో నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి కార్యకలాపాలు జరగకూడదని, ప్రజలను తప్పుదారి పట్టించే చర్యలకు ఎట్టి పరిస్థితుల్లోనూ తావు ఉండదని స్పష్టం చేశారు. ప్రతి శాఖలోనూ పారదర్శకత, బాధ్యతాయుత వ్యవహారం తప్పనిసరిగా ఉండాలని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా అధికారులు పని చేయాలని ఆమె సూచించారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు వేగంగా, నిష్పక్షపాతంగా అందేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజా అభిప్రాయాన్ని మెరుగుపరచాలి

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల బ్యూరో, ఏప్రిల్ 01(నంది పత్రిక):–** ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రజల సంతృప్తిని ప్రధాన లక్ష్యంగా తీసుకొని జిల్లాలకు, అధికారులకు ర్యాంకింగ్లు ఇవ్వబడుతున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయం (పబ్లిక్ పర్సెప్షన్) పెంపుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అన్ని సంక్షేమ పథకాలలో కనీసం 80 శాతం నుండి గరిష్టంగా 95 శాతం వరకు ప్రజా సంతృప్తి సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లబ్ధిదారుల నుంచి ఫీడ్బ్యాక్ సేకరిస్తున్నప్పటికీ ప్రజా సంతృప్తి స్థాయి ఎందుకు పెరగడం లేదని ప్రశ్నించారు. జిల్లాలోని వివిధ శాఖల పనితీరు, ఎకనామిక్ కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లు (కేపీఐ లు) నమోదు, శాఖల మధ్య సమన్వయం, డేటా నమోదు ఖచ్చితత్వం, లక్ష్యాల సాధనపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. కేపీ ఐ ల నమోదు విషయంలో నిర్లక్ష్యం అస్సలు ఉండకూడదని, ప్రతి వివరాన్ని ఖచ్చితంగా



నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. అన్ని శాఖలు 'ఏ' లేదా 'ఏ+' గ్రేడ్లు సాధించేలా కృషి చేయాలని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ పనితీరును సమీక్షిస్తూ, రబీ వరి ఉత్పత్తిలో లక్ష్యాన్ని మించి సాధించారని, మొక్కజొన్న పంటలో కూడా మంచి ఫలితాలు వచ్చాయని, మినుముల ఉత్పత్తిలో లక్ష్యాన్ని చేరుకోవాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. మామిడి దిగుబడులు ఏప్రిల్ నుండి జూన్ వరకు నమోదయ్యే నేపథ్యంలో వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగులో లక్ష్య సాధన ఉన్నప్పటికీ గ్రేడ్ తగ్గడం పట్ల కలెక్టర్ ప్రశ్నించారు. హార్టికల్చర్ పరిధిలో స్వీట్ ఆరెంజ్, టమోటా, బెండ, బీన్స్, అరటి, చెరకు వంటి పంటల ఉత్పత్తి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. సెరికల్చర్ విభాగం పట్టు గూళ్ల ఉత్పత్తిలో 'ఏ' గ్రేడ్ సాధించడం సంతోషకరమని అన్నారు. పశుసంవర్ధక శాఖలో పాలు, మాంసం ఉత్పత్తిలో లక్ష్యాలను మించి సాధించి 'ఏ+' గ్రేడ్ పొందడం అభినందనీయమని, గుడ్ల ఉత్పత్తిలో లోటును అధిగమించాలని సూచించారు. మత్స్యశాఖలో ఫిషింగ్, ఆక్వాకల్చర్ ఉత్పత్తి వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. విద్యుత్ ఉత్పత్తి, వినియోగంలో జిల్లా 'ఏ ' మరియు 'ఏ+' గ్రేడ్లలో ఉందన్నారు. గనులు మరియు ఖనిజాల విభాగంలో సున్నపు రాయి వంటి ఖనిజాల ఉత్పత్తిని లక్ష్యాలకు మించి పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు సంబంధించిన సూచికలను కూడా కేపీలల్లో భాగంగా పరిగణించాలని పేర్కొన్నారు. స్త్రీ–శిశు సంక్షేమం, పోషకాహార లోపం తగ్గింపు, ఎటిఎం ల సంఖ్య, నేరాల తగ్గింపు వంటి అంశాల డేటాను సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. మెడికల్, హెల్త్, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ వంటి విభాగాలు డేటా నమోదు ఆలస్యం చేయకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ప్రజాభిప్రాయం మెరుగుపరచడం, కే పి ఐ ల ఖచ్చితమైన నమోదు, డాక్యుమెంట్ల అప్లోడింగ్, వాట్సాప్ సేవల విస్తరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# ఆటిజం ఉందని అధైర్య పడవద్దు

### అంతర్జాతీయ ఆటిజం దినోత్సవం
### ఏప్రిల్ 2న డా. శ్వేత రాంపల్లి
### కన్సల్టెంట్ పీడియాట్రిక్ న్యూరాలజిస్ట్

**కర్నూలు నంది పత్రిక....**మీ పిల్లలు మిమల్ని అమ్మా అని పిలవడం లేదా!, మీ చిట్టి తల్లి మీ కళ్లల్లో కళ్లు పెట్టి చూడటం లేదా!, మీ బుజ్జి పిల్ల ఒంటరిగా ఉండానికి ఇష్టపడుతుందా! ఆటిజం దినోత్సవం నాడు నీలి రంగుల వెలుగులు కాదు, ఆటిజంతో బాధపడుతున్న చిన్నారుల భవిష్యత్తుకు బాటలు వేద్దాం. పిల్లలు కళ్లల్లో కళ్లు పెట్టి చూడలేక పోవటం, తమ తోటి పిల్లలతో కలిసి ఆడుకోలేక పోవటం, మనుషులతో ఉండటం కంటే ఎక్కువ సమయం ఆట వస్తువులతో గడపడం, ఒంటరిగా ఉండటానికి ఇష్టపడటం, ప్రవర్తనలో విపరీత ధోరణి కనబడటం, తమలో తాము మాట్లాడుకోవడం, తమ భావాలను వ్యక్త పరచలేక పోవడం, ఒకచోట స్థిమితంగా కూర్చోలేక పోవడం, ఏకాగ్రత తక్కువగా ఉండటం., ఎక్కువగా గుండ్రంగా తిరిగే వస్తువులను చూడటం మరియు ఆడటం, తమ నీడతో తాము



ఆడుకోవడం, ఎలాంటి అనుభూతిని కూడా తెలుపలేక పోవడం, శబ్దాలను పట్టించుకోక పోవడం, పిలిచినా పలుకక పోవడం, చేసిన పనులనే మళ్లీ మళ్లీ చేస్తూ ఉండటం, సరిగా మాట్లాడలేక పోవడం వంటి సమస్యలతో బాధపడుతున్నారా!ఈ లక్షణాలు కనబడితే తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వెంటనే అప్రమత్తమై తగిన చికిత్స తీసుకుంటే ఈ సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. లేదంటే మిన్ను విరిగి మీద పడి, మీ పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుంది జాగ్రత్త!! ఇవి ఆటిజం లక్షణాలు. ఆటిజం అనేది పిల్లల్లో వచ్చే ఒక న్యూరోలాజికల్ డెవలప్మెంట్ డిజార్డర్. ఇది జబ్బు కాదు. ఇది ఒక స్థితి దీనివల్ల పిల్లల్లో సోషల్ ఇంటరాక్షన్, కమ్యూనికేషన్ మరియు ప్రవర్తనా సమస్యలు, వయస్సుకు తగిన మానసిక పరిపక్వత లేకపోవడం, సెన్సరీకి సంబంధించిన సమస్యలు ఉండటం వలన ఇది పిల్లల ఎదుగుదలకు మానసికంగా చాలా ఇబ్బందులు పెడుతుంది. ఆటిజం అనేది ఒక పెద్ద సమస్య, దీనిని నివారించడంలోనే అనేక సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుంది. సాధారణంగా అటిజం లక్షణాలు మూడేళ్ల వయస్సు నిండకముందే కలిపిస్తాయి. ఇది లింగ భేదంతో సంబంధం లేకుండా వచ్చే సమస్య. ఈ సమస్య కలిగిన వారు తరుచుగా మూర్ఛవ్యాధి, హైపరాక్టీవ్ డిజార్డర్ వంటి రుగ్మతలను సైతం కలిగి ఉంటారు. – ఆటిజం రావడానికి కారణాలు: పిల్లల మెదడు ఎదుగుదలలో లోపాలు, జన్యుపరమైన లోపాలు, గర్భధారణ సమయంలో ఇన్ఫెక్షన్ల బారినపడటం, తీవ్రమైన ఉద్వేగాలకు లోనవడం, నెలలు నిండకుండా శిశువు జన్మించడం, పౌష్టికాహార లోపం, ఇవే కాకుండా పరిస్థితులు, పరిసరాల ప్రభావం, తల్లిదండ్రులు నాణ్యమైన సమయాన్ని పిల్లలతో గడపలేక పోవడం, రోజులో ఎక్కువ సమయం మొబైల్స్, టీవీలు చూడటం, ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై పోవడం, పిల్లలకు ఆటలు ఆడే సమయం లేకపోవడం, ఆహారపు అలవాట్లల్లో మార్పులు, పాతకాలం నాటి ఆటలు కనుమరుగై పోవడం, పాతకాలం నాటి అలవాట్లు, పద్ధతులను వదిలి అధునికతవైపు పరుగులు తీయడం, విపరీతంగా మొబైల్స్, టీవీలు చూడటం ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ (ఉూణ)లో చాలా రకాలు ఉన్నాయి. 1) అటిస్టిక్ డిజార్డర్: అటిస్టిక్ డిజార్డర్ ఎక్కువగా కనిపించే సమస్య ఆటిజంను ఎక్కువగా మగ పిల్లల్లో గమనించ వచ్చును. 2) రెట్స్ డిజార్డర్: ఇది అజంలో అరుదైన రకం. ఈ సమస్య ఆడ పిల్లల్లో ఎక్కువగా కనిపిస్తుంది. 3) చైల్డ్ హుడ్ డిసెంటిగ్రేటెడ్ డిజార్డర్: ఇది ఆటిజంలో తీవ్రమైన సమస్య 4) యాస్పర్జర్స్ డిజార్డర్: ఈ పిల్లల్లో తెలివి తేటలు ఎక్కువగా ఉంటాయి. వీరు ప్రత్యేకమైన పనుల్లో మంచి నైపుణ్యంను ప్రదర్శిస్తారు. 5) వర్చువల్ ఆటిజం: ఇది అతిగా మొబైల్, టీవీ స్క్రీన్ చూడటం వలన వచ్చే సమస్య, వీరికి హైపరాక్టీవ్, రెస్ట్ లెస్ గా ఉండటం, సోషల్ విజ్ఞాన్ అవ్వడం, బిహేవియర్ సమస్యలు మరియు ఎదుగుదల సమస్యలు ఉంటాయి. కాని ఇది న్యూరోలాజికల్ డెవలప్ మెంటల్ డిజార్డర్ కాదు. 6. ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ను రివర్స్ చేయడానికి ఏ విధమైన చికిత్స అందుబాటులో లేదు. అందుబాటులో ఉన్న అన్ని చికిత్స పద్ధతుల యొక్క ముఖ్య లక్ష్యం బలహీనతలను తగ్గించి, వారి సామర్థ్యములను పెంచడమే. ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్లో పిల్లవాడు విభిన్నంగా ఉండటమే కాకుండా ప్రత్యేక అవసరాలు కలిగి ఉంటాడు. ఆటిజం స్పెక్ట్రం యొక్క సమస్యలు తగ్గించడానికి బిహేవియర్ థెరపి (ూదీూ), కాగ్నిటీవ్ థెరపి, జాయింట్ అటెన్షన్ థెరపి, అక్యుపేషనల్ థెరపి, స్పీచ్ అండ్ లాంగ్వేజ్ థెరపి, ఫిజికల్ థెరపి, సెన్సరీ ఇంటిగ్రేషనల్ థెరపి, మ్యూజిక్ థెరపి వంటి థెరపీల ద్వారా పిల్లల యొక్క సమస్యలను తగ్గించి వీరిని కూడా అందరి పిల్లల మాదిరిగానే మెయిన్ స్ట్రీం చేయడానికి మల్టీ డిసిప్లీనరీ టీమ్ సహాయ పడుతుంది.ఆటిజం సమస్యను అతి చిన్న వయస్సులో 0–3 సంవల వయస్సులో గుర్తించి వారికి ఎర్లీ ఇంటర్వెన్షన్ ద్వారా, అర్లీ స్టిమ్యులేషన్ ఇవ్వడం ద్వారా వీరు కూడా సాధారణ పిల్లల మాదిరిగా వారి జీవన శైలిని కొనసాగించగలరు.

# ప్రత్యేక అవసరాల పిల్లలు, అంగన్వాడీలు, పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించండి





### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**పాణ్యం/నంద్యాల బ్యూరో, ఏప్రిల్ 01(నంది పత్రిక):–**

జిల్లాలో ప్రభుత్వ విద్యా, పోషణ సేవల నాణ్యతను మెరుగుపరచడమే లక్ష్యంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం పాణ్యం మండలంలో విస్తృతంగా పర్యటిస్తూ పలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సేవల అమలు తీరును సమీక్షిస్తూ సంబంధిత అధికారులకు కీలక సూచనలు జారీ చేశారు. మొదటగా సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక అవసరాల పిల్లల శిక్షణ కేంద్రం (భవిత సెంటర్)ను పరిశీలించిన కలెక్టర్, కేంద్రం పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం, పిల్లల హాజరు శాతం తక్కువగా ఉండడం, సరైన వసతులు లేకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లలకు అనుకూలమైన వాతావరణం కల్పించడం, హాజరు శాతం పెంచడం, అవసరమైన అన్ని సౌకర్యాలను తక్షణం కల్పించాల్సిందిగా ఆదేశించారు. అలాగే ఐఈ రిసోర్స్ పర్సన్ల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని గట్టిగా ఆదేశించారు. అనంతరం పాణ్యం మండలంలోని అంగన్వాడి కేంద్రాలు (4, 5)ను పరిశీలించిన కలెక్టర్, పిల్లల హాజరు నమోదు విధానాన్ని సమీక్షించి హాజరు శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. వంటగదిలోని ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి, ప్రభుత్వం నిర్దేశించిన మెనూను ఖచ్చితంగా అమలు చేయాలని అధికారులకు ఆదేశించారు. కేంద్ర పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ, ముఖ్యంగా టాయిలెట్ల నిర్వహణలో నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తదుపరి పాణ్యం మండలంలోని ఎంపీ యుపిఎస్ ఉర్దూ పాఠశాలను పరిశీలించిన కలెక్టర్, మధ్యాహ్న భోజన పథకం అమలుపై సమగ్రంగా ఆరా తీశారు. సన్నబియ్యం సరఫరా జరుగుతోందా అనే అంశాన్ని అధికారులను అడిగి తెలుసుకుంటూ, విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని స్పష్టం చేశారు. అదేవిధంగా విద్యార్థుల హాజరు నమోదు విధానం, పాఠశాల పరిసరాల పరిశుభ్రతపై ఉపాధ్యాయులకు సూచనలు జారీ చేశారు. పిల్లల విద్య, ఆరోగ్యం, పోషణ అంశాలలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు కావడం ద్వారా ప్రజలకు పూర్తి స్థాయి లాభాలు అందేలా అధికారులు కట్టుబడి పనిచేయాలని సూచించారు. సంబంధిత విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని కలెక్టర్ ఆదేశించారు.

## మళ్లీ భారీగా పెరిగిన బంగారం, వెండి ధరలు

బంగారం, వెండి ధరలు మళ్లీ భారీగా పెరిగాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పడుతున్న సంకేతాల నేపథ్యంలో, ఖరీదైన లోహాల ధరలు పెరుగుతున్నాయి. మహావీర్ జయంతి సందర్భంగా నిన్న బులియన్ మార్కెట్కు సెలవు రోజు. కిలో వెండి ధర సోమవారం నాటి ముగింపు రూ.2.37 లక్షలతో పోలిస్తే రూ.9 వేలు పెరిగి రూ.2.46 లక్షలకు చేరుకుంది. 10 గ్రాముల మేలిమి బంగారం ధర మొన్నటితో పోలిస్తే రూ.3,500 పెరిగినట్లు ఆలిండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ఈరోజు రూ.3,500 పెరిగి రూ.1.55 లక్షల వద్ద, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.1.51 లక్షలు పలుకుతోంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టవచ్చనే సంకేతాలకు తోడు, కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లను పెంచకపోవచ్చనే అంచనాలు బంగారం, వెండి ధరల భారీ పెరుగుదలకు కారణమైంది.

ఇదిలా ఉండగా, 2025–26 ఆర్థిక సంవత్సరంలో బంగారం ధర ఏకంగా 61 శాతం పెరిగింది. గత ఏడాది ఏప్రిల్ 1న 10 గ్రాముల బంగారం ధర రూ.94,150గా ఉండగా ఇప్పుడు రూ.1,51,000 దాటింది. ఏడాది కాలంలో బంగారం రూ.57 వేలకు పైగా పెరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో బంగారం ఒకానొక సమయంలో రూ.1,70,000 దాటింది. కిలో వెండి ధర గత ఏడాది ఏప్రిల్ 1న రూ.1.34 లక్షలుగా ఉండగా, ఏడాది కాలంలో రూ.1 లక్షకు పైగా పెరిగింది. ఒకానొక సమయంలో వెండి కిలో రూ.4 లక్షలు దాటింది.

# వసతి గృహాల్లో ఆహారంలో నాణ్యత లేకపోతే కఠిన చర్యలు తప్పవు





## పట్టుదలతో కష్టపడి చదవండి

## బాల్య వివాహాలు వద్దు:స్థిరత్వం సాధించిన తర్వాతే వివాహాలు చేసుకోవాలి

## జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి

**కర్నూలు, నంది పత్రిక.....**వసతి గృహాల్లో విద్యార్థులకు అందించే ఆహారంలో నాణ్యత లేకపోతే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు.బుధవారం గోనెగండ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల వెనుకబడిన సంక్షేమ శాఖ వసతి గృహాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలో స్టోర్ రూమ్ లో కూరగాయలు, ఆహారపదార్థాలను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థినులతో ముచ్చటించి, విద్యా బోధన, భోజనం,బాల్య వివాహాలు తదితర అంశాలపై మాట్లాడారు. విద్యార్థి దశ అనేది జీవితానికి పునాది వంటిదని, ఈ దశలోనే ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన దిశగా కృషి చేస్తే భవిష్యత్తులో మంచి స్థాయికి చేరుకోవచ్చని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి పేర్కొన్నారు.మొదటగా స్టోర్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. ఎండిపోయిన పచ్చిమిర్చి కనిపించడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఆహార పదార్థాల నాణ్యతలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని సంబంధిత అధికారులను ఆదేశించారు. వసతి గృహ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.భోజనం, విద్య,వసతి తదితర అంశాలపై ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ చేస్తోందని, అధికారులు ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. మెనూ ప్రకారం భోజనం అందుతోందా, ఆహారం నాణ్యత ఎలా ఉంది, సరిపడా ఇస్తున్నారా అని ఆరా తీశారు. వారానికి ఎన్ని గుడ్లు అందిస్తున్నారు , చిక్కీలు వంటి పోషకాహారం అందుతున్నాయా అనే విషయాలను అడిగి కూడా తెలుసుకున్నారు. త్రాగునీటి వసతి, టాయిలెట్ల పరిశుభ్రత, వసతి గృహంలో ఇతర సౌకర్యాలపై విద్యార్థులను ప్రశ్నించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.. అలాగే బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తూ, ఎక్కడైనా అలాంటివి గమనించినట్లయితే వెంటనే ఉపాధ్యాయులు లేదా వార్డెన్ కు సమాచారం ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. బాల్య వివాహాలు వద్దని, జీవితంలో స్థిరత్వం సాధించిన తర్వాతే వివాహం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు జీవితంలో ఎదురయ్యే కష్టాలను ధైర్యంగా ఎదుర్కొని పరిష్కరించుకోవాలని, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండి చదువుపై పూర్తి దృష్టి పెట్టాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదల, కష్టపడి చదవడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని కలెక్టర్ ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి రాధిక, బిసి వెల్ఫేర్ అధికారి ప్రసూన, ఎంపీడీవో మణి మంజరి తదితరులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ కళాశాలకు పుస్తకాలు బహుకరణ



**నంద్యాల ప్రతినిధి. ఏప్రిల్ 01 . (నంది పత్రిక ):**స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో సాంకేతిక విజ్ఞానాన్ని అభ్యసించే విద్యార్థులు మాతృభాషలోని మాధుర్యాన్ని, సాహిత్య విలువలను కూడా పెంపొందించుకోవాలని ప్రముఖ రచయిత కొప్పుల ప్రసాద్ ఆకాంక్షించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల గ్రంథాలయానికి ఆయన తాను స్వయంగా రచించిన పుస్తకాలను విరాళంగా అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ శైలేంద్ర కుమార్ పుస్తకాలను స్వీకరించి, రచయితను ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా కొప్పుల ప్రసాద్ మాట్లాడుతూ.. "సాంకేతిక విద్యార్థులకు తెలుగు భాషపై అవగాహన ఉండటం ఎంతో అవసరం. సాహిత్యం కేవలం వినోదం కోసం మాత్రమే కాదు, అది విద్యార్థులలో సామాజిక స్పృహను పెంపొందించి, ఉన్నతమైన వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడుతుంది" అని పేర్కొన్నారు. విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని ఆయన కోరారు.అనంతరం ప్రిన్సిపాల్ శైలేంద్ర కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రయోజనం కోరి తమ కళాశాల గ్రంథాలయానికి పుస్తకాలను బహుకరించిన రచయితకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్టీసీ బస్సులు ప్రమాదాలకు గురి అవుతున్న..
## ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలుస్తున్న ఇక్కడ ఆర్టీసీ
## బస్సులు రోజు రాంగ్ రూటు లోనే ప్రయాణం.




**శిరివెళ్ల :(నంది పత్రిక)** నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారిన 40 జాతీయ రహదారిలో ప్రతిరోజు రాంగ్ గ్రూప్లో ప్రయాణిస్తూ ప్రయాణికుల రక్షణను గాలికి వదిలేసిన ఆర్టీసీ బస్సులు నంద్యాల జిల్లా సిరివెళ్ల మెట్ట 40వ జాతీయ రహదారి ప్రక్కన ఒక దాబా హోటల్లో ప్రతిరోజు ఆర్టీసీ డ్రైవర్ కండక్టర్లకు ఉచిత భోజన సదుపాయం ఏర్పాటు చేయడంతో ప్రయాణికులను లెక్కచేయకుండా వారి సంక్షేమాన్ని ఆలోచించకుండా ప్రతిరోజు రాంగ్ రూట్లో ప్రయాణం చేస్తూ నిర్లక్ష్యం వహిస్తున్న సంఘటనలు సిరివెళ్ల మిట్ట వద్ద ప్రతిరోజు చోటు చేసుకుంటున్నాయి సిరివెళ్ల మెట్ట వద్ద ఒక ప్రైవేటు బస్సు ఒక లారీ ఢీకొని రెండు వాహనాలు అగ్నికి ఆహుతి కాగా సుమారు ముగ్గురు ప్రాణాలు కోల్పోయి 20 మంది తృటిలో బయటపడిన సంఘటన జరిగినప్పటికీ నిర్లక్ష్యపు మత్తు వీడడం లేదని పలువురు ఘాటుగా విమర్శిస్తున్నారు. రోడ్డు సేఫ్టీ అధికారులను పోలీసు యంత్రాంగాన్ని ట్రాఫిక్ కంట్రోల్ లను రోడ్డు నియమ నిబంధనలను తుంగలో తొక్కుతూ ఆర్టీసీ బస్సులు రోజు రాంగ్ రూట్లో వెళ్లడం ఎంతవరకు సబబు అని పలువురు ప్రశ్నిస్తున్నారు ప్రభుత్వ యంత్రాంగం జిల్లా కలెక్టర్ గారు జిల్లా ఎస్పీ గారు స్పందించి ఈ రాంగ్ రూట్లో వెళుతున్న బస్సులపై సీసీ కెమెరాలు ఆధారంగా తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు సూచిస్తున్నారు.

## పన్ను చెల్లింపుదారులకు గుడ్ న్యూస్...
## నేటి నుంచి కొత్త ఆదాయపు పన్ను చట్టం

భారత ప్రత్యక్ష పన్నుల వ్యవస్థలో సరికొత్త అధ్యాయం మొదలైంది. దశాబ్దాల నాటి ఆదాయపు పన్ను చట్టం 1961 స్థానంలో, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'ఆదాయపు పన్ను చట్టం, 2025' నేటి నుంచి (ఏప్రిల్ 1) అధికారికంగా అమల్లోకి వచ్చింది. వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా, పన్నుల విధానాన్ని మరింత సరళంగా, వినియోగదారులకు అనుకూలంగా మార్చే దిశగా ఈ చట్టాన్ని తీసుకొచ్చినట్లు ఆదాయపు పన్ను శాఖ 'ఎక్స్' వేదికగా ప్రకటించింది.

కొత్త చట్టం ప్రధాన లక్ష్యం పన్ను చెల్లింపుదారులకు ఎదురవుతున్న గందరగోళాన్ని తగ్గించడం. పాత చట్టంలోని భాష క్లిష్టంగా ఉండటం, కాలం చెల్లిన నిబంధనలు చేరడంతో ఏళ్ల తరబడి పన్ను చెల్లింపు ప్రక్రియ సంక్లిష్టంగా మారింది. ఈ సమస్యలను అధిగమించేందుకు, పన్నుల విధానంలో పారదర్శకతను పెంచి, అనవసరమైన వ్యాజ్యాలను తగ్గించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు కొత్త చట్టంలో భాషను సులభతరం చేయడంతో పాటు, పాత నిబంధనలను తొలగించారు.

ఈ చట్టంతో పాటే 'ఆదాయపు పన్ను నియమాలు, 2026' కూడా నేటి నుంచే అమల్లోకి వచ్చాయి. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ (సీబీడీటీ) నోటిఫై చేసిన ఈ కొత్త రూల్స్, పాత నియమాల స్థానాన్ని భర్తీ చేశాయి. వీటిలో డిడక్షన్ పరిమితులు, పాన్ కార్డుకు సంబంధించిన నూతన ఆవశ్యకతలు, సులభతరం చేసిన రిపోర్టింగ్ ఫార్మాట్లు వంటి మార్పులు ఉన్నాయి. ఈ మార్పుల వల్ల వ్యక్తులు, వ్యాపార సంస్థలకు రిటర్న్ ఫైల్ చేయడం మరింత సులభం కానుందని ప్రభుత్వం భావిస్తోంది.

# జీ రామ్ జీ'ని రద్దు చేయాల్సిందే..
# ఉపాధి హామీని రక్షించుకుందాం

### ఏప్రిల్ 10 నుంచి అనంతపురం - బండ్లపల్లి
### పాదయాత్రను జయప్రదం చేయండి
### ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు




**నంద్యాల ప్రతినిధి. ఏప్రిల్ 01 . (నంది పత్రిక ):**కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'వీబీ జీ రామ్ జీ' విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని, గ్రామీణ పేదల బతుకుదెరువుకు ఆధారమైన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్ డిమాండ్ చేశారు. బుధవారం నంద్యాల పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు కె. రాధాకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధి హామీ చట్టం కొనసాగింపు లక్ష్యంగా ఏప్రిల్ 10, 11, 12 తేదీల్లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కె. రామకృష్ణ నాయకత్వంలో, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్. కోటేశ్వరరావు, ఆవుల శేఖర్ నేతృత్వంలో అనంతపురం నుంచి బండ్లపల్లి వరకు నిర్వహించనున్న పాదయాత్రను విజయవంతం చేయడానికి జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేపట్టాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తూ, చట్టంలోని కీలక నిబంధనలను నిర్వీర్యం చేస్తోందని వారు విమర్శించారు. పాత చట్టం స్థానంలో 'జీ రామ్ జీ' వంటి పథకాలను తీసుకురావడం కేవలం బూటకమని, ఇది కూలీల హక్కులను హరించడమేనని మండిపడ్డారు. పనులు కల్పించకపోవడం, వేతనాల్లో కోత విధించడం వల్ల గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు వలస వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని, దీనివల్ల కార్పొరేట్ శక్తులకే మేలు జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే రోజులలో పార్టీ శ్రేణులు, ప్రజాసంఘాలు గ్రామాల్లోని జాబ్ కార్డు దారుల దగ్గరకు వెళ్లి ప్రచారాన్ని ఉధృతం చేయాలని స్పష్టం చేశారు.పాదయాత్ర వివరాలను వెల్లడిస్తూ.. ఏప్రిల్ 10న అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లి వద్ద ఐదుకల్లు సదాశివన్ స్మారక స్తూపం (సమతాగ్రామ్) నుంచి యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. మొదటిరోజు ఆకుతోటపల్లి, ఎస్కేడీ యూనివర్సిటీ మీదుగా సంజీవపురం వరకు, 11న కాటమయ్య కొండ నుంచి పప్పూరు వరకు యాత్ర కొనసాగుతుంది. చివరి రోజైన 12న పప్పూరు నుంచి ఉపాధి హామీ పథకం పురిటిగడ్డ అయిన బండ్లపల్లికి చేరుకుని, అక్కడ భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ బహిరంగ సభకు సీపీఐ జాతీయ కార్యదర్శి డి. రాజా, జాతీయ కార్యదర్శి అని రాజా పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ పోరాటం ద్వారా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఉపాధి హామీని కాపాడుకోవడమే తమ లక్ష్యమని, ప్రజాస్వామ్యవాదులు, అన్ని వర్గాల ప్రజలు ఈ యాత్రకు సంఘీభావం తెలపాలని వారు కోరారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ హరినాథ్, జిల్లా ఉపాధ్యక్షులు ప్రతాప్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు జి. లక్ష్మీదేవి, బీకేయంయు సభ్యులు సామేలు, మనోహర్, మాణిక్యమ్మ, రాణమ్మ, నాగరాజు, లక్ష్మయ్య, దస్తగిర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగం పోయిందంటూ ఉదయాన్నే
## మెయిల్... ఒరాకిల్ ఉద్యోగుల ఆవేదన

ప్రముఖ టెక్ దిగ్గజం ఒరాకిల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న వేలాది మంది ఉద్యోగులకు బుధవారం ఉదయం పిడుగులాంటి వార్త ఎదురైంది. రోజూలాగే విధులకు సిద్ధమవుతున్న సమయంలో, ఉదయం 6 గంటల నుంచే కొందరికి టర్మినేషన్ ఈ-మెయిల్స్ రావడంతో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. ఏం జరిగిందో తెలుసుకునే లోపే, భారీ ఎత్తున లేఆఫ్స్ జరిగాయన్న వార్త ఆన్‌లైన్‌లో వేగంగా వ్యాపించింది. దీంతో ఉద్యోగులు తీవ్ర ఆందోళనకు, అనిశ్చితికి గురయ్యారు. ఈ ఊహించని పరిణామంతో షాక్‌కు గురైన అనేక మంది ఉద్యోగులు సోషల్ మీడియా వేదికగా తమ ఆవేదనను పంచుకుంటున్నారు. "ఏడాది క్రితమే కంపెనీలో చేరాను. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా, ఉద్యోగం నుంచి తీసేస్తున్నట్టు ఉదయాన్నే మెయిల్ వచ్చింది" అని ఓ ఉద్యోగి ఆవేదన వ్యక్తం చేశారు.

# లబ్దిదారుల ముంగిటకే ఎన్టీఆర్ భరోసా

### జిల్లాలో ఏప్రిల్ మాసంలో 2,35,692 మందికి రూ.104.18 కోట్ల రూపాయల పెన్షన్లు పంపిణీ - జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



**కర్నూలు, నంది పత్రిక....**లబ్దిదారుల ముంగిటకే వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను అందచేస్తూ, ఏప్రిల్ మాసంలో జిల్లాలో అర్హులైన 2 లక్షల 35 వేల 692 మంది లబ్దిదారులకు రూ. 104.18 కోట్లు పంపిణీ చేయడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు. బుధవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో భాగంగా గోనెగండ్ల మండలంలోని కైరవాడి గ్రామంలో అయ్యమ్మ కు వృద్ధాప్య పెన్షన్, నాగలక్ష్మి, రంగమ్మ లకు వితంతువు పెన్షన్, బోయ చిన్న సోమన్న, శ్రీ నిత్య, రహేలమ్మ లకు వైకల్య పెన్షన్ లను కలెక్టర్ అందజేశారు...ఈ సందర్భంగా కలెక్టర్ లబ్దిదారులకు పెన్షన్ లను పంపిణీ చేస్తూ వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులతో, వికలాంగులతో కలెక్టర్ ఆత్మీయంగా మాట్లాడుతూ ఇంట్లో వారు ఎలా చూసుకుంటున్నారు, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పెన్షన్ ప్రతి నెల సరైన సమయానికి అందిస్తున్నారా, అని కలెక్టర్ ఆరా తీశారు. నాగలక్ష్మి కి వితంతువు పెన్షన్ అందచేస్తున్న సమయంలో కేవలం వ్యవసాయం మాత్రమే చేయడం కాకుండా పాడి పశువులను కూడా పెంచుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి కి సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డిఆర్డిఎ పిడి రమణారెడ్డి, గోనెగండ్ల తహసిల్దార్ రాజేశ్వరి, ఎంపిడిఓ మణి మంజరి, తదితరులు పాల్గొన్నారు..



# గాజులదిన్నె ప్రాజెక్ట్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

**కర్నూలు, నంది పత్రిక.....**గోనెగండ్ల మండలంలోని గాజులదిన్నె ప్రాజెక్ట్ ను బుధవారం జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పరిశీలించారు..ఈ సందర్భంగా కలెక్టర్ ప్రాజెక్ట్ వద్ద సాగు నీటి సరఫరా పరిస్థితులు, నీటి సామర్థ్యం పెంపు పనుల పురోగతి, జలాశయం నీటి నిల్వ స్థాయి, సాగు కాల్వల నిర్వహణ పనులు, మరమ్మత్తులు తదితర అంశాల గురించి అధికారులతో ఆరా తీశారు.గాజుల దిన్నె ప్రాజెక్ట్ కు సంబంధించి కోడుమూరు నియోజకవర్గంలో కెనాల్స్ లైనింగ్,ఇతర మరమ్మతులకు రూ.2.66 కోట్లు మంజూరు చేసేందుకు ముఖ్యమంత్రి ఆమోదించారని కలెక్టర్ తెలిపారు.. ఎక్కడెక్కడ ఈ పనులు చేపట్టాలి అనే అంశంపై కలెక్టర్ అధికారులతో చర్చించారు.. ఇరిగేషన్ అధికారులు బాగా పని చేసి రైతులకు సహకరించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో గోనెగండ్ల తహసీల్దార్ రాజేశ్వరి, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు..



# ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసిన టిడిపి జిల్లా ఉపాధ్యక్షురాలు కల్లూరి శకుంతలమ్మ నీటి సంఘం వైస్ చైర్మన్ భూసి రెడ్డి.

**శిరివెళ్ల :-(నంది పత్రిక)** సిరివెళ్ల మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో అర్హులైన పెన్షన్ దారులకు తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షురాలు కల్లూరి శకుంతలమ్మ శేష ఓబులరెడ్డి మరియు నీటి సంఘం వైస్ చైర్మన్ సి బూసిరెడ్డి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం ఆళ్లగడ్డ శాసన సభ్యురాలు భూమా అఖిలప్రియ గారి ఆదేశాల మేరకు సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేశామని శకుంతలమ్మ తెలియజేశారు. వృద్ధులు వికలాంగులు వితంతువులు దీర్ఘకాలిక రోగులకు ఆర్థికంగా అండగా నిలవడానికి రూపొందించిన ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా లబ్ధిదారులకు నెలకు రూ. 4,000 నుంచి రూ. 15,000 వరకు ఆర్థిక సాయం అందించడం జరుగుతున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది లబ్ధిదారులు పాల్గొన్నారు.



# గ్రామ స్వరాజ్య సాధనలో గ్రామసభలే కీలకం



**కరీంనగర్/ హైదరాబాద్.ఏప్రిల్ 01 . (నంది పత్రిక ):**తెలంగాణ రాష్ట్రంలో ఏప్రిల్ 2వతేది నుండి ప్రజాపాలన ప్రగతి ప్రణాళికల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా12760 గ్రామపంచాయి తీల్లో గ్రామసభలు నిర్వహించనున్న నేపథ్యంలో గ్రామీణాభివృద్ధి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి (దనసరి అనసూయ) సీతక్క గ్రామ సభలకు విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించి గ్రామసభకు గ్రామస్థులు అందరు హాజరయ్యేలా చూడాలని అధికారులకు సూచించడం గమనార్హం.గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులు రైతులు యువత సర్పంచులు స్వయం సహాయక సంఘాల సభ్యులు సంక్షేమ పథకాల లబ్ధిదారులు గ్రామ సభలో పాల్గొనేట్లు విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలన్న మంత్రి సీతక్క సూచన ప్రాధాన్యత సంతరించుకుంది.కేంద్ర ప్రభుత్వం 15 వ ఆర్థిక సంఘం రాష్ట్రంలోని పంచాయతీలకు రూ" 619 కోట్లు నిధులను విడుదల చేసింది. మరో వెయ్యి కోట్ల రూపాయలు నిదులు విడుదల కావలసి ఉందని పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు తెలిపారు.గ్రామసభలో గ్రామ పంచాయతీ నిధులు ఆదాయాల మీద సమగ్ర చర్చచేసి గ్రామ సమస్యలను గ్రామ సభల్లో సమగ్రంగా చర్చిస్తారు.పల్లెల్లో గ్రామపంచాయతీలలో స్థానిక స్వపరిపాలన ప్రారంభ మైంది.గ్రామస్థాయిలోప్రజాస్వామ్యపాలనకు పారదర్శనికత జవాబుదారీతనానికి గ్రామసభలు ఆయువుపట్టు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికల కార్యక్రమాల అమలు ద్వారా సమగ్ర గ్రామాణాభి వృద్ధిలో గ్రామసభ కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ గ్రామసభలు చాలా చోట్ల నామమాత్రమైనాయి. గ్రామసభ నిర్వహణలో అనేకసమస్యలు సవాళ్లు ఎదురౌతున్నాయి.గ్రామసభలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం పైప్రభుత్వం దృష్టిపెట్టాలి.

**ప్రజల్లో అవగాహన లోపం.**

ప్రజలకు /ఓటర్లకు గ్రామసభ పై అవగాహనలేదు.చాలాగ్రామాల్లో నిరక్షరాస్యత ఉంది. ప్రశ్నించే తత్వంలేదు .గ్రామస్తులకుగ్రామసభఅధికారాలు విధులు బాధ్యతలు పనిచేసే విధానంప్రాముఖ్యత గురించితెలియదు .గ్రామసభఅంటేప్రభుత్వం నిర్వహించే కార్యక్రమం ఒకతంతు అని తెలుసు.గ్రామసభ అంటే ప్రభుత్వ కార్యక్రమం అనే అభిప్రాయం ప్రజల్లో నాటుకొని ఉంది. తమ తలరాతలు మార్చుకోవడానికి తమ బతుకుల్లో వెలుగులు తేవడానికి తమప్రణాళికలు తామే రూపొందించుకునే వేదిక అనే విషయం చాలామంది గ్రామీణులకు తెలియకపోవడం విచారకరం. గ్రామసభ సమావేశాలు ప్రభుత్వ సమావేశాలుగా భావిస్తున్నారే తప్ప గ్రామ అభివృద్ధి కొరకు జరిగే సమావేశంగా భావించడంలేదు. అందువల్ల చాలామంది గ్రామాలలో ప్రజలు/ఓటర్లు గ్రామ సభలో పాల్గొనడానికి ఆసక్తి చూపడం లేదు.

**రాజకీయ జోక్యం ఆధిపత్యం.** గ్రామ సభలో రాజకీయ జోక్యం ఎక్కువైంది. అధికారంలో ఉన్న వర్గంయొక్క ఆధిపత్యం గ్రామసభలో రాజ్యమేలటం గమనార్హం. ప్రభుత్వ లబ్దిదారుల ఎంపికలో అధికారవర్గానికి పెద్దపీట వేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.గ్రామంలో వర్గాల ఆధిపత్య పోరుకు గ్రామసభను వేదికగా ఎంచుకుంటున్నారని పరిశోధనలు తెలుపు తున్నాయి.అధికారపక్షం తమ కార్యకర్తలకు తమ కులం వారికి ప్రాధాన్యత ఇచ్చే సభగా గ్రామసభ మారిపోయింది. గ్రామసభ పై బలమైన సామాజిక వర్గం అధికారం చెల్లించడం తమ నియంత్రణలోఉంచుకోవడం సామాన్యులు తమ సమస్యలను వినిపించే స్థితిలో లేరు.ఒకవేళ హాజరై సమస్యలను సభదృష్టికి తీసుకు వచ్చినప్పటికీ గ్రామపంచాయతీ పాలకవర్గం అధికారులు ఆసమస్యలపై చర్చించడం లేదు . సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించిన దాఖలాలులేవు.సామాన్యుల యొక్కసూచనలు విజ్ఞప్తులు బుట్ట దాకలౌతున్నాయి. అందువల్ల సామాన్యులు గ్రామ సభ అంటే గ్రామంలోఉన్న ఆధిపత్య కులాలు అధికార వర్గం యొక్క పోరాట వేదికగా భావిస్తున్నారు. ప్రజావాణిని వినిపించే ప్రజా సంక్షేమం గురించి చర్చించే సభగా పరిగణించడం లేదు.

**కోరం బికనీస సంఖ్య లేకపోవడం.** గ్రామసభ నిర్వహించడానికి కావలసిన కోరం కనీస సంఖ్యలో(ఓటర్లు) ప్రజలు హాజరు కావడం లేదని వాయిదా వేయడం జరుగుతుంది. గ్రామసభను నామమాత్రంగా నిర్వహించి సంతకాలు తీసుకొని ముగిస్తున్నారు.గ్రామసభకు హాజరుగాని వార్డుసభ్యుల ఇంటికివెళ్లి సంతకాలు తీసుకుంటున్నారు.ఈవిధానం మారాలి.

**గ్రామసభ బి పల్లె ప్రజాస్వామ్యానికి వేదిక.** సమిష్టి నిర్ణయాలకు గ్రామసభ వేదికగా మారాలి .పల్లెల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలి. మహిళలకు బలహీన వర్గాలకు భాగస్వామ్యం లేకపోవడం.గ్రామసభలకు గ్రామంలోని మహిళలు ఎస్సీలు ఎస్టీలుహాజరుకావడంలేదు.కొన్నిగ్రామాలలో నేటికీ అమలౌతున్న అంటరానితనం.సామాజికకట్టుబాట్లు భయం వల్ల ప్రజలు తమ సమస్యలను స్వేచ్ఛగా వివరించ లేకపోతున్నారు. వారి అభిప్రాయాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడంలేదు.కాబట్టిమహిళాభ్యుదయం ఎస్సీ ఎస్టీ సంక్షేమం అభివృధి సంక్షేమ పథకాలు అమలు అటుకెక్కడం వల్ల మహిళా సాధికారిత యువజన సాధికారిక ఎస్సీ ఎస్టీ సంక్షేమం సంక్షోభంలో పడింది.

**అధికారుల సమన్వయ లోపం.** ప్రభుత్వానికి సంబంధించిన వివిధ విభాగాల అధికారులు గ్రామ సభకు హాజరుకావడం లేదు ఆఫీస్ గుమస్తాలను తమ ప్రతినిధులుగా పంపిగ్రామసభలోవచ్చినదరఖాస్తులను స్వీకరిస్తున్నారు. అధికా రుల్లో సమన్వయ లేదు. గ్రామసభజరుగు నప్పుడు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి.వ్యవసాయంవిద్యుత్తువిద్య మరియు పారిశుధ్యం ఆరోగ్యం విద్య కు సంబంధించిన అధికారులు హాజరు కావడం లేదు.ప్రజలు/ ఓటర్లు అడిగే ప్రశ్నలకు సమాధానం ఇచ్చేవారు గ్రామసభలో లేకపోవడం వల్ల చాలామంది ఓటర్లు /ప్రజలు గ్రామసభకు హాజరు కావడంపై ఆసక్తి చూపడం లేదు.

**నిధుల కొరత బినిర్ణయాల అమలులో జాప్యం .**

గ్రామసభలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడానికి గ్రామపంచాయతీల దగ్గర తగిన నిధులులేవు. నిధుల కొరత రాజ్యమేలుతుంది. ఫైనాన్స్ కార్పొరేషన్ (ఆర్థిక సంఘం)ద్వారా సకాలంలో నిధులు మంజూరు కాకపోవడం.చాలాగ్రామ పంచాయతీలకు ఆర్థిక వనరులు కొరతగా ఉన్నాయి.

**స్థానిక సంస్థల అధికారాలు బదిలీ కాలేదు.**

రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 (బి) 73వరాజ్యాంగ సవరణ చట్టం 1992 ప్రకారం పంచాయతీరాజ్ చట్టానికి నిర్దిష్ట నిబంధనలు ఆయా రాష్ట్రప్రభుత్వాలురూపొందించుకునే అధికారం ఇచ్చింది .గ్రామ సభకు రాజ్యాంగ హోదా ఇవ్వడంజరిగింది.73 74 వ రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థల సాధికారిత కొరకు రూపొందించిన అంశాలు నేటికి స్థానిక సంస్థలకు పూర్తిగా బదిలీ కాలేదు. స్థానిక సంస్థల చట్టంలో పేర్కొన్న అంశాలు నేటికీ కాగితాలికే పరిమిత మైనాయి.గ్రామపంచాయతీలకు ఏఅంశాలపైనిర్ణయం తీసు కోవాలనేవిషయంలోగ్రామ పంచాయతీ అధికారులకు సిబ్బందికిస్పష్టత లేకపోవడం గొప్ప లోపం. సభలో చేసినతీర్మానాలుకాగితాలకేపరిమితమోతున్నాయి.ప్రజలకుగ్రామసభలపైనమ్మకంసడలిపోతుంది .ప్రచారం లేకపోవడం గ్రామసభ ఎప్పుడు నిర్వహిస్తారు ?ఎక్కడ నిర్వహిస్తారు? ఏ సమయంలో నిర్వహిస్తారుఅనేటువంటి విషయంలోస్పష్టతలేదు. ప్రచారంసమాచారం ప్రజలకు ముందే చేరకపోవడం వల్ల చాలామంది ఓటర్లు /ప్రజలు గ్రామ సభలకు హాజరు కావడం లేదని పరిశోధనలో తేలింది. గ్రామ సభ ఉందని చాటింపు వేయడం .నోటీస్ బోర్డు వరకేపరిమితం కావడం వల్ల అందరికి సమాచారం అందడం లేదు .

**గ్రామ సభ నిర్వహణలో ఎదురవుతున్నసవాళ్లు**

పరిష్కారాలు.గ్రామసభసమర్థవంతంగానిర్వహించ డంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించడానికి ప్రభుత్వం తగు సంస్కరణలు ప్రవేశపెట్టి అమలు చేయాలి.

**డిజిటల్ సాధనాల వినియోగంబి బివిస్తృత ప్రచారం**

స్వచ్ఛంద సంస్థలు సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారంచేయాలి.గ్రామంలోఉన్నఅంగన్వాడీకేంద్రాల్లోకులసంఘాలకుస్వశక్తిమహిళాసంఘాలకుయువజనసంఘాలకుగ్రామసభ నిర్వహణతేదీసమాచారాన్నితేలిపేనోటీస్ ద్వారా తెలుపాలి. డిజిటల్ సాధనాల వినియోగం పెరగాలి .క్షేత్రస్థాయిలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి గ్రామ సభల నిర్వహణలో డిజిటల్ సాధనాలవినియోగాన్నిపెంచాలి . సభసార్ వంటి ఎ, ఐ ఆధారిత సాధనాలు పంచాయితీ నిర్ణయ్ ఆప్ ను ప్రవేశపెట్టారు. వీటి ద్వారా గ్రామసభ చర్చలు రికార్డు చేయడం సులభం. మహిళ యువజన భాగస్వామ్యాన్ని పెంచడానికిస్వశక్తి పంచాయితీ నేత్రి అభయాన్ ప్రారంభించబడింది .యువతను గ్రామ పాలనలో భాగస్వాములు చేయడానికి మోడల్ యూత్ గ్రామసభను ప్రోత్సహిస్తున్నారు. **సబ్కా యోజన సబ్కా వికాస్.** సబ్కా యోజన సబ్కా వికాస్ నినాదంతో గ్రామ పంచాయతీ అభివృద్ధిప్రణాళి కలరూపకల్పన లోప్రజలనుభాగస్వామ్యం చేయడానికి వీజ= ఎ=ణ సెంటర్ ఫర్ఎక్సెన్స్ ద్వారాగ్రామసభలనిర్వహణ సామర్థ్యాన్నిపెంచ టానికిశిక్షణఅవగాహన కల్పిస్తున్నారు.రాజూరూ చట్ట పరిధిలో గల గ్రామ సభల నిర్వహణ సామర్థ్యాన్ని పెంచటానికి ప్రత్యేక నిధులు కేటాయించి శిక్షణఇస్తున్నారు.

గిరిజన ప్రాంతాల్లో స్థానిక పాలన పటుత్వానికి పలు చర్యలు తీసుకుంటున్నారు.

**గ్రామసభ బితీర్మానాలు సమీక్ష.** గ్రామసభలో తీసుకున్నతీర్మానాలపై ఎప్పటికప్పుడేసమీక్షనిర్వహించాలి. ఆమోదించిన జమఖర్చులు పద్దులు ఆడిట్ నివేదికలు ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల పేర్లు ఎంపిక వివరాలు నివేదిక రూపంలో గ్రామసభకుఅందుబాటులోఉంచాలి .ప్రస్తుతంచేపట్టేప్రాజెక్టులుభవిష్యత్తులో చేపట్టబోయే ప్రాజెక్టుల గురించిసమగ్రమైనరిపోర్టులేదానివేదికలనుగ్రామపంచాయతీలో అందుబాటులో ఉంచాలి.

**గ్రామసభ ఎజెండా నివేదిక కాపీలు సర్క్యులేట్ చెయ్యాలి.** ప్రతి వార్డ్ మెంబర్ కిఒక కాపీని సర్క్యులేట్ చేయాలి. గ్రామసభకు హాజరైనటువంటి ఓటర్లకు గత గ్రామసభలోతీసుకున్న నిర్ణయాలు అమలుమీదసమగ్రసమీక్షనిర్వహించాలి. కార్యక్రమాలనిర్వహణలో ఎదురవుతున్నసమస్యలపై సమగ్రంగా చర్చించాలి. గ్రామంలో ఉన్న ప్రతి ఓటరు గ్రామ పంచాయతీఎన్నికల్లో ఓటువేసేటప్పుడుచూయించిన ఉత్సాహంకంటేరెట్టింపైన ఉత్సాహంతోగ్రామసభ సమావేశాల్లోపాల్గొనాలితన గొంతును గట్టిగావినిపించాలి. గ్రామసభలోసామాన్యులఅభిప్రాయాలకు విలువ ఇవ్వాలి.

**ప్రత్యేక బాక్సులు ఏర్పాటు చేయాలి.** ఓటర్లుగ్రామసభజరగనిసమయంలో తమ సమస్యలనుతెలుపడానికి నిర్మాణాత్మక సలహాలు ఇవ్వడానికి గ్రామపంచాయతీలో కంప్లైంట్ బాక్స్ ను ఏర్పాటు చేయాలి. ప్రజావాణి కార్యక్రమం ఏర్పాటు చేయాలి.ప్రతిగ్రామ పంచాయతీకార్యాలయంలో మెరుగైనగ్రామపాలనకు అవసరమైనసూచనలు ఇవ్వడానికిగ్రామపంచాయతీలో ప్రతి వారం నిర్దేశించిన రోజు ప్రజావాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మెరుగైన పాలనలో పల్లె పౌరుల భాగస్వామ్యాన్ని పెంచాలి.రోజువారీగాబాక్సులను తెరిచి వచ్చిన సూచనలను రికార్డు చేసిగ్రామసభలోవాటిపరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలి.

**గ్రామ సభ తీర్మానాలు శాసనం లాంటివి.**

గ్రామసభఅంటేఓటర్ల సభగ్రామసభతీర్మానాలుశాసనంలాంటివి . గ్రామ సభప్రజాస్వామ్య వేదిక సర్పంచ్ నుండి సామాన్యునివరకు అందరూ కలిసిసమష్టినిర్ణయాలు తీసుకుంటారు.

**నిధులు వినియోగం నియంత్రణ**

**గ్రామసభ.** నిధుల వినియోగం నియంత్రణ నివారణలో గ్రామ సభ కీలక పాత్ర పోషిస్తుంది. అవినీతి అంతం చేయడానికి అభివృద్ధి పథకాల్లో జరుగుతున్న అవకతవకలు అరికట్టడంలో గ్రామసభ కీలకపాత్ర పోషిస్తుంది.

**గ్రామసభ ప్రజల వద్దకు పాలన.** ప్రజల వద్దకుపాలనఅందించడంలో గ్రామసభ వారధి.గ్రామ స్వరాజ్యం సాధనలోప్రభుత్వ యంత్రాంగం క్రియాశీలక పాత్ర పోషిస్తుంది. జిల్లాకలెక్టర్ జాయింట్ కలెక్టర్ వివిధ విభాగాల జిల్లాస్థాయి అధికారులుగ్రామసభలసమావేశాలకు హాజరు కావాలి. గ్రామ ప్రజలు ఎదుర్కునేసమస్యల పరిష్కారానికి కృషిచెయ్యాలి.గ్రామంలో వ్యవసాయం విద్య పారిశుద్ధ్యం డ్రైనేజీనిర్వహణ నర్సరీ పెంపకం వ్యవసాయ మార్కెట్ కాలువల నిర్వహణ భూమివివాదాలు గట్టు సమస్యలు పంట పొలాల దగ్గరకు తోవ భూసార పరీక్ష భూ సర్వే విత్తనాలు ఎరువులు పశువుల పెంపకం తాగునీరు కోతులు బెడద మొదలగు రైతుల ఇబ్బందులను గ్రామసభలోచర్చించిపరిష్కరించాలి.

**గ్రామ సభ బిప్రజా ప్రతినిధులు.** గ్రామసభ సమావేశాలకుప్రజాప్రతినిధులు ఎంపీలు ఎమ్మెల్యేలు హాజరు కావాలి .ఓటర్లు /ప్రజలు తమ సమస్యలను చెప్పుకునే అవకాశం ఉంటుంది. తమ సమస్యలను చెప్పుకోవడానికి పార్లమెంటుకు అసెంబ్లీకి ప్రజలు వెళ్లలేరు. ప్రజలందరూ పాల్గొనే గ్రామసభలకు ఎంపీలుఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు హాజరై ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి.ఎంపీ ఎమ్మెల్యే కు తమ నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి తగిన ప్రాతినిధ్యం జరపడానికి గ్రామసభలు తోడ్పడతాయి. ఎంపీ ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు ప్రభుత్వాధికారులు గ్రామ సభలకు హాజరైతే తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే విశ్వాసం ప్రజలకు/ ఓటర్లకు కలుగుతుంది. గ్రామ సభలు విజయవంతం అవుతాయి. గ్రామ స్వరాజ్యం సాకారం అవుతుంది.

**గ్రామసభబి బడ్జెట్ ఆడిట్ నివేదిక.** గ్రామ సభగ్రామ బడ్జెట్ ఆడిట్ నివేదికను ఆమోదించాలి. తెలంగాణ గ్రామ పంచాయతీ చట్టం 2018 ప్రకారం సంవత్సరానికి నాలుగు గ్రామ సభలుజరగాలి.ప్రతి ఏటా కనీసం4సార్లు గ్రామసభ సమావేశాలునిర్వహించాలి.గ్రామసభతీర్మానాలనుఅమలుచేయకపోతేసర్పంచ్ పై చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు సిఫారసు చేసే అధికారం గ్రామ సభకుఉంటుంది.

**గ్రామసభ స్వరాజ్య సాధన.** బాపూజీ భావించిన గ్రామ స్వరాజ్యం సాకారం కావాలంటె గ్రామ సభలో ఎంపీలు ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొని సమన్వయంతో గ్రామ సమగ్ర అభివృద్ధి కొరకు ప్రణాళికల రూపకల్పన చేయాలి. గ్రామ అభివృద్ధి వ్యవహాలతో కార్యాచరణచేపడితే గ్రామ సమస్యల పరిష్కరమై గ్రామ స్వరాజ్య లక్ష్యం నెరవేరుతుంది.

**గ్రామ సభబి స్థానిక సంస్థల సాధికారిత.** ప్రభుత్వం స్థానిక సంస్థలసాధికారిత కు ఆర్థిక పరిపుష్టికిచట్టబద్ధమైన సంస్కరణలు తీసుకొని మెరుగైన స్థానికపాలనకుతగుకార్యాచరణతో ముందుకు వచ్చి గ్రామాభివృద్దే దేశాభివృద్ధి దిశగా సమగ్రమైన చర్యలు చేపడుతుందని ఆశిద్దాం.

నేదునూరి కనకయ్య
అద్యక్షులు
తెలంగాణ ఎకనామిక్ ఫోరం
మాజీ కరెస్పాండెంట్
జస్టిస్ కుమారయ్య
లా కాలేజీ కరీంనగర్
(ఉమ్మడి ఆంధ్రప్రదేశ్
హైకోర్టు మాజీ చీఫ్
జస్టిస్ జస్టిస్ కుమారయ్య
1969 1971)

## నిరుపేదల ముఖాల్లో చిరునవ్వులు పూయించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యం..

### డోన్ ఎమ్మెల్యే కోట్ల



**నందిపత్రిక -ప్యాపిలి** నిరుపేదల ముఖాల్లో చిరునవ్వులు పూయించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు.బుధవారం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఊటకొండ గ్రామంలో అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డోన్ ఎమ్మెల్యే శ్రీ కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డికి గ్రామస్థులు బ్రహ్మరథం పట్టారు. అధికారులు, నాయకులతో కలిసి ఆయన నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లారు. లబ్ధిదారుల చేతికి పింఛన్ నగదును అందజేసి, వారి యోగక్షేమాలను అడిగితెలుసుకున్నారు. వృద్ధులు, వికలాంగులతో ముచ్చటించి, ప్రభుత్వ సాయం సకాలంలో అందుతోందా లేదా అని ఆరా తీశారు. ఎమ్మెల్యే స్వయంగా తమ ఇంటికి రావడంతో లబ్ధిదారులు ఆనందబాష్పాలతో కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే ప్రసంగిస్తూ కూటమి ప్రభుత్వం పేదల పక్షపాతి అని ఆయన పునరుద్ఘాటించారు. ప్రతి పింఛన్ మీ భరోసా ప్రతి రూపాయి మీ అండ పేదల కళ్లలో ఆనందం చూడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యం.సంక్షేమ ఫలాలు కులమతాలకు అతీతంగా ప్రతి ఇంటికి చేరవేయడమే మా బాధ్యతగా భావిస్తున్నామన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ అనేది కేవలం డబ్బు మాత్రమే కాదు,అది వృద్ధులకు, వికలాంగులకు ప్రభుత్వం ఇచ్చే ఒక భరోసా. నియోజకవర్గ అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని, సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుంటామని హామీ ఇచ్చారు. ఎటువంటి వివక్ష లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలని అధికారులను ఆదేశించారు. డబ్బులను అందుకున్న వృద్ధులు, వికలాంగులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యే కోట్లకు ధన్యవాదాలు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పింఛన్ల పంపిణీ పారదర్శకంగా, గౌరవప్రదంగా జరుగుతోందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి బోయ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వలసల రామకృష్ణ,టి శ్రీనివాసులు,టిడిపి మండల అధ్యక్షులు మెట్టుపల్లి సుదర్శన్, ఎంపీడీవో శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకర్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ మనోహర్,ఉపాధి ఏపీఓ శ్రీవిద్య, హౌసింగ్ ఏఈ వెంకటేష్, ప్రతాప్,రామదాసు నాయకులు,అధికారులు పాల్గొన్నారు.

## ఊటకొండలో వైభవంగా వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ

### ముఖ్య అతిథిగా హాజరైన డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి



**నంది పత్రిక -ప్యాపిలి** ప్యాపిలి మండలంలోని ఊటకొండ గ్రామంలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక ఉత్సాహంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డోన్ నియోజకవర్గ శాసనసభ్యులు కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. గ్రామస్తులు, వాల్మీకి సంఘం నాయకులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి, వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఆవిష్కరించారు.

**ఆధ్యాత్మికతకు మార్గదర్శి వాల్మీకి ఎమ్మెల్యే** ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ వాల్మీకి మహర్షి కేవలం ఒక కులానికో, వర్గానికో పరిమితం కాదని, ఆయన ప్రపంచానికి ఆధ్యాత్మికతను, సమానత్వాన్ని, మానవ విలువలను పరిచయం చేసిన మహనీయుడు అని కొనియాడారు. రామాయణం వంటి గొప్ప కావ్యాన్ని అందించిన వాల్మీకి మార్గదర్శకత్వంలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం మాదిరిగానే ఊటకొండ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి బోయ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ వలసల రామకృష్ణ,టి శ్రీనివాసులు,సుదర్శన్,ఎంపిడివో శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకర్, ఉపాధి హామీ ఎపిఓ శ్రీవిద్య, హౌసింగ్ ఏఈ వెంకటేష్, ప్రతాప్,రామదాసు,దామోదర్,మద్దిలేటి,స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేతన్నల ఇళ్లలో ఉచిత కాంతులు విద్యుత్ పథకం అమలు..

### డోన్ ఎమ్మెల్యే కోట్ల



**నందిపత్రిక -ప్యాపిలి** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చేనేత కార్మికుల చిరకాల స్వప్నం నెరవేరిందని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు.నేతన్నల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ప్రకటించిన ప్రతిష్టాత్మక 'ఉచిత విద్యుత్' పథకం బుధవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా అమలులోకి వచ్చిందని మండలంలోని హుస్సేనపురం గ్రామంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో డోన్ ఎమ్మెల్యే ఈ పథకాన్ని ప్రారంభించి, లబ్ధిదారులకు భరోసా కల్పించారు. ఆర్థిక భరోసా మగ్గాల నిర్వహణలో విద్యుత్ బిల్లులు భారంగా మారి కునారిల్లుతున్న చేనేత రంగానికి ఈ పథకం ఒక వరమని ఎమ్మెల్యే కోట్ల అభివర్ణించారు. ప్రతి నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తారు. దీనివల్ల ఒక్కో చేనేత కుటుంబానికి ఏడాదికి సుమారు 8,640 వరకు ఆర్థికంగా ఆదా అవుతుందని మరమగ్గాలకు నెలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వర్తిస్తుందని దీని ద్వారా మరమగ్గాల కేంద్రాలకు ఏడాదికి 21,600 వరకు ఖర్చుతగ్గుతుందన్నారురాష్ట్రవ్యాప్తంగా ఉన్న 93,000 చేనేత కుటుంబాలకు, అలాగే 11,488 మరమగ్గాల కేంద్రాలకు ఈ నిర్ణయం వల్ల ప్రత్యక్ష లబ్ధి చేకూరనుందని ఇందుకోసం ప్రభుత్వం వార్షికంగా 150 కోట్ల బడ్జెట్‌ను కేటాయించిందని నేతన్నల కష్టంలో తోడుగా హుస్సేనపురం గ్రామస్థులతో మాట్లాడిన ఎమ్మెల్యే మన సంస్కృతికి ప్రతిబింబం నేతన్నలు శ్రమించే ప్రతి నూలుపోగులో ఒక కుటుంబం భవిష్యత్తు దాగి ఉంది. వారి కష్టాన్ని గుర్తించి, విద్యుత్ భారాన్ని పూర్తిగా తొలగించడం ద్వారా వారి నికర ఆదాయం పెరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఈ నిర్ణయం నేతన్నల ఇళ్లల్లో కొత్త వెలుగులు నింపుతుందన్ని, **భవిష్యత్ ప్రణాళికలు** గ్రామ పర్యటనలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న మరిన్ని సబ్సిడీలు, సంక్షేమ పథకాల గురించి ఎమ్మెల్యే వివరించారు. చేనేత రంగం పూర్వవైభవం సాధించేలా భవిష్యత్తులో మరిన్ని వినూత్న కార్యక్రమాలు తీసుకువస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ వలసల రామకృష్ణ, టి శ్రీనివాసులు, టిడిపి మండల అధ్యక్షుడు సుదర్శన్, ఎంపీడీవో శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# అధికారుల ఆదేశాలు బేఖాతార్...!





## పడకేసిన పారిశుద్ధ్యన్ని శుభ్రపరచని గ్రామాధికారులు.. బిల్లలాపురంలో కనిపించని స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర..

**నంద్యాల రూరల్, ఏప్రిల్01 (నంది పత్రిక):-** ఇటీవల నంది పత్రికలో ప్రచురమైన బిల్లలాపురం సమస్యల వరం కథనానికి స్పందించని అధికారులు. నంద్యాల జిల్లా నంద్యాల మండలం, బిల్లలాపురం గ్రామం లోని సమస్య లపై శనివారం నంది పత్రిక ఒక కథనాన్ని ప్రచురణ చేసిన విషయం తెలిసిందే. అయితే అధికారులు చర్యలు చేపట్టలేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు పారిశుధ్య పనులు నిలిపివేశారు. దీంతో మరుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుంది. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి అధికారులు గ్రామాల అభివృద్ధి కోసం నిధులు వెచ్చించి స్వర్ణాంధ్ర - స్వచ్ఛంద్ర కార్యక్రమంతో గ్రామాలను అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తున్నారు. అయితే క్రింది స్థాయి అధికారులు మాత్రం నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. దీంతో గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చూసినప్పటికీ చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు. అసలు గ్రామంలో అధికారులు ఉన్నారా లేదా అనే సందేహం వ్యక్తం అవుతుంది. మురుగునీటిలో ప్రజలు నిత్యం ప్రయాణం సాగిస్తుంటారు. గ్రామస్తులు నంద్యాలకు రావాలంటే ఈ మురుగునీటిలో ప్రయాణం సాగించి రావాల్సి ఉంది. దీంతో పలువురు గ్రామస్తులు ఈ మురుగు నీటిలో పలుమార్లు ప్రమాదానికి గురయ్యారు. అధికారులు తమ నిర్లక్ష్యాన్ని విడిచి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అలాగే కొత్త ఎస్సీ కాలనీ నీటి ట్యాంకు దగ్గర పైపులైన్ డ్రైనేజీలో ఉంది. దీని ద్వారా ప్రజలు వాడుకునే నీరు డ్రైనేజీ వాసన వస్తున్నాయి. ప్రజలు ఈ నీటిని వాడుకోవాలంటే తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు తక్షణమే అధికారులు స్పందించి పై రెండు సమస్యల కు పరిష్కారం చూపవలసిందిగా గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

## బిలకల గూడూరులో పండుగ వాతావరణం.



**నంది పత్రిక గడివేముల** గడివేముల మండల పరిధిలోని బిలకల గూడూరు గ్రామంలో బుధవారం నాడు పాణ్యం శాసన సభ్యురాలు గౌరు చరితా రెడ్డి గారి ఆదేశాల మేరకు పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం గ్రామ తెదేపా అధ్యక్షుడు షేక్ ఆజం ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా షేక్ ఆజం మాట్లాడుతూ ప్రతి నెల ఒకటవ తేదీన గ్రామంలో పండగ వాతావరణం తలపిస్తుందని అన్నారు. ఎందుకంటే పెన్షన్లు అందుకుంటున్న వారు చిరునవ్వులతో కూటమి ప్రభుత్వాన్ని మరియు చంద్రబాబు నాయుడు గారిని దీవిస్తుంటే సంతోషంగా ఉంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ప్రధాన కార్యదర్శి ఫరూక్. గడివేముల మండల తెదేపా ప్రధాన కార్యదర్శి షేక్ నజీర్ అహ్మద్. బిలకల గూడూరు టిడిపి నాయకులు మాజీ సర్పంచ్ సుదర్శన్ రెడ్డి. రఫీక్. జయప్రకాశ్ రెడ్డి. మరియు సచివాలయ సిబ్బంది. టిడిపి కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## ఏప్రిల్ 4నదొర్వి చెంచు లక్ష్మీనరసింహస్వామి నాగ ప్రతిష్ట ప్రథమ వార్షికోత్సవ వేడుకలు.




**రుద్రవరం ప్రతినిధి ఏప్రిల్ 01 (నంది పత్రిక):** రుద్రవరం మండల పరిధిలోని నల్లమల అడవి ప్రాంతంలో కొలువైన శ్రీ దొర్వి చెంచు లక్ష్మీనరసింహస్వామి, నాగప్రతిష్ట ప్రథమ వార్షికోత్సవ వేడుకలను ఈనెల 4వ తేదీ శనివారం (04-04-2026) నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు మరియు ఆలయ సేవకులు ఒక ప్రకటనలో తెలిపారు. పరాభవ నామ సంవత్సర చైత్ర బహుళ విదియ నాడు స్వాతి నక్షత్రయుక్త శుభ ముహూర్తాన ఉదయం నుండే గణపతి పూజ, పుణ్యాహవచనము, స్వామివార్లకు పంచామృతాభిషేకములు, కలశ స్థాపన మరియు లోక కళ్యాణార్థం గణపతి, సుదర్శన, మహాలక్ష్మి హోమాలతో పాటు నవగ్రహ హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి మహా పూర్ణాహుతి, మంగళహారతులు ఇవ్వనున్నారు. ఈ ఆధ్యాత్మిక మహోత్సవం సందర్భంగా భక్తుల కోసం అన్నదానము మరియు వివిధ భజన బృందాలచే సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేశారు. కావున రుద్రవరం మండలంలోని భక్తులందరూ మరియు సమీప గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేసి, నల్లమల కొండల్లో వెలసిన ఆ నరసింహస్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి, స్వామివారి కృపకు పాత్రులు కావాలని రుద్రవరం గ్రామ ప్రజలు మరియు భక్తుల బృందం కోరుతున్నారు.

## ఎమ్మెల్యే బుడ్డా చొరవతో ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఏప్రిల్1:** బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న సంత జూటూరు గ్రామంలో 25 కెవి మినీ ట్రాన్స్ఫార్మర్ ను ఏర్పాటు చేశారు. గ్రామంలోని శిల్పా నగర్ కి ఎదురుగా ఉన్న ప్లాట్ల సమీపంలో కొత్తగా ట్రాన్స్ ఫార్మర్ను ఏర్పాటు చేసి బుధవారం ప్రారంభించారు. విద్యుత్ సరఫరాలో లోడు ఎక్కువ కావడంతో ఈ ప్రాంతంలో తరుచూ అంతరాయం ఏర్పడుతూ ఉంది. ఈ విషయాన్ని సర్పంచ్ ఎలగాల రామచంద్రుడు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గ్రామంలో ట్రాన్స్ఫారం ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకుగాను, తాగునీటి సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే సహాయ సహకారాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటులో ఎమ్మెల్యే సహకారం ఎంతో ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు పలచాని మహేశ్వర్ రెడ్డి తో పాటు పలువురు నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ శ్రీ సద్గురు నరసవదూత స్వామి 38 వ ఆరాధన మహోత్సవాలు



**ఆదోని నంది పత్రిక ప్రతినిధి .ఏప్రిల్ 01.** ఆదోని మండల పరిధిలోని కపటి నాగలాపురం గ్రామంలో వెలిసిన శ్రీ శ్రీ సద్గురు నరసావదూత స్వామి వారి 38 వ ఆరాధన మహోత్సవాలు స్వస్తిశ్రీ పరాభవ నామ సంవత్సర చైత్రమాస బహుళ చతుర్దశి బుధవారం ఆరాధన జరుగును కావున అందరూ పాల్గొని తాత కృపకు పాత్ర కాగలరని మనవి బుధవారం హంపాయ పౌర్ణమి చతుర్దశి నాడు సాయంత్రం 6 గంటల నుండి గురు పుత్రులా ఉపన్యాసము రాత్రి 9:00 కు వినాయక పూజ గురుపూజ ఆరాధన కళశ పూజ ఘనంగా నిర్వహిస్తున్నట్లు శిష్యులు బృందం తెలియజేశారు గురువారం ఉదయం 6 గంటలకు గురుపూజ తీర్థ ప్రసాదాలు మరియు అన్నదాన కార్యక్రమం జరుగును నాగలపురం గ్రామ ప్రజలు చుట్టుపక్కల ఉన్న గ్రామ గ్రామాల్లో ఉన్న భక్తాదులు పాల్గొనవలసిందిగా కోరుకుంటున్నాము ఈ కార్యక్రమంలో నాగలాపురం గ్రామ శిష్యులుబృందం కీర్తిశేషులు నాగలాపురం పెద్ద మారన్న, పెద్ద కోతిలి లక్ష్మన్న, నాగలాపురం మండగిరి చౌడప్ప, ఆరెకల్ ఎం ఆంజనేయ, శిష్యులు నాగలాపురం కట్టమీద సుంకన్న, నాగలాపురం పెద్ద లింగారెడ్డి, నాగలాపురం మల్లికార్జున, ఆరెకల్ ఆదినారాయణ,పాల్గొన్నారు.

## మీనాక్షి నాయుడు కుటుంబానికి.. జీవితాంతం రుణపడి ఉంటా

### (.అడ్వకేట్) ఐసి. రామకృష్ణ



**, ఆదోని నంది పత్రిక ప్రతినిధి: ఏప్రిల్ 1** ఆదోని పట్టణంలోని ఇంద్రానగర్ టిడిపి వార్డు ఇన్చార్జ్ ఐసి. రామకృష్ణ తన రాజకీయ ప్రస్థానంలో కీలక మలుపు తీసుకువచ్చిన నాయకత్వంపై కృతజ్ఞతాభావం వ్యక్తం చేశారు. టిడిపి పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న తనను ఈ స్థాయికి తీసుకువచ్చింది మీనాక్షి నాయుడు కుటుంబమేనని, వారికి జీవితాంతం రుణపడి ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ను కలిసిన ఆయన, వార్డు అభివృద్ధి అంశాలపై చర్చించడం సంతోషకరంగా ఉందన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు తాను ఎప్పుడూ ముందుంటానని, పార్టీ ఇచ్చిన బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తానని స్పష్టం చేశారు. స్థానికంగా మౌలిక సదుపాయాల మెరుగుదల, పారిశుధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. ప్రజల ఆశలను నెరవేర్చడమే తన లక్ష్యమని ఐ సి. రామకృష్ణ పేర్కొన్నారు.

## జిల్లా అభివృద్ధికి పరిశ్రమలే ముఖ్యం

### ఎం ఎస్ ఎం ఈ పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించాలి

### తలసరి ఆదాయం పెంపు లక్ష్యంగా పని చేయాలి.

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

**కర్నూలు, నంది పత్రిక.....** జిల్లా అభివృద్ధికి పరిశ్రమలే పునాది అని, తలసరి ఆదాయం పెంచేందుకు పరిశ్రమల స్థాపనకు ప్రోత్సహించాలనిజిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు.బుధవారం కలెక్టరేట్ మిని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా పరిశ్రమలు మరియు ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం క్రింద రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న పరిశ్రమల ప్రోత్సాహకాన్ని వినియోగించుకొని మహిళలు, ఎస్సీ, ఎస్టీలు పరిశ్రమలు స్థాపించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. తలసరి ఆదాయాన్ని పెంచడం అత్యంత ముఖ్యమని, ఇందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ సూచించారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పి.యం విశ్వకర్మ పథకంలో పురోగతి సాధించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. కర్నూలు జిల్లా నీటి వనరులు తక్కువగా ఉండటం, అక్షరాస్యత శాతం కూడా తక్కువగా ఉండటం వంటి సమస్యలను అధిగమించేందుకు ప్రతి శాఖ తమ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. జిల్లా పరిస్థితులను మెరుగుపరచడానికి అధికారులు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు సంబంధించి మొత్తం 35 ఎంఓయూలు కుదిరాయని, అందులో 11 యూనిట్లు గ్రౌండింగ్ పూర్తిచేసి నిర్మాణ దశలో ఉన్నాయని, 15 యూనిట్ల పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని తెలిపారు.

**పరిశ్రమలకు ఇచ్చిన ప్రోత్సాహం:-** జిల్లా లో పరిశ్రమల ప్రోత్సాహం (ఇన్సెంటివ్) కింద 12 సంస్థలకు ఇన్వెస్ట్మెంట్ సబ్సిడీ క్రింద 4 సంస్థలకు రూ 49,91,306 లు , పవర్ కాస్ట్ రియంబర్స్మెంట్ కింద 8 సంస్థలకు రూ 18, 96,830 లు మొత్తం 12 సంస్థలకు 68,88,136 రూపాయల ప్రోత్సాహం (ఇన్సెంటివ్) ఇవ్వడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.ఆంధ్రప్రదేశ్ క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం ( ఏపీ సిడిపి) క్రింద ఎం ఎస్ ఎం ఈ పార్కుల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహాయం:- ఆంధ్రప్రదేశ్ క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం ఏపీ సిడిపి క్రింద ఎం ఎస్ ఎం ఈ పార్కుల ఏర్పాటుకు జనరల్ కేటగిరి వారికి కోటి రూపాయలు నుండి 5 కోట్ల రూపాయలు విలువగల ప్రాజెక్టులకు 80 శాతం మరియు 5 కోట్ల నుండి 10 కోట్ల విలువ గల ప్రాజెక్టు లకు 70 శాతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుందన్నారు. మిగిలిన పెట్టుబడి 20 శాతం మరియు 30 శాతం అసోసియేషన్ లు భరించుకోవాలన్నారు. స్పెషల్ కేటగిరీ క్రింద మహిళలు 50 శాతానికి పైగా ఉంటే మరియు ఎస్సీ, ఎస్టీకి చెందిన వారికి కోటి రూపాయలు నుండి 5 కోట్ల వరకు ప్రాజెక్టు విలువ కు 90 శాతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుందని తెలిపారు. మిగిలిన మొత్తం సంస్థ ప్రతినిధులు 10 శాతం భరించాలని తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చి ప్రభుత్వం ఇస్తున్న ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని, ఈ అంశాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని పరిశ్రమల అధికారులను ఆదేశించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన మరియు ఆధ్వర్యంలో జరిగే డిస్ట్రిక్ట్ లెవెల్ స్టీరింగ్ కమిటీ సమావేశానికి లేదా జనరల్ మేనేజర్ , డిస్టిక్ ఇండస్ట్రీస్ సెంటర్ లకు అప్లికేషన్లను పంపాలని కోరారు.పెండింగ్లో ఉన్న పరిశ్రమల పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో పరిశ్రమల అభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు పెరిగి, ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయని, అందుకోసం ప్రతి అధికారి బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.



సమావేశంలో జిఎం ఇండస్ట్రీస్ అశోక్ కుమార్, కర్నూల్ మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్ , ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి , పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిషోర్ రెడ్డి, నేడ్కాప్ డివో వీరేంద్ర, జెడి వ్యవసాయ శాఖ వరలక్ష్మి , ఏపీఎంఐపి పిడి సుధాకర్ , ఎల్డీఎం రామచంద్రరావు , మార్కెటింగ్ ఏడీ నారాయణమూర్తి, డి సి ఎల్ వెంకటేశ్వర్లు, జడ్.ఎం మధుసూదన్ , పరిశ్రమల శాఖ డిడి లు జవహర్ బాబు, డేనియల్ తదితరులు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్ల మెరుగుదలపై దృష్టి


### సిఈఓ వంశీధర్, కమిషనర్ పి.విశ్వనాథ్

### అన్న క్యాంటీన్ల స్థాయి సలహా కమిటీ సమావేశం



**కర్నూలు నంది పత్రిక....** అన్న క్యాంటీన్లను మరింత మెరుగుపరిచి పేదలకు నాణ్యమైన ఆహారం అందించడంపై దృష్టి సారించాలని అన్న క్యాంటీన్ల చారిటబుల్ ట్రస్ట్ సిఈఓ పోతుల వంశీధర్ సూచించారు. స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో అన్న క్యాంటీన్ల స్థాయి సలహా మండలి సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లాలోని మున్సిపాలిటీల కమిషనర్లతో పాటు నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్ పాల్గొన్నారు. కమిటీల ఏర్పాటు, అన్న క్యాంటీన్ల విస్తరణ, సేవల మెరుగుదలపై చర్చలు జరిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదలకు మూడు పూటల భోజనం అందించే అన్న క్యాంటీన్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదని పేర్కొన్నారు. ప్రభుత్వం ఒక్కో వ్యక్తికి మూడు పూటలకు రూ.75 వరకు ఖర్చు చేస్తూ, కేవలం రూ.15కే ఆహారం అందించడం గొప్ప కార్యక్రమమని తెలిపారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ రుచికరంగా వంటలు చేయడంతో పాటు పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలన్నారు. సమావేశంలో సలహా మండలి సభ్యులు పలు సూచనలు చేసి, సేవల మెరుగుదలకు సహకరించాలని అభిప్రాయపడ్డారు.

## మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రజా వేదిక కార్యక్రమం.



**బేతంచెర్ల ఏప్రిల్ 1 ( నందిపత్రిక ).** బేతంచెర్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 01/4/2024 నుండి 31/3/2025 వరకు జరిగిన పనులపైగ్రామాలలో జరుగుతున్న 19 వ రౌండ్ సామాజిక తనిఖీ గురించి 02/4/2026 గురువారం నాడు మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహిచడం జరుగునని బేతంచెర్ల మండల ప్రజా పరిషత్ అధికారి ఎం. ఫజుల్ రహమాన్ ప్రకటన ద్వారా బుధవారం తెలియ జేశారు.మండలములోని 19 గ్రామ పంచాయితీలలో జరిగిన ఉపాధి పనులపై,సెర్ఫ్, హౌసింగ్, ఫారెస్ట్, పంచాయితీ రాజ్,పశు సంవర్ధఖ శాఖ తదితర పథకముల పై సామాజిక తనిఖీ ప్రజా వేదిక గురువారం జరుగును. కనుక సంభందిత గౌరవ ప్రజా ప్రతినిధులు, ఎంపీపీ బుగ్గన నాగ భూషణం రెడ్డి,మండలంలోని గ్రామాల సర్పంచులు,ఎంపీటీసీలు,పంచాయితీ కార్యదర్శులు,అధికారులు, గ్రామాల పెద్దలు,ప్రజలు హాజరు కాలయునని బేతంచెర్ల ఎంపీడీఓ తెలిపారు.

## ఫ్యూయల్ ఛార్జీలు రూ.10 వేల వరకు పెంచుతూ ఇండిగో నిర్ణయం

విమానాల్లో వినియోగించే ఇంధన ధరలు ఇటీవల భారీగా పెరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విమానయాన సంస్థ ఇండిగో కీలక నిర్ణయం తీసుకున్నది. టిక్కెట్లపై వసూలు చేసే ఫ్యూయల్ ఛార్జీలను భారీగా పెంచింది. దేశీయ, అంతర్జాతీయ టిక్కెట్లపై కనిష్ఠంగా రూ.275, గరిష్ఠంగా రూ.10 వేల వరకు పెంచింది. ఈ ఛార్జీలు రేపటి నుంచి (ఏప్రిల్ 2) అమల్లోకి వస్తాయని ఇండిగో సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. విమానాలకు ఉపయోగించే ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) సవరించిన రోజునే ఇండిగో విమానయాన టిక్కెట్ల ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఇంధన ధరలు పెరుగుతున్న విషయం తెలిసిందే. గత నెల రోజుల్లో ఏటీఎఫ్ ధరలు రెట్టింపు కంటే ఎక్కువగా పెరిగాయని, దీనివల్ల విమానయాన సంస్థ నిర్వహణ వ్యయాలపై ఇది గణనీయమైన ప్రభావాన్ని చూపుతోందని ఇండిగో తన ప్రకటనలో తెలిపింది. ఇంధన ధరల పెరుగుదలను పూర్తిగా భర్తీ చేయడానికి విమాన ప్రయాణ ఛార్జీలను భారీగా సవరించవలసి ఉంటోందని పేర్కొంది. ప్రయాణికులపై అధిక భారం పడకుండా స్వల్ప మొత్తంలో బదిలీ చేశామని తెలిపింది.

# శ్రీ శాంతినికేతన్ సీబీఎస్ఈ స్కూల్‌లో 'శాంతినికేతన్ ఛాంపియన్ స్టూడియోలి ' ఘన ప్రారంభం:




## వార్షిక క్రీడా సంబరాలకు అంకురార్పణ

**నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 1 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణం క్రాంతి నగర్‌లోని ప్రముఖ విద్యాసంస్థ శ్రీ శాంతినికేతన్ సీబీఎస్ఈ స్కూల్ మంగళవారం సరికొత్త చరిత్రను లిఖించింది. పాఠశాల ఆవరణలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన 'శాంతినికేతన్ ఛాంపియన్ స్టూడియో' ప్లే గ్రౌండ్‌ను ఘనంగా ప్రారంభించడంతో పాటు, విద్యార్థుల క్రీడా పండుగ వార్షిక క్రీడా దినోత్సవానికి వైభవంగా అంకురార్పణ చేశారు.

**ఉదయం:** ఛాంపియన్ స్టూడియో ఆవిష్కరణ మరియు క్రీడా జ్యోతి ప్రజ్వలన మంగళవారం ఉదయం జరిగిన ప్రారంభోత్సవ వేడుకకు రామకృష్ణ డిగ్రీ మరియు పీజీ కళాశాల చైర్మన్ డాక్టర్ జి. రామకృష్ణ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. పాఠశాల చైర్మన్ సుధాకర్ పాఠశాల కరస్పాండెంట్ రమ్య రెడ్డి గారితో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి, రిబ్బన్ కట్ చేసి ఈ అత్యాధునిక 'ఛాంపియన్ స్టూడియో'ను ప్రారంభించారు. అనంతరం క్రీడా జ్యోతిని వెలిగించి, వార్షిక క్రీడా దినోత్సవ పోటీలను అధికారికంగా ప్రారంభించారు.

**ఛాంపియన్ స్టూడియో ప్రత్యేకతలు:** ప్రో కబడ్డీ మ్యాట్స్: కబడ్డీ కోర్ట్‌లో ప్రో కబడ్డీ లీగ్‌లో ఉపయోగించే అత్యాధునిక సింథటిక్ మ్యాట్స్‌ను ఏర్పాటు చేశారు. దీనివల్ల క్రీడాకారులకు గాయాలు కాకుండా ప్రొఫెషనల్ స్థాయిలో ఆడే అవకాశం లభిస్తుంది.ఎ సోలార్ ఫ్లడ్ లైట్లు: రాత్రి వేళల్లో కూడా క్రీడలు నిర్వహించుకునేలా మైదానం చుట్టూ అత్యాధునిక సోలార్ ఫ్లడ్ లైట్ల సౌకర్యం కల్పించారు.

**అడ్వాన్స్ కోర్టులు:** ఈ స్టూడియోలో బాస్కెట్‌బాల్ కోర్ట్, టెన్నిస్ కోర్ట్ మరియు పికిల్ బాల్ కోర్ట్ వంటి ఆధునిక వసతులు ఏర్పాటు చేశారు.

**విద్యార్థుల కళా ప్రదర్శనల సందడి:** ప్రారంభోత్సవం అనంతరం విద్యార్థులు నిర్వహించిన మార్చ్ పాస్ట్ చూపరులను ఆకట్టుకుంది. విద్యార్థులు ప్రదర్శించిన డమ్ బెల్ డాన్స్, కోలాటం, లెజిమ్ డాన్స్, స్టిక్ డాన్స్, ఫుట్‌బాల్ డాన్స్ మరియు కరాటే స్టంట్స్ సభికులను మంత్రముగ్ధులను చేశాయి. వారి క్రమశిక్షణ, నైపుణ్యాన్ని చూసి అతిథులు అభినందనలు కురిపించారు.




**సాయంత్రం:** ముగింపు వేడుక – విజేతలకు పురస్కారాలు సాయంత్రం జరిగిన వాలిడిక్టరీ సెర్మనీకి నంద్యాల జిల్లా విద్యాశాఖాధికారి (ఇజూా) శ్రీ పి. జనార్ధన్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన క్రీడా విజేతలకు పతకాలు అందజేయడంతో పాటు, ××ు ఒలింపియాడ్ స్టేట్ ర్యాంకులను సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రత్యేక పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా డి.ఇ.ఓ సార్ మాట్లాడుతూ.. శ్రీ శాంతినికేతన్ స్కూల్ అటు అకాడమిక్స్‌లోనూ, ఇటు క్రీడల్లోనూ అంతర్జాతీయ స్థాయి వసతులు కల్పించడం గర్వకారణమని ప్రశంసించారు. చైర్మన్ సుధాకర్ గారు మరియు కరస్పాండెంట్ రమ్య రెడ్డి గారి కృషిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం మరియు భారీ సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొన్నారు. క్రాంతి నగర్ లోని స్కూల్ ప్రాంగణం విజయ గర్జనలతో మార్మోగిపోయింది.

# 21 గ్రామపంచాయతీలో ఉపాధి పనులు ప్రారంభం.



**రుద్రవరం ప్రతినిధి ఏప్రిల్ 01 (నంది పత్రిక):** మండలంలోని 21 గ్రామపంచాయతీలో ఉపాధి హామీ పనులు ప్రారంభమైనట్లు ఎంపీడీవో భాగ్యలక్ష్మి తెలిపారు. బుధవారం రుద్రవరం సమీపంలోని రంగారెడ్డి చెరువు సమీపంలో చెరువు కింద ఉన్న పంట కాలువల్లో ఉపాధి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు రోజుకు 2800 కూలీలు లక్ష్యం గాను 1800 పనులకు వస్తున్నారన్నారు. వేసవిలో ఉపాధి కూలీలు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా త్రాగునీరు, నీడ వారికి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కూలీలు కూడా నిర్ణయించిన సమయానికి వెళ్లి ఉపాధి పనులు చేసుకోవాలన్నారు. ఆమె వెంట ఉపాధి ఈసీ సుబ్బన్న సిబ్బంది ఉన్నారు.

# ఎయిడ్స్ నియంత్రణ & విధి నిర్వహణ, నివేదికల్లో అలసట్వం వహిస్తే కఠినచర్యలు

## జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిడాక్టర్ కామేశ్వరప్రసాద్



**కర్నూలు నంది పత్రిక....**కర్నూలు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయములో కర్నూలు జిల్లా లో అమలు చేస్తున్న ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమము ఏప్రిల్ నుండి ఫిబ్రవరి వరకు చేసిన పనితీరును సమీక్ష సమావేశము జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కామేశ్వరప్రసాద్ అధ్యక్షతన నిర్వహించడము జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ కామేశ్వరప్రసాద్ మాట్లాడుతూ విధి నిర్వహణలో మరియు నివేదికల్లో అలసట్వం వహిహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు . జిల్లా అన్ని ఆరోగ్య కేంద్రాలలో వివక్ష రహిత హెచ్. ఐ. వి పరీక్షలు , కౌన్సెలింగ్ , మందులు, సకాలములో వైరల్ లోడ్ రక్తపరీక్షలు ఇతర సేవలు అందించాలని చెప్పినారు. అలాగే ప్రతిరోజూ రోజువారీ నివేదికలు ఆన్ లైన్ లోచేయాలనీ సూచించారు. ఏ ఆర్ టి కేంద్రాలలో సిబ్బంది గర్భవతులకు మరియు హై రిస్క్ ఉన్న వారిని చరవాణి ద్వారా ఫాలోఅప్ చేయాలనీ క్రమం తప్పకుండ మందులు వాడేలా చూడాలని సూచించారు.జిల్లాలో అందరు సమన్వయంతో హెచ్ ఐ వి స్థితిని తెలుసుకునేలా ప్రోత్సహించి 95 % పరీక్షలు చేయాలనీ, అలాగే హెచ్ ఐ వి ఉన్న వారు 95 % అందరు ఏ ఆర్ టి కి అనుసంధానము చేసి మందులు వాడేలా చూడాలని, ప్రతిఒక్కరికి సకాలములో 99 % వైల్ లోడ్ రక్తపరీక్షలు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమములో న్యూకిలియస్ వైద్య అధికారి డాక్టర్ మల్లికర్జున రెడ్డి, జిల్లా గణాంక అధికారి హేమసుందర్ , క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ అలీ హైదర్, దేవి శంకర్ గౌడ , క్లస్టర్ ప్రివెన్షన్ ఆఫీసర్ రాజ్యాలక్ష్మీ , ఏ ఆర్ టి వైద్యులు ఉదయని, విలయం , ఇందిరా రెడ్డి , ఐ సి టి సి, ఏ ఆర్ టి కౌన్సలర్లు, స్వచ్ఛంద సంస్థల మేనేజర్లు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు అందజేస్తున్న కూటమి ప్రభుత్వం

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేసిన రాష్ట్ర యువ నాయకుడు చీ.వీ.ఎ.ఫయాజ్



**నంద్యాల సిటీ బ్యూరో ఏప్రిల్ 1 ( నంది పత్రిక )** నంద్యాల టౌన్ 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్ నందు వార్డు తెలుగుదేశం పార్టీ ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు ఆధ్వర్యంలో ఏర్పాటు ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో స్థానిక మంత్రి వర్యులు కుమారుడు రాష్ట్ర యువ నాయకుడు చీ.వీ.ఎ.ఫయాజ్ గారు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ఫయాజ్ గారు మాట్లాడుతూ ప్రతినెల ఒకటవ తేదీన నిర్వహించే పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఈరోజు 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్ నందు పాల్గొనడం జరిగింది అని ఆయన అన్నారు. మొట్టమొదటిసారిగా 200 రూపాయల పెన్షన్ నుండి 2000 రూపాయల వరకు అలాగే 2000 నుంచి 4000 వరకు పెన్షన్ మంజూరు చేసి అవతాతలకు,వికలాంగులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు నేనున్నానంటూ భరోసా ఇచ్చి శభాష్ అనిపించుకుంటున్న ఒక ఘనత కేవలం మన ముఖ్యమంత్రి వర్యులు చంద్రబాబు నాయుడు గారికి దక్కుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, మరాఠీ సూరి,తాటికొండ మహేష్ బాబు,వడ్డే నాగేంద్ర, హిమామ్ హుస్సేన్,కల్కి రాఘవేంద్ర,కోటీశ్వరుడు, ప్రసాద్ రెడ్డి,సౌభాగ్యవతి, మల్లయ్య,జగన్, ఫిరోజ్, ఉమాకాంతయ్య,తదితర టీడీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# మీ ఇంటికి మీ డాక్టర్

## ప్రోగ్రాం ను తనిఖీ చేసిన డిఎంహెచ్ ఓ వెంకటరమణ



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఏప్రిల్ 1 :** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మీ ఇంటికి మీ డాక్టర్ ప్రోగ్రామ్ ను నంద్యాల జిల్లా వైద్యాధికారి వెంకటరమణ తనిఖీ చేశారు. బుధవారం బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న నారపురెడ్డి కుంట చెంచుగూడెంకు మీ ఇంటికి మీ డాక్టర్ వాహనం చేరుకుంది. నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ కొద్ది రోజుల క్రితమే మీ ఇంటి కి మీ డాక్టర్ కార్యక్రమాన్ని ఇటీవల నంద్యాలలో లాంచనంగా ప్రారంభించారు. ఏప్రిల్ నెల నుండి మొబైల్ వాహనం బండి ఆత్మకూరు మండలంలో సంచరిస్తుందని ప్రకటించారు. ఈ నేపథ్యంలో డిఎంహెచ్ఓ వెంకటరమణ నారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన అనంతరం నారపురెడ్డి గుంటకు చేరుకొని మీ ఇంటికి మీ డాక్టర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. డిఎంహెచ్వో వెంకటరమణ వెంట జిల్లా అధికారి కాంతారావు నాయక్ కూడా పాల్గొన్నారు. మెడికల్ మొబైల్ వాహనంలో ప్రజలకు సేవలు అందించేందుకు సరిపడా మందులు ఉన్నాయా లేదా అన్న విషయాన్ని వారు పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడం, శిశుమరణాలు, మాతృ మరణాలను తగ్గించడం అంటూ వ్యాధుల వ్యాప్తిని అరికట్టడం 100% టీకాలు వేయడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశం. ఈ మొబైల్ వాహనంలో ఒక డాక్టరు,నర్సు,ఫార్మసిస్టు, డ్రైవర్ ఉంటారు మొబైల్ మెడికల్ టీం ప్రతి గ్రామంలో నిరుపేదలు, షెడ్యూల్ కులాలు,బడుగు బలహీన వర్గాలు, మైనార్టీలు తక్కువ వైద్య సేవలు పొందుతున్న వారికి ఉద్దేశించబడినది. వీరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించలేక, ఆరోగ్య సంరక్షణ కొరకు డబ్బు ఖర్చు లేని వారితోపాటు గర్భిణీ స్త్రీలు, జీరో నుండి ఆరు సంవత్సరాల వయసు కలిగిన పిల్లలు, క్షయ, డెంగు,మలేరియా వంటి వ్యాధులలో బాధపడేవారు, జీవనశైలి వ్యాధులతో బాధపడేవారు,60 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఈ ప్రాజెక్టు ద్వారా సేవలు అందిస్తారని డిఎంహెచ్ఓ వెంకటరమణ పేర్కొన్నారు. మొబైల్ టీం గ్రామస్థాయిలో ఆశ వర్కర్లు,ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లోని సి బ్బంది సమన్వయంతో సేవలందిస్తారు. ఈ బృందం ప్రతి గ్రామంలో కనీసం ఐదు మంది యువ రెడ్ క్రాస్ వాలంటీర్లను గుర్తించి, ఏపీ రెడ్ క్రాస్ నందు నమోదు చేస్తారు ఈ ఐదు మంది బృందం తదుపరి చర్యలు చేపట్టడానికి అత్యవసర పరిస్థితులలో మొబైల్ టీం ను సంప్రదించి ఆ గ్రామంలో వైద్య సేవలను అందజేస్తారు.

# పరీక్ష కేంద్రాలను పరిశీలించిన రాష్ట్ర స్థాయి పరిశీలకులు అనురాధ.



**రుద్రవరం ప్రతినిధి ఏప్రిల్ 01 (నంది పత్రిక):** రుద్రవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో జరిగిన 10వ తరగతి వృత్తి విద్యా పరీక్షలను రాష్ట్ర స్థాయి పరిశీలకులు అనురాధ సందర్శించి తనిఖీ చేశారు. పరీక్షలు జరుగుతున్న విధానాన్ని పరిశీలించిన ఆమె, కేంద్రంలో ఏర్పాట్ల పట్ల పూర్తి సంతృప్తిని వ్యక్తం చేస్తూ అక్కడి ముఖ్య అధికారులకు పలు సూచనలు అందించారు. ఈ పరీక్షకు మొత్తం 198 మంది విద్యార్థులకు గాను 196 మంది హాజరయ్యారని అధికారులు తెలియజేశారు. పరీక్షలు అత్యంత ప్రశాంతమైన వాతావరణంలో జరుగుతున్నాయని పేర్కొంటూ ఆమె అధికారులను అభినందించారు. అనంతరం రెడ్డిపల్లి, ఆర్ నాగులవరం గ్రామాలలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించి విద్యార్థుల ప్రాథమిక సామర్థ్యాలనును పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. విద్యార్థులు ప్రాథమిక సామర్థ్యాలను పెంపొందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఆమె వెంట పరీక్షల సిట్టింగ్ స్క్వాడ్ పోలా గురు ప్రసాద్ పరీక్షలు చీఫ్ సుధాకర్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్ నరసమ్మ ఉన్నారు.

# ఈస్టర్ పండుగ సందర్భంగా బైక్ స్లో పందెం.

**రుద్రవరం ప్రతినిధి ఏప్రిల్ 01 (నంది పత్రిక):** మండలంలోనిచిన్నకంబలూరు గ్రామం లోగుడ్ ఫ్రైడే మరియు ఈస్టర్ పండుగలను పురస్కరించుకుని స్థానిక సిఎస్ఐ చర్చ్ ఆధ్వర్యంలో యువత వినూత్నమైన బైక్ స్లో పందేలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మార్చి 5 మరియు 6 తేదీల్లో జరిగే ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతిగా రూ 4000 రూపాయలు, ద్వితీయ బహుమతి రూ 3000, తృతీయ బహుమతి రూ 2000, నాలుగవ బహుమతి రూ 1000 మరియు ఐదవ బహుమతిగా రూ 500 రూపాయలను నగదు పురస్కారాలుగా అందజేయనున్నారు. ఈ పోటీలో పాల్గొనే వారు 50 రూపాయల ప్రవేశ రుసుము చెల్లించి ముందుగానే పేర్లను నమోదు చేసుకోవాలని, నిర్ణీత గీతల మధ్యే వాహనాన్ని నడపాలని మరియు కాలు కింద పెట్టకుండా ఎవరైతే ఎక్కువ సమయం తీసుకుంటారో వారినే విజేతలుగా ప్రకటిస్తామని నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాలకు చింతల వినయ్ తేజస్, ఇట్టే మోజెస్, సగినేల ఇమ్మాన్యుయేలు లేదా చింతల ప్రేమ్ కుమార్‌లను సంప్రదించాలని చర్చి సంఘ పెద్దలు కోరారు.

# పెన్షన్లు పంపిణీ చేసిన నీటి సంఘం చైర్మన్ సూర రామ.



**శిరివెళ్ల :-(నంది పత్రిక)** సిరివెళ్ల మండల కేంద్రంలో ని అర్హులైన పెన్షన్ దారులకు నీటి సంఘం చైర్మన్ సూర రామ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం ఆళ్లగడ్డ శాసన సభ్యురాలు భూమా అఖిలప్రియ గారి ఆదేశాల మేరకు సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేశామని సూర రామ తెలియజేశారు. వృద్ధులు వికలాంగులు వితంతువులు దీర్ఘకాలిక రోగులకు ఆర్థికంగా అండగా నిలవడానికి రూపొందించిన ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా లబ్ధిదారులకు నెలకు రూ. 4,000 నుంచి రూ. 15,000 వరకు ఆర్థిక సాయం అందించడం జరుగుతున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ బిల్ కలెక్టర్ దస్తగిరి సచివాలయ సిబ్బంది లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఘనంగా పీఠాధిపతి శ్రీ సుబుదేంద్ర తీర్థుల జన్మదిన వేడుకలు



**మంత్రాలయం,న్యూస్ :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్ర తీర్థుల జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పీఠాధిపతి శ్రీ సుబుదేంద్ర తీర్థులు 55వ పుట్టినరోజు వేడుకలు సందర్భంగా బుధవారం శ్రీ మఠం యాగ శాలలో హోమాలు నిర్వహించారు. శ్రీ గురుసార్వ భౌమ విద్యాపీఠం విద్యార్థులు పీఠాధిపతులకు తైల అభ్యంగనం అలాగే ఆరతి నిర్వహించారు. అనంతరం శ్రీ మఠం అధికారులు, సిబ్బంది గురువందనం సమర్పించి విశేష పుష్పాలతో అభిషేకం చేశారు. అంతకు ముందు పీఠాధిపతి శ్రీ సుబుదేంద్ర తీర్థుల పూర్వాశ్రమ తల్లి హారతి ఇచ్చారు. పుట్టిన రోజు సందర్భంగా శ్రీమఠం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న సుజయాంధ్ర ఆరోగ్యశాలలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని పీఠాధిపతులు ప్రారంభించారు. భక్తులకు పలు సందేశాన్ని అందించిన అనంతరం ఆయన మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు, సహాయ మేనేజర్ ఐపి నరసింహ మూర్తి, వివిధ శాఖల మఠం అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# విశ్వబ్రాహ్మణ జాతికి సంబంధించిన ప్రధాన సమస్యలను పరిష్కరించండి

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ కమ్మరి పార్వతమ్మ



**కర్నూలు నంది పత్రిక......** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ మాత్యులు నారా లోకేష్ బాబు ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ కమ్మరి పార్వతమ్మ ఈ సందర్భంగా చైర్మన్ విశ్వబ్రాహ్మణ జాతికి సంబంధించిన ప్రధాన అంశాలను వారి వద్ద ప్రస్తావించడం జరిగింది ఈ కార్యక్రమంలో బ్రహ్మశ్రీ డాక్టర్ కె .యం. కిరణ్ కుమార్ ఏసీపీ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు దశరథ ఆచారి, రామకృష్ణ ఆచారి, కర్రి శేషగిరిరావు, కోడూరి శేష బ్రహ్మచారి,మోతడక వీరాచారి, అప్పలస్వామి, తునికి పాటి శివ, ఫణింద్ర కుమార్, పాల్గొన్నారు....

# గ్రామ సర్పంచు వార్డు మెంబర్లకు ఘన సన్మానం




**కొత్తపల్లి – నంది పత్రిక:** గ్రామ పంచాయతీలలో గారవ సర్పంచులు. ఉపసర్పంచులు, వార్డు మెంబర్ల పదవీకాలం పూర్తియింది. దీంతో బుధవారం ముసలిమడుగు గ్రామ సచివాలయంలో గ్రామ సర్పంచు శివపురం జమిలాభి. ఉపసర్పంచు నాగన్న, వార్డుమెంబర్లను సచివాలయ సిబ్బంది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీడీఓ మేరి, జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డిలు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధిలో గ్రామ సర్పంచుల పాత్ర ఎంతో కీలకమన్నారు. గ్రామాలలో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు చేయడంలో వారి పాత్ర ఎంతో ఉందన్నారు. గామాన్ని అభివృద్ధి పదంలో నడిపించినందుకు గ్రామస్తులు సర్పంచు జమీలాబి, ఉపసర్పంచు బంగి నాగన్నలను దుశ్శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మహబూబ్ బాషా, ఎంఈఓ ఇనాయతుల్లా, డిప్యూటీ ఎంపీడీఓ సుబ్బారావు, ఎంపీటీసీ, ముబినా బేగం, గ్రామ వైఎస్సార్సీపీ నాయకులు, జెల్లి పెద్ద 'లింగస్వామి, బాబు రెడ్డి, శీలం దాసు, ఉపాధ్యాబృందం, సచివాలయసిబ్బంది పాల్గొన్నారు.

# ఏరాసు ప్రతాపరెడ్డికి కేంద్ర స్థాయి ఉన్నత పదవి హామీ: నారా లోకేష్

**ఉండవల్లి, వెలుగోడు ఏప్రిల్ 1 (నంది పత్రిక):**తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ తన ఉండవల్లి నివాసంలో ఏరాసు ప్రతాపరెడ్డి, వి.ఆర్.కె & ఆర్.ఆర్. సంస్థల అధినేత రాఘవరెడ్డితో సమావేశమయ్యారు.దాదాపు రెండు గంటల పాటు సాగిన ఈ సందర్భంగా భవిష్యత్తులో పెరగనున్న శాసనసభ, లోక్‌సభ స్థానాలపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. అలాగే కేంద్ర ప్రభుత్వం హార్టికల్చర్ రంగానికి సబ్సిడీలు, చేయూత రాయలసీమ ప్రాంత రైతులకు ఎలా సమర్థవంతంగా అందించాలనే అంశంపై సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ, ఏరాసు ప్రతాపరెడ్డికి భవిష్యత్తులో కేంద్ర స్థాయి ఉన్నత పదవిని అందించే దిశగా పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలో ఉన్నారని తెలిపారు. తాను కూడా ప్రతాపరెడ్డికి తగిన గౌరవం కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అదేవిధంగా నంద్యాల, కర్నూలు జిల్లాల్లో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను నాయకుల నుంచి కార్యకర్తల వరకు ప్రతి ఇంటి గడపకు చేర్చే విధానాన్ని చర్చించారు.ఈ సమావేశంలో రాష్ట్ర ఐటీడీపీ కార్యనిర్వహణ కార్యదర్శి షేక్ షేక్‌వాలి. భవిష్యత్తులో రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవుల్లో షేక్షావలికి కూడా స్థానం కల్పిస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారు.



# ప్రజల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత

## ఎన్టీఆర్ సామాజిక భరోసా పెన్షన్ పంపిణీలో పాల్గొన్న మంత్రాలయం టీడీపీ ఇన్చార్జి ఎన్. రాఘవేంద్ర రెడ్డి

**మంత్రాలయం , న్యూస్ :-** ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రాధాన్యత ఇస్తున్నారని మంత్రాలయం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి అన్నారు సోమవారం బుధవారం మండల పరిధిలోని మాధవరం గ్రామంలో ఎన్టీఆర్ సామాజిక భరోసా పెన్షన్ల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. వృద్ధులు,వికలాంగులు, వితంతవులుకు మరియు అర్హులైన ప్రతి ఒక్కరికీ గౌరవప్రదమైన జీవితం అందించాలనే సంకల్పంతో ఎన్టీఆర్ భరోసా వంటి సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారని ఆయన తెలిపారు.ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడం, ప్రతి ఇంటికి ఆర్థిక భద్రత కల్పించడం చంద్రబాబు నాయుడు దూరదృష్టి పరిపాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి మరియు సంక్షేమం రెండు



చక్రాలపై ముందుకు తీసుకెళ్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్ , టీడీపీ నాయకులు ఉన్నారు..

# పంచమహాపాతకాలను పోగొట్టే పారిజాతపుష్పం.

**మంత్రాలయం ఏప్రిల్01(నందిదినపత్రిక ప్రతినిధి)** మనం నిత్యం చూసే పారిజాత పువ్వులను దేవుళ్ళకు అర్పిస్తే మానవుడు చేసుకొన్న పంచమహా పాతకాలు తృటిలో నశించి పోతాయని పురాణేతి హాసాలు పేర్కొంటున్నాయి. పారిజాత పుష్పాలు 9రకాలు. 1)ఎర్ర (ముద్ద) పారిజాతం, 2)రేకు పారిజాతం. 3)తెల్లగా ఎర్రకాడతో ఉండే పారిజాతం. (ఇదిఎక్కవగా అందుబాటులో ఉంటుంది). 4)పసుపు పారిజాతం, 5)నీలంపారి జాతం. 6)గన్నేరు రంగు పారిజాతం. 7)గులాబీ రంగు పారిజాతం. 8)తెల్లని పాల రంగు పారిజాతం. 9)ఎర్ర రంగు పారిజాతం ఇందులోని ఎర్ర



రంగు పారిజాతం పువ్వులతో శ్రీమహావిష్ణువును ఆరాధించరాదు. ఎరుపు తమోగుణం అయితే విష్ణువు సత్వగుణం. పూజలకు పారాజాత పువ్వులను మొక్కనుంచి కోసి ఉపయో గించరాదు. పారిజాత మొక్క భగవంతుని తపస్సుచేత మెప్పించి తన పూలను తానే ఇస్తేనే తప్ప మొక్కనుంచి కోసి ఉపయోగించకూడదు. పారిజాత మొక్క భగవంతుని తపస్సు చేత మెప్పించి తనపూలను తాను ఇస్తేనే తప్ప తన నుండి ఎవ్వరూ లాక్కోకూడదని వరం పొందిందట. పారిజాతం పువ్వులు వివిధ రంగుల్లో ఉంటాయి. పారిజాత మొక్కనుంచి జారిపడిన పువ్వులన్నీ పూజకు పనికి రావు. కేవలం తెల్లని రంగులో ఉంటూ ఎర్రని కాడ ఉన్న పువ్వులు మాత్రమే పూజకు వాడాలని అప్పుడే ఆ పూజకు ఫలితం ఉంటుందనిశాస్త్రాలు చెబుతున్నాయి. ఇక రంగు, వైశాల్యం, గుణం, దేవతా స్వరూపాన్ని బట్టి దేవతలను ఆయా రంగు పారిజాత పువ్వులను పూజలకు వినియోగించినపుడే ఆ పూజలకు సార్థకత ఉంటుందని పురాణాలు చెబుతున్నాయి. భూస్పర్శ, మృత్తికా స్పర్శ, జలస్పర్శ, హస్తస్పర్శ, ఆతర్వాత స్వామి స్పర్శ ఈ5 స్పర్శలతో ఉన్న పువ్వులతో పూజలు పంచ మహా పాతకాలను పోగొడతాయని వేదవేత్తలు విశదీకరిస్తున్నారు..

# శ్రీ శ్రీ లక్ష్మీ రంగనాథుని రథోత్సవానికి ఏర్పాట్లు పూర్తి.. ఈవో సాయికుమార్

**జూపాడుబంగ్లా :ఏప్రిల్ 1: (నంది పత్రిక )** మండల కేంద్రంలోని తర్తూరు తిరునాళ్ల జాతర కర్నూలు జిల్లాలోని ప్రసిద్ధిగాంచినది ఏటా వేలాది మంది భక్తులు వివిధ జిల్లాల నుండి రాష్ట్రాల నుండి శ్రీ శ్రీ శ్రీ లక్ష్మి రంగనాథుని దర్శించుకోవడం పూజలు చేయడం ఆనవాయితీగా మారింది. ఈ రథోత్సవానికి



వేలాది మంది భక్తులు తరలివస్తారు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రథోత్సవానికి సంపూర్ణమైన ఏర్పాట్లు చేసినట్లు ఈవో సాయికుమార్ తెలిపారు. రథోత్సవంలో శ్రీ శ్రీ శ్రీ లక్ష్మీ రంగనాథుని దర్శించుకోవడానికి ఇబ్బందులు కలగకుండా క్యూ లైన్లు నీటి వసతి కల్పించినట్లు ఈవో సాయికుమార్ తెలిపారు.

## వైభవంగా మల్లమ్మ, గంగా దేవి ఆలయ వార్షికోత్సవం

**మహానంది ఏప్రిల్ 01 (నంది పత్రిక):-** మహానంది మండలం బొల్లవరం గ్రామంలో కొలువైన శ్రీ మల్లమ్మ సమేత గంగా దేవి అమ్మవారి 10 వ ప్రతిష్టా వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ అర్చకులు ప్రాతః కాలం నుంచి అమ్మవారికి అభిషేకం,శాంతి హోమాలు వైభవంగా నిర్వహించారు.శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.భక్తుల పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.



# 12వ వేతన సవరణ సంఘాన్ని నియమించాలి

## ఏపీటీఎఫ్ రాష్ట్రఅధ్యక్షులు.జి హృదయరాజు

**నందికొట్కూరు ఏప్రిల్ 1 ( నంది పత్రిక )** ఉపాధ్యాయ ,ఉద్యోగులకు సంబంధించిన 12వ వేతన సవరణ సంఘానికి చైర్మన్ ను తక్షణమే నియమించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి. హృదయ రాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు బుధవారం స్థానిక ఎం ఆర్ సి భవనం నందు నంద్యాల జిల్లా అధ్యక్షుడు బి. మాధవస్వామి అధ్యక్షతన ఏపీటీఎఫ్ ప్రాంతీయ సమావేశం జరిగినది. ఈ సందర్భంగా హృదయ రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు అయినప్పటికిని ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను పూర్తిగా విస్మరించి, ఏ ఒక్క సమస్యను కూడా పరిష్కరించకుండా, ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 11వ వేతన సవరణ కమిషన్ కాలపరిమితి పూర్తయి 32 నెలలు కావస్తున్న 12వ వేతన సవరణ కమిషన్ చైర్మన్ నియమించకపోవడం దుర్మార్గమైన చర్యగా ఆయన అభివర్ణించారు. పెండింగ్ లో ఉన్న నాలుగు డీఏ లను ప్రకటించాలని, 11వ పిఆర్సి బకాయిలను, 2018 నుండి పెండింగ్లో ఉన్న డిఏ బకాయిలను, 2022 నుంచి పెండింగ్ లో ఉన్న సరెండర్ లీవ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు ఉద్యమించక ముందే 12వ వేతన సవరణ సంఘానికి చైర్మన్ ను నియమించాలని, అలాగే 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు, కర్నూలు జిల్లా గౌరవాధ్యక్షులు ఏ. కమలాకర్ రావు, జిల్లా అధ్యక్షులు ఎస్. ఇస్మాయిల్, ప్రధాన కార్యదర్శి ఐ. మరియానందం ,నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు బి. శ్రీదేవి, బి. సుంకన్న, జిల్లా కార్యదర్శి డి. శ్రీరాములు, సీనియర్ నాయకులు ఎం. స్వామినాథం, ఎస్. రాఘవరెడ్డి ,ఎం. వెంకటరాముడు, ఎస్. మహబూబ్ బాషా, పి .తులసిస్వరెడ్డి ,జె. అజయ్ కుమార్ ,దేవిడ్ రవి శేఖర్ ,జి. మల్లికార్జున, కే. దేవదానము, వి. సుబ్బరాయుడు, టి. కృష్ణమోహన్, పి. సూర్య బాబు, జె. ఆనంద్ కుమార్, జి. నందిని, టి. పార్వతమ్మ, టి .సుశీల, కె. అపర్ణ ఎస్ భార్గవి బాల చిన్నమ్మ టి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# కమనీయం.. రమణీయం శ్రీ వెంకటేశ్వరుని కళ్యాణం

## వైభవంగా శ్రీ వెంకటేశ్వర స్వామి గ్రామోత్సవం.

### ఆకట్టుకున్న కోలాట ప్రదర్శనలు

**మహానంది, ఏప్రిల్ 01 (నంది పత్రిక):-** మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో 4వ వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని బుధవారం కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.ప్రధాన అర్చకులు నరసింహ బృందం వేదమంత్రోచ్చారణల మధ్య శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వార్ల కల్యాణాన్ని భక్తజనం కన్నులారా వీక్షించారు.స్వామి అమ్మ వార్లను అత్యంత సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మహానంది మండలం గాజులపల్లెలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై అధిష్టించి మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. గ్రామోత్సవంలో భాగంగా మహిళలు, బాలికల కోలాట నృత్య ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. గ్రామ ప్రజలు ఈ కోలాట ప్రదర్శనను తిలకించారు.



# స్వర్ణాంధ్ర 2047" లక్ష్య సాధనలో భాగంగా ఆచంటలో విజన్ యాక్షన్ ప్లాన్ కార్యాలయం ప్రారంభం

**భీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 1నంది పత్రిక** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని 2047 నాటికి సంపన్నమైన, ఆరోగ్యవంతమైన, సంతోషకరమైన రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన "స్వర్ణాంధ్ర 2047" కార్యక్రమంలో భాగంగా ఆచంట నియోజకవర్గం ఆచంటలో "విజన్ యాక్షన్ ప్లాన్



కార్యాలయం"ను బుధవారం ఘనంగా ప్రారంభించారు. రాష్ట్రంలోనే ఈ తరహా కార్యాలయం మొదటిసారిగా ప్రారంభించడం విశేషం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, స్థానిక శాసనసభ్యులు పితాని సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు పితాని సత్యనారాయణ మాట్లాడుతూ, "స్వర్ణాంధ్ర 2047" లక్ష్యాల్లో పేదరిక నిర్మూలన, ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాల కల్పన, నైపుణ్యాభివృద్ధి, ఇంటింటికి సురక్షిత తాగునీటి సరఫరా, రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికతల ప్రోత్సాహం, ప్రపంచ స్థాయి లాజిస్టిక్స్ వ్యవస్థ అభివృద్ధి వంటి అంశాలు కీలకమని తెలిపారు. అలాగే పెనుగొండలో ట్రంక్ వర్క్స్, మార్టేరు లో ఆటో నగర్ ఏర్పాటు వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, మహిళలకు ఉపాధి కల్పనకు పరిశ్రమల స్థాపనకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చురుకుగా వ్యవహరించాలని, పెండింగ్ ఫిర్యాదులను పి.జి.ఆర్.ఎస్ ద్వారా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అంగన్వాడీల ద్వారా అందించే టేక్ హోమ్ రేషన్ను సద్వినియోగం చేసుకోవాలి మైనర్ బాలికల వివాహాలను పూర్తిగా నిరోధించాలి ప్రభుత్వ ఆసుపత్రులను వినియోగించుకోవాలి పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను ప్రోత్సహించాలి మౌలిక సదుపాయాల అభివృద్ధి, బస్టాండ్ల మెరుగుదల, రెవెన్యూ సమస్యల పరిష్కారం వంటి అంశాల్లో అధికారులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో దాసిరాజు, ప్రత్యేక అధికారి జి. పిచ్చయ్య, ఏఎంసీ చైర్మన్ చేత విజయలక్ష్మి, ఎంపీపీ ఎం. సుజాత, జడ్పిటిసి సురేష్ బాబు, తహసీల్దార్ నాగబాబు, శ్రీనివాసరావు, టిడిపి నాయకులు రుద్రరాజు వెంకటరామరాజు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# కేజీబీవీల్లో ప్రవేశాల గడువు పెంపు: ఏప్రిల్ 10 వరకు దరఖాస్తుకు అవకాశం

**నందిపత్రిక -ప్యాపిలి** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాల గడువును పొడిగిస్తూ సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు ఐ ఏ ఎస్ కీలక నిర్ణయం తీసుకున్నారని ఎంఈఓ తెలిపారు.ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు, తల్లిదండ్రుల విన్నపాన్ని మన్నిస్తూ, దరఖాస్తు గడువును ఈ నెల 10వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు బుధవారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 352 కేజీబీవీల్లో 6, 11 తరగతుల ప్రవేశాలతో పాటు.. 7, 8, 9, 10, 12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఈ ప్రక్రియ జరుగుతోంది. అనాథలు, బడి బయట ఉన్న పిల్లలు డ్రాపౌట్స్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మరియు బి.పి.ఎల్ వర్గాల బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ప్రవేశాలు కేవలం ఆన్లైన్ ద్వారా మాత్రమే స్వీకరించబడతాయి. ఆసక్తి గల వారు ష్ట్రజూం://ఖజూనిస్త్రఎజ.ఖజూఎటం౦.ఱఅ/ వెబ్సైట్ సందర్శించి దరఖాస్తు చేసుకోవచ్చు.దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హత పొందిన విద్యార్థులకు వారి మొబైల్ నంబర్లకు మెసేజ్ ద్వారా సమాచారం అందుతుంది. అలాగే, ఎంపిక జాబితాలను సంబంధిత పాఠశాలల నోటీసు బోర్డుల్లో కూడా ప్రదర్శిస్తారు. దరఖాస్తు ప్రక్రియలో ఏవైనా సమస్యలు ఎదురైతే పని వేళల్లో ఉదయం 10.00 నుండి సాయంత్రం 5.00 వరకు ఈ క్రింది హెల్ప్ లైన్ నంబర్లను సంప్రదించవచ్చు79933 2911570750 39990 అర్హత కలిగిన బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# వేల్పనూరులో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

**వెలుగోడు, మార్చి 1 (నంది పత్రిక):** వెలుగోడు మండలం వేల్పనూరు గ్రామంలో ఈ నెల 3వ తేదీన ఈస్టర్ పండుగ సందర్భంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సురేంద్ర, భరత్, కళ్యాణ్ తెలిపారు.ఈ పోటీలలో పాల్గొనదలచిన జట్లు రూ.400 ఎంట్రీ ఫీజు చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామం తరపున క్రీడాకారులు ఆ గ్రామానికి చెందిన వారు పాల్గొనాల్సి ఉంటుందని, కాలేజీ జట్లు ఐడీ కార్డు ఆధారంగా పాల్గొనాలని సూచించారు. పోటీలలో అంపైర్ తీర్పే తుది నిర్ణయం అని తెలిపారు.మరిన్ని వివరాల కోసం 8297764791, 8328622419 ఫోన్ నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

# పింఛన్లు పంపిణీ చేసిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి

**కోయిలకుంట్ల ఏప్రిల్ 1 నందిపత్రిక** ప్రతినెలా 1 వ తారీఖున ప్రభుత్వం చేపడుతున్న వివిధ రకాల పింఛన్లను బుధవారం కోయిలకుంట్ల పట్టణంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృ ష్ణారెడ్డి పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్ళి నేరుగా వారికీ



అందజేశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమము కోసం ప్రతి నెల పింఛన్లను అందజేస్తున్నదని అన్నారు.ఎన్నికల సమయం లో ప్రజలకుచ్చిన హామీలను సమర్థంగా అమలు చేస్తున్నదని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజల మనసులో చెరగని స్థానాన్ని సంపాదించారు అన్నారు.

# వారపు సంతకు వేలంపాట

**జూపాడుబంగ్లా :ఏప్రిల్ 1: (నంది పత్రిక)** జూపాడుబంగ్లా పంచాయతీ కి వారపు సంత నిర్వహణ వేలంపాట కోసం మంగళవారం నిర్వహించారు. సచివాలయంలో గ్రామస్తులు బహిరంగ వేలం లో పదిమంది



పాటాదారులు ఆధ్వర్యంలో నిర్వహించిన వారం సంత నిర్వహణకు గ్రామపంచాయతీ పాటగా రూ 50000 కాగా 1,28,000 వేల రూపాయలు, వేలం పాట పాడి పాటదారుడు కాటం నరేష్ దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో పద్మావతమ్మ, గ్రామ సర్పంచ్ బాలయ్య, సచివాలయం గ్రామ సెక్రెటరీ మణికంఠ, పంచాయతీ సెక్రెటరీ జిఎం ఫాతిమాభి, గ్రామస్తులు పటాదారులు పాల్గొన్నారు.

# కోయిలకుంట్ల న్యాయవాద సంఘము నూతన కమిటీ ఎన్నిక

**కోయిలకుంట్ల ఏప్రిల్ 1నందిపత్రిక** కోవెలకుంట్ల న్యాయవాద సంఘం నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు.నూతన అధ్యక్షునిగా వి. తిరుపేలు ,సెక్రెటరీగా కే రాజశేఖర్, వైస్ ప్రెసిడెంట్ గా కె రమేష్ ,జాయింట్ సెక్రటరీగా ఎం. చంద్రుడు ,కోశాధికారిగా సి .నాగ శేషు ,లేడీస్ సెక్రటరీగా వి. లక్ష్మీదేవి ,లైబ్రరీ సెక్రటరీగా



అమెరున్నిషా బేగం మొదలగు వారిని, నూతన కమిటీగా ఎన్నుకోవడం జరిగినది .ఈ కమిటీ 31-3-2027 వరకు కొనసాగుతుందని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

# చౌడేశ్వరి అమ్మవారి మూలమూర్తికి పౌర్ణమి పూజలు

**బనగానపల్లె ఏప్రిల్ 1నందిపత్రిక** శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు బుధవారం పౌర్ణమిని పురస్కరించుకొని ఉదయం అమ్మవారి మూల మూర్తికి విశేష పూజలు నిర్వహించినారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ మూర్తి కి విశేష అలశీకరణ చేసి పల్లకీ సేవ మరియు సహస్ర దీపాలంకరణ సేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమం లో అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



# ప్లాట్ల యజమానులకు ఇబ్బందులు లేకుండా చేస్తాం

## డి ఈ, ఏ డి ఈ లు శ్రీనివాసులు, రంగస్వామి

**నందికొట్కూరు, ఏప్రిల్ 01 (నంది పత్రిక )** ప్రైవేట్ వెంచర్ లో ఉన్న తమ ప్లాట్ లో 33 కేవీ విద్యుత్ స్థంభం ఏర్పాటు చేసి తమకు ఇబ్బందులు కలిగించేలా చేశారని ప్లాట్ యజమాని రాగిని నర్సరాజు, స్వామన్న లు నెల రోజుల క్రితం నందికొట్కూరు డి ఈ



శ్రీనివాసులు, కన్ స్ట్రక్షన్ ఏ డి ఈ రంగస్వామికి రాతపూర్వకంగా పిర్యాదు చేశారు. ఈ విషయంపై నందికొట్కూరు విద్యుత్ శాఖ డి ఈ శ్రీనివాసులు, 33 కేవీ లైన్ కన్ స్ట్రక్షన్ ఏ డి ఈ రంగస్వామి బుధవారం సాయంత్రం కొత్త హాస్పిటల్ నాగలూటీ రోడ్డు లోని సర్వే నెంబర్ 779/2 బి లో ఉన్న వెంచర్ లో ప్లాట్ నెంబర్ 05 ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ప్లాట్ ను కొలతలు వేయించి ప్లాట్ లో కాంట్రాక్టర్ అయిన శ్రీ షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ వారు విద్యుత్ స్థంబాలను బయటకు పాతారా లేక ప్లాట్ లోపల పాతారా అని తనిఖీ చేశారు. అయితే ప్లాట్ లోకి విద్యుత్ స్థంభం మరియు సపోర్ట్ స్థంబాలు పాతినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ డి ఈ మరియు ఏ డి ఈలు మాట్లాడుతూ ప్లాట్ యజమానులకు ఇబ్బందులు లేకుండా, విద్యుత్ స్థంభం ప్లాట్ బయటకు పాతిస్తామని త్వరలోనే లేబర్ వచ్చి పనులు చేస్తారని హామీ ఇచ్చారు. ప్రజలకు, ప్లాట్ యజమానులకు ఎవరికి ఇబ్బందుకు లేకుండా 33 కే వి విద్యుత్ స్థంబాలు, పనులు చేపడతామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

# వృద్ధులు దివ్యాంగులు వితంతువులకు పింఛన్లు అందజేసి

# వారందరికీప్రభుత్వం అండగా ఉంది



## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**ఆచంట బ్యూరో చీఫ్ : ఏప్రిల్ 1,నంది పత్రిక** వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు సకాలంలో పింఛన్లను అందజేసి ప్రభుత్వం అండగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు తణుకు పట్టణం రావిగుంటలో బుధవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, శాసనసభ్యులు పితాని సత్యనారాయణ పర్యటించి ఇంటింటికి తిరిగి లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. వారితో మమేకమై వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేనివిధంగా 63 లక్షల మంది పేద ప్రజలకు పింఛన్లు పంపిణీ చేస్తుందన్నారు. జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు సామాజిక భద్రతను బలోపేతం చేసే దిశగా మొత్తం 2,22,354 మంది లబ్ధిదారులకు రూ.96.44 కోట్ల విలువైన సామాజిక పింఛన్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. పింఛన్లు పంపిణీ చేస్తుంటే లబ్ధిదారుల కళ్ళల్లో ఎంతో ఆనందం కనిపిస్తుందన్నారు. ప్రతినెల ఒకటో తేదీని క్రమం తప్పకుండా పింఛను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఒకవేళ ఒకటో తేదీన సెలవు దినం అయితే ఆ ముందు రోజే పింఛన్ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఆచంట నియోజకవర్గం శాసనసభ్యులు పితాని సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం క్రమం తప్పకుండా ప్రతి నెల 1వ తేదీనే పెద్ద ఎత్తున పింఛన్లు పంపిణీ చేస్తుందన్నారు. పేదల సంక్షేమం కోసం దేశంలో ఎక్కడా లేని విధంగా 60 నుంచి 70 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరుగుతోందన్నారు. దేశంలో ఏ రాష్ట్రం చూసినా కేవలం 1000 రూపాయలు లోపు మాత్రమే పింఛను ఇస్తున్నారన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా లెక్క చేయక రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిపాలన దక్షతతో రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సేవ చేయాలనే లక్ష్యంతో పనిచేస్తుందన్నారు. ఈ విషయాలన్నీ గమనించి ప్రజలందరూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలు పస్తులు ఉండరాదనే ఉద్దేశంతో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి ఆదుకుంటుందన్నారు. అందులో భాగంగా సూపర్ సిక్స్ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు.ల్ల ఆచంట పట్నంలో పార్కు, ముత్యాలమ్మ చెరువు అభివృద్ధికి పరిశీలన, తౌలుత పట్నంలో పార్క్ అభివృద్ధికి సంబంధించిన స్థలాన్ని జిల్లా కలెక్టర్ కు శాసనసభ్యులు చూపించడం జరిగింది. ఆహ్లాదకరమైన వాతావరణంలో పార్కును అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం ముత్యాలమ్మ చెరువు



ప్రాంతాన్ని పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పార్కు గట్లను పటిష్టపరిచి వాకింగ్ ట్రాక్, పచ్చదనాన్ని అభివృద్ధి చేయాలని, అలాగే ముత్యాలమ్మ దేవాలయానికి కూడా అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో దాసిరాజు, డి ఆర్ డి ఏ పిడి ఎంఎస్ఎస్ వేణుగోపాల్, నియోజకవర్గంలో ప్రత్యేక అధికారి జి.పిచ్చయ్య, తహసిల్దార్ శ్రీనివాసరావు, స్థానిక నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులందరికీ పెన్షన్ ఒక భరోసా



## జిల్లా కలెక్టర్ చదలవాడనాగరాణి

**బీమవరం బ్యూరో చీఫ్ : ఏప్రిల్ 1,నంది పత్రిక** ప్రతి నెల మొదటి తేదీన జరిగే పెన్షన్ పంపిణీ కార్యక్రమం కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఒక భరోసా దినమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు పోడూరు మండలం కవిటం గ్రామంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో బుధవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఆచంట నియోజకవర్గం శాసనసభ్యులు పితాని సత్యనారాయణ సంయుక్తంగా పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, సమాజానికి సేవలందించిన పెద్దలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రస్తుతం ప్రతి లబ్ధిదారునికి రూ.4 వేల పెన్షన్ అందజేస్తూ, వారు తమ అవసరాలైన మందులు, దైనందిన ఖర్చులు స్వయంగా నిర్వహించుకునేలా ప్రభుత్వం సహకరిస్తోందని తెలిపారు. జిల్లాలో సుమారు 4,500 మంది సిబ్బంది, 2,22,000 మంది పెన్షనర్లకు ప్రతి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఉదయం వేళల్లోనే పెన్షన్లు అందజేస్తున్నారని వివరించారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి నెల సుమారు రూ.96 కోట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పెన్షన్ మొత్తాన్ని లబ్ధిదారులు తమ అవసరాల కోసం మాత్రమే వినియోగించుకోవాలని, కుటుంబ సభ్యులు వాటిని ఉపయోగించకూడదని కలెక్టర్ సూచించారు. ఒకవేళ మొదటి తేదీ ఆదివారం వస్తే ముందుగానే పెన్షన్ అందజేస్తామని తెలిపారు. మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ స్త్రీశక్తి పథకం ద్వారా బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని చెప్పారు. ఆగస్టు 15 నుంచి ప్రారంభమైన ఈ పథకం ద్వారా జిల్లాలో లక్షలాది మహిళలు ప్రయాణించి ఆర్థికంగా బలపడుతున్నారని తెలిపారు. ఇటీవల బలహీన వర్గాల గృహ నిర్మాణ పథకాల కింద జిల్లాలో 5,026 టిడ్కో ఇళ్లను, పీఎంఏవై 536 ఇళ్లను అందజేయడం జరిగిందని, రానున్న మూడు మాసాల్లో మరిన్ని గృహాలను అందుబాటులోనికి తీసుకువచ్చి లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తెలిపారు. విద్యారంగంలో "తల్లికి వందనం" పథకం ద్వారా ప్రతి విద్యార్థికి రూ.15,000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. పిల్లలు చదువు మధ్యలో మానేయకుండా, పదవ తరగతి పూర్తి చేసి ఉన్నత విద్యను అభ్యసించాలని తల్లిదండ్రులకు సూచించారు. రైతుల సంక్షేమం కోసం "అన్నదాత సుఖీభవ" పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి సంవత్సరానికి రూ.20,000 ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వివరించారు. ఆచంట నియోజకవర్గ శాసనసభ్యులు పితాని సత్యనారాయణ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ నాయకత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో రాష్ట్ర అభివృద్ధి దిశగా పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.



ప్రాంత అభివృద్ధికి అవసరమైన రహదారులు, మౌలిక సదుపాయాల కోసం నిరంతరం కృషి చేస్తున్నామని, ప్రజల అవసరాలను తీర్చడంలో ప్రభుత్వం ముందుంటుందని పేర్కొన్నారు. అధికారుల సహకారం తో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తామని తెలిపారు. ప్రజలందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని, అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని పిలుపునిచ్చారు. రైతు భరోసా, తల్లికి వందనం, ఆరోగ్యశ్రీ, ఫీజు రేయింబర్స్మెంట్, ఉచిత సిలిండర్లు, వంటి పథకాలకు కొట్లాది రూపాయలను ఖర్చు చేస్తున్నామన్నారు. పి- ఫోర్ పథకం ద్వారా ప్రతి ఒక్క పేదవారిని ఆదుకునేందుకు మన రాష్ట్ర ముఖ్యమంత్రి సంకల్పించారు అన్నారు. అమరావతిని రాజధానిగా తీర్మానించి క పంపించడం జరిగిందని ఈ కార్యక్రమంలో ఆర్డీవో దాసిరాజు, డిఆర్డిఏ పిడి ఎమ్మెస్ ఎస్ వేణుగోపాల్, తహసిల్దార్ ఎస్ ఎం ఫాజిల్, ఎంపీపీ సుమంగళి, టిడిపి నాయకులు రుద్రరాజు వెంకటరామరాజు, సర్పంచ్ బుట్టుగుల్ల పూర్ణిమ, స్థానిక నాయకులు మేడపాటి గంగాధర్ రెడ్డి, రామకృష్ణ, గుబ్బల వెంకటేశ్వరరావు, డొక్కు శీను, తదితర నాయకులు, అధికారులు, స్వర్ణ గ్రామ వార్డు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బిసిలను అన్ని విధాలుగా ఆదుకుంటున్న కూటమి ప్రభుత్వం.

## చేనేత కార్మికులకు 6 లక్షల 40 వేల మందికి ఆర్థిక సాయం అందిస్తున్న కూటమి ప్రభుత్వం.

## దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా అత్యధికంగా పెన్షన్లు అందిస్తున్న ఏకైక రాష్ట్రం మన ఆంధ్రప్రదేశ్. రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ...

**ఏలూరు/నూజివీడు బ్యూరో చీఫ్ ఏప్రిల్ 1నంది పత్రిక** నూజివీడు పట్టణ గొడుగువారి గూడెంలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వం బీసీ వర్గమైన చేనేత కార్మికులను ఆర్థికంగా ఆదుకోవడానికి ఆర్థికంగా బలోపేతం చేయడానికి అందించే చేనేత పెన్షన్లు ఇంటింటికి వెళ్ళి రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అందజేశారు. యోగక్షేమాలు, గ్రామ సమస్యలు అడిగి తెలుసుకన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ చేనేత వృత్తులను అభివృద్ధి పరచడానికి చేనేత కార్మికులను ఆర్థికంగా బలపరిచి కుటుంబాలను ఆదుకోవడానికి కూటమి ప్రభుత్వం మగ్గం వర్కు చేసే వారికి 200 యూనిట్లు, మర మగ్గాలు మీద చేసేవారికి 500 యూనిట్లు విద్యుత్తు రాయితీ కల్పించి చేనేత కార్మికులను ఆర్థికంగా ఆదుకుంటున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు. రాష్ట్రంలో చేనేత కార్మికులకు రూ 150 కోట్లు ఖర్చు చేశామని అన్నారు. తద్వారా 6,40,000 మంది కుటుంబాలకు ఆర్థికసాయం అందిస్తున్నామని అన్నారు. త్వరలో చేనేత కార్మికులకు కమ్యూనిటీ హాలు కట్టిస్తామన్నారు. చేనేత సహకార సంఘాలకు రూ 78 కోట్ల రూపాయలు అందించిన కూటమి ప్రభుత్వం అన్నారు. అంతేగాక వడ్డెరలకు మైనింగు పర్మిషన్లు 15 శాతం రాయితీ, గౌడ సోదరులకు బార్ షాపులలో 10 శాతం రాయితీ, నాయీ బ్రాహ్మణ జీతభత్యాలు రూ 15 వేలు నుండి రూ 20 వేలకు పెంచి ఆర్థికంగా ఆదుకున్నామని అన్నారు. మత్స్యకారులు వేట నిషేధ సమయంలో ఇచ్చే రూ 15 వేలు ఆర్థిక సాయం రూ 20 వేలకు పెంచిన కూటమి ప్రభుత్వం అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సామాజిక పింఛన్లు రూ 4 వేలు, రూ 6 వేలు, రూ 10 వేలు, రూ 15 వేలు పింఛన్లు కూటమి ప్రభుత్వం అందిస్తుందన్నారు. నేత కార్మికులను ఆర్థికంగా ఆదుకోవడానికి రూ 25 వేల రూపాయలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం అన్నారు. గత వైఎస్ఆర్ ప్రభుత్వం ఐదు సంవత్సరాల్లో ఐదు కోట్లు ఖర్చు చేస్తే నూజివీడు పట్టణానికి కూటమి ప్రభుత్వం కేవలం 20 మాసాల్లో రూ 15 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టమన్నారు. ఎన్ ఆర్ జి ఎస్ కింద రూ 55 కోట్లు ఖర్చు పెట్టమన్నారు. వేసవిలో పట్టణ ప్రజలకు త్రాగునీరు సమస్య తలెత్తకుండా ప్రణాళిక బద్ధంగా ట్యాంకర్లు పైపు లైను మరమ్మతులు ఇంకా కావలసిన కొత్త కులాయి కలెక్షన్లు త్వరలో అందిస్తామన్నారు. సంక్షేమము, అభివృద్ధి చేసి రాష్ట్ర ప్రజానీకాన్ని ఆర్థికంగా బలపరచ డానికి కూటమి



ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళులాగ భావించి ముందుకు సాగుతున్నామని అన్నారు. గత ప్రభుత్వం రూ 14 లక్షలు కోట్లు అప్పుచేసి అప్పుల ఊబిలో రాష్ట్రాన్ని దించిందన్నారు. దాన్ని అధిగమించి అనుభవజ్ఞులైన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన ఆలోచన శక్తితో అభివృద్ధిని, సంక్షేమాన్ని సమపాలనలో ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. రానున్న రోజుల్లో 20 లక్షల ఉద్యోగ కల్పన ధ్యేయంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో ఇప్పటికే బహుళ జాతి సంస్థలు రూ 10 లక్షల కోట్ల పెట్టుబడి పెట్టాయని తద్వారా సుమారు 6 లక్షలు మందికి ఉద్యోగ కల్పన జరిగిందన్నారు.నూజివీడు పట్టణానికి త్రాగునీటి సమస్య తీర్చడానికి ఒక ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్తున్నామన్నారు. త్వరలో పోలవరం నుండి త్రాగునీరు అందించడానికి త్వరలో ప్రాజెక్టు నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలు అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, సామాజిక పింఛన్లు లబ్ధిదారులు వారి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు..

# రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత విద్యుత్ పథకం చేనేత కార్మికుల ఆర్థిక భరోసాకు ఎంతో దోహదపడుతుంది.

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**బీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 1నంది పత్రిక** ఆచంట పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో బుధవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణతో కలిసి చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించే ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఏప్రిల్ 1వ తేదీ నుండి ఈ పథకం ప్రారంభమైందన్నారు. చేనేత మరియు మరమగ్గాల రంగాలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా జిల్లాలోని 786 చేనేత కుటుంబాలకు లాభం చేకూరుతుందని, ప్రతి కుటుంబానికి సగటున నెలకు రూ.780, సంవత్సరానికి సుమారు రూ.8,800 వరకు ఆదా అవుతుందని వెల్లడించారు. అదేవిధంగా, అర్హులైన పెన్షన్ లబ్ధిదారులకు జిల్లాలో రూ.96 కోట్ల పెన్షన్లు పంపిణీ చేస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా రూ.33 వేల కోట్లు మూడు గంటల్లోనే జమ చేస్తున్నట్లు తెలిపారు. చేనేత కార్మికులు తమ నైపుణ్యంతో భారతదేశానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని, వారి కష్టాన్ని గుర్తించి చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి ఈ కళను ప్రోత్సహించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ, చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, సూపర్ సిక్స్ వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో దాసిరాజు, జిల్లా విద్యుత్ శాఖ అధికారి పులి ఉషారాణి, ప్రత్యేక అధికారి జి. పిచ్చయ్య, ఏఎంసీ చైర్మన్ కేతా విజయలక్ష్మి, ఎంపీపీ ఎం. సుజాత, జడ్పిటిసి సురేష్ బాబు, తహసీల్దార్ నాగబాబు, శ్రీనివాసరావు, టిడిపి నాయకులు రుద్రరాజు వెంకటరామరాజు పాల్గొన్నారు.

# జిల్లాలో 2,56,935 మందికి రూ.112.89 కోట్ల రూపాయల పెన్షన్ల పంపిణీ

## ఏలూరు 35వ డివిజన్ లో సామజిక పెన్షన్లు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి



**ఏలూరుబ్యూరో చీఫ్ , ఏప్రిల్, 1నంది పత్రిక :** ఏలూరు జిల్లాలో ఏప్రిల్ నెలకు గాను 2 లక్షల 56 వేల 935 మందికి 112. 89 కోట్ల రూపాయలను సామజిక పెన్షన్లుగా పంపిణీ చేస్తున్నామని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. స్థానిక 35వ డివిజన్ లోని కంకణాల వీధిలోని పేదలకు బుధవారం సామజిక పెన్షన్లను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను వారి సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు కింద జిల్లాలోని 2,56,935 మందికి రూ 112.89 కోట్ల రూపాయలు పంపిణీ చేస్తున్నామని, ఇందుకు జిల్లాలో 5016 మంది వార్డు, గ్రామ సచివాలయ మరియు ఇతర ప్రభుత్వ సిబ్బందితో పింఛన్లు పంపిణీ పక్కా ఏర్పాట్లు చెయ్యడం జరిగిందన్నారు. 1వ తేదీనే నూరుశాతం పెన్షన్ల పంపిణీకి చర్యలు తీసుకున్నామన్నారు. పింఛన్లు పొందేందుకు లబ్ధిదారులు వారి ఇండ్లలో అందుబాటులో ఉండేలా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతో ముందస్తు సమాచారం అందించామని తెలిపారు. కదలలేని వృద్ధులు, దివ్యంగులకు వారి ఇంటివద్దనే పెన్షన్లు అందిస్తున్నామన్నారు. డిఆర్ డిఏ పీడీ విజయలక్ష్మి, ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్ ఏ . భానుప్రతాప్, తహసీల్దార్ గాయత్రీదేవి, స్థానిక ప్రముఖులు అలజంగి శ్రీనివాసరావు, కొల్లేపల్లి రాజు, భీమవరపు పాపారావు, ఈదుపిల్లి దుర్గాప్రసాద్, చలమాల నాగు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులు దివ్యాంగులు వితంతువులకు పింఛన్లు అందజేసి వారందరికీప్రభుత్వం అండగా ఉంది

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**ఆచంట బ్యూరో చీఫ్ : ఏప్రిల్ 1,నంది పత్రిక** వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు సకాలంలో పింఛన్లను అందజేసి ప్రభుత్వం అండగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు ఆచంట పట్టణం రావిగుంటలో బుధవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, శాసనసభ్యులు పితాని సత్యనారాయణ పర్యటించి ఇంటింటికి తిరిగి లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. వారితో మమేకమై వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేనివిధంగా 63 లక్షల మంది పేద ప్రజలకు పింఛన్లు పంపిణీ చేస్తుందన్నారు. జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు సామాజిక భద్రతను బలోపేతం చేసే దిశగా మొత్తం 2,22,354 మంది లబ్ధిదారులకు రూ.96.44 కోట్ల విలువైన సామాజిక పింఛన్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. పింఛన్లు పంపిణీ చేస్తుంటే లబ్ధిదారుల కళ్ళల్లో ఎంతో ఆనందం కనిపిస్తుందన్నారు. ప్రతినెల ఒకటో తేదీని క్రమం తప్పకుండా పింఛను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఒకవేళ ఒకటో తేదీన సెలవు దినం అయితే ఆ ముందు రోజే పింఛన్ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఆచంట నియోజకవర్గం శాసనసభ్యులు పితాని సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం క్రమం తప్పకుండా ప్రతి నెల 1వ తేదీనే పెద్ద ఎత్తున పింఛన్లు పంపిణీ చేస్తుందన్నారు. పేదల సంక్షేమం కోసం దేశంలో ఎక్కడా లేని విధంగా 60 నుంచి 70 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరుగుతోందన్నారు. దేశంలో ఏ రాష్ట్రం చూసినా కేవలం 1000 రూపాయలు లోపు మాత్రమే పింఛను ఇస్తున్నారన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా లెక్క చేయక రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిపాలన దక్షతతో రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సేవ చేయాలనే లక్ష్యంతో పనిచేస్తుందన్నారు. ఈ విషయాలన్నీ గమనించి ప్రజలందరూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలు పస్తులు ఉండరాదనే ఉద్దేశంతో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి ఆదుకుంటుందన్నారు. అందులో భాగంగా సూపర్ సిక్స్ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు.

**ఆచంట పట్నంలో పార్కు, ముత్యాలమ్మ చెరువు అభివృద్ధికి పరిశీలన,** తౌలుత పట్నంలో పార్క్ అభివృద్ధికి సంబంధించిన స్థలాన్ని జిల్లా కలెక్టర్ కు శాసనసభ్యులు చూపించడం జరిగింది. ఆహ్లాదకరమైన వాతావరణంలో పార్కును అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం ముత్యాలమ్మ చెరువు ప్రాంతాన్ని పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పార్కు గట్లను పటిష్టపరిచి వాకింగ్ ట్రాక్, పచ్చదనాన్ని అభివృద్ధి చేయాలని, అలాగే ముత్యాలమ్మ దేవాలయానికి కూడా అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో దాసిరాజు, డి ఆర్ డి ఏ పిడి ఎంఎస్ఎస్ వేణుగోపాల్, నియోజకవర్గంలో ప్రత్యేక అధికారి జి.పిచ్చయ్య, తహసిల్దార్ శ్రీనివాసరావు, స్థానిక నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి



### జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

**బీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 1నంది పత్రిక** రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం పెంటపాడు మండలం ముదునూరు గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రబీ కోతలు వారంలో ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు పండించిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని తెలిపారు. రైతులు మధ్య దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారానే నేరుగా అమ్మకాలు జరపాలని సూచించారు. అవసరమైన గోనె సంచులను రైతులు ఆర్ఎస్‌కేలు వద్ద పరిశీలించి తీసుకోవాలని, చిరిగిన లేదా నాణ్యత లేని సంచులు ఉంటే వెంటనే తెలియజేయాలని తెలిపారు. అటువంటి సంచులను మిల్లర్లకు అప్పగించి వాటి స్థానంలో కొత్త సంచులు అందజేయబడతాయని పేర్కొన్నారు. గోనె సంచుల నాణ్యత బాధ్యత రైస్ మిల్లర్లదేనని స్పష్టం చేశారు. రైతులు తమ ధాన్యాన్ని విక్రయించే సమయంలో రవాణా మరియు హమాలీ చార్జీలను ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. తేమ శాతం ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉండాలని సూచించారు. మిల్లర్ల వద్దకు ధాన్యం వెళ్లకముందే ట్రక్ షీట్ జనరేట్ చేసుకోవాలని రైతులకు సూచించారు. తేమ శాతం నిర్ధారణ కోసం రైతులు కల్లాల వద్దకు నేరుగా వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పచ్చిరొట్ట పంటల ప్రయోజనాలను వివరించారు. పచ్చిరొట్ట పంటల వల్ల నేలలో నత్రజని శాతం పెరిగి భూమి సారవంతంగా మారుతుందని, నేల తేమ నిల్వ సామర్థ్యం పెరిగి దీర్ఘకాలంలో పంట దిగుబడులు పెరుగుతాయని తెలిపారు. రైతులు పచ్చిరొట్ట పంటలను సాగు చేసి తమ భూములను మరింత సారవంతంగా చేసుకోవాలని సూచించారు. అనంతరం రూ.800 విలువ కలిగిన 10 కిలోల బరువు గల 15 రకాల పచ్చిరొట్ట విత్తనాలతో కూడిన బ్యాగులను రైతులకు పంపిణీ చేశారు.

**ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ** అనంతరం ముదునూరు గ్రామంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ సొమ్మును అనవసర ఖర్చులకు వినియోగించకుండా సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. లబ్ధిదారుల యోగక్షేమాలు, జీవన విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెల సిబ్బంది ఇంటి వద్దకు వచ్చి పింఛన్లు అందిస్తున్నారా లేదా అని విచారించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జడ్డు వెంకటేశ్వరరావు, ఆర్.గంగాధర్, ఎం.ఏ.ఓ.రవికుమార్, తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్, వీఆర్వో జి.వి.అప్పారావు, సొసైటీ అధ్యక్షులు దాసరి అప్పన్న, దత్తు ప్రసాద్, గుబ్బల నారాయణ, సింహాచలం మరియు రైతులు పాల్గొన్నారు.



# జిల్లాలో పీఎన్‌జీ గ్యాస్ కనెక్షన్ల విస్తరణకు చర్యలు వేగవంతం చేయాలి

### జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి



**బీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 1నంది పత్రిక** జిల్లాలో పీఎన్‌జీ (పైప్డ్ నేచురల్ గ్యాస్) కనెక్షన్ల విస్తరణను వేగవంతం చేయడానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. బుధవారం జాయింట్ కలెక్టరేట్ ఛాంబర్ అఎంఎ గోదావరి గ్యాస్, సివిల్ సప్లైస్, మున్సిపల్, పంచాయతీరాజ్, ఆర్ & బి, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, గృహ వినియోగదారులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన మరియు నిరంతర గ్యాస్ సరఫరా అందించేందుకు పీఎన్‌జీ గ్యాస్ విస్తరణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రజల్లో అవగాహన కల్పించి, పీఎన్‌జీ కనెక్షన్లు పొందేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో తాడేపల్లిగూడెం ప్రాంతంలో మొత్తం 9,902 గ్యాస్ కనెక్షన్లకు పైప్‌లైన్ సదుపాయం సిద్ధంగా ఉన్నప్పటికీ, కేవలం 63 మంది మాత్రమే వినియోగం చేస్తున్నారని తెలిపారు. ఎల్పీజీ సిలిండర్లతో పోలిస్తే పీఎన్‌జీ గ్యాస్ వినియోగం ద్వారా వినియోగదారులకు నెలకు సుమారు రూ.100 నుండి రూ.150 వరకు ఆదా అవుతుందని చెప్పారు. ప్రజలు ముందుకు వచ్చి సంబంధిత శాఖల అధికారులతో సంప్రదించి పీఎన్‌జీ గ్యాస్ కనెక్షన్లు పొందాలని సూచించారు. గ్యాస్ కనెక్షన్ల కోసం గోదావరి గ్యాస్ అసిస్టెంట్ మేనేజర్‌ను ఫోన్ నెంబర్ 9491424143 ద్వారా సంప్రదించాలని తెలిపారు. అలాగే భీమవరం, పాలకొల్లు, నరసాపురం, తణుకు పట్టణాల్లో పీఎన్‌జీ గ్యాస్ కనెక్షన్ల విస్తరణకు తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎస్ఓ ఎన్.సరోజ, గోదావరి గ్యాస్ అసిస్టెంట్ మేనేజర్ ఎం.సత్య రాకేష్, భీమవరం మున్సిపల్ కమిషనర్ ఎం.రామచంద్రారెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖాధికారి యు.మంగపతిరావు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కాళీపట్నం భీమవరం రహదారిపై ఏప్రిల్ 02,2026 నుండి మే 02, 2026 వరకుట్రాఫిక్ మళ్లింపు

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**బీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 1నంది పత్రిక** కాళీపట్నం భీమవరం ప్రధాన రహదారి (ఎస్‌హెచ్-302) పై అభివృద్ధి పనులు చేపట్టనున్న నేపథ్యంలో, ట్రాఫిక్ ఆంక్షలు విధించి వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మళ్లించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ రహదారిపై కిలోమీటరు 5/6 నుండి 9/4 వరకు రూ.500 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టబడుతున్నాయి. ఈ పనులను గుత్తేదారు మారుతి కన్స్ట్రక్షన్స్, రావులపాలెం సంస్థ నిర్వహించనున్నట్లు తెలిపారు. రామాయణపురం మరియు దిరుసుమర్రు గ్రామాల పరిధిలో:కిమీ 7.820 నుండి 8.375 వరకు కిమీ 9.030 నుండి 9.350 వరకు మొత్తం 875 మీటర్ల పొడవు, 7 మీటర్ల వెడల్పుతో సీసీ పేవ్‌మెంట్ నిర్మాణం చేపట్టడం జరుగుచున్నది. పనుల నిమిత్తం ఏప్రిల్ రెండో తేదీ నుండి మే 2 2026 వరకు ట్రాఫిక్ ఆంక్షలను విధించడం జరిగిందని తెలిపారు. ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలి:లి భీమవరం నుండి కాళీపట్నం వైపు వెళ్లే వాహనాలు:లిభీమవరం ్ణ దిరుసుమర్రు జంక్షన్ ్ణ అంతర్గత గ్రామ రహదారి ్ణ కాళీపట్నం. కాళీపట్నం నుండి భీమవరం వైపు వచ్చే వాహనాలు:లి కాళీపట్నం ్ణ రామాయణపురం ్ణ గ్రామ అంతర్గత రహదారి ్ణ భీమవరంలిభారీ వాహనాలు (లారీలు, బస్సులు): లి సమీప ప్రధాన రహదారులు / జిల్లా రహదారుల ద్వారా మళ్లింపు చేయబడతాయి. ట్రాఫిక్ పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటించాలి. ప్రజలకు సూచనలు:లి పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణలను తప్పనిసరిగా పాటించాలి. సూచించిన ప్రత్యామ్నాయ మార్గాలనే వినియోగించాలి ట్రాఫిక్ సిబ్బంది సూచనలను అనుసరించాలి. అవసరమైనప్పుడు ప్రయాణ సమయాన్ని ముందుగానే ప్లాన్ చేసుకోవాలి. అత్యవసర వాహనాలకు (అంబులెన్స్, ఫైర్ సర్వీస్) ప్రాధాన్యత ఇవ్వాలి

**అధికారులకు ఆదేశాలు:**ట్రాఫిక్ మళ్లింపు మార్గాల్లో సరైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. రాత్రి వేళల్లో లైటింగ్, భద్రతా చర్యలు చేపట్టాలి. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పర్యవేక్షణ చేయాలి. ఈ తాత్కాలిక ట్రాఫిక్ మార్పులను ప్రజలు అర్థం చేసుకుని సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# పేదల ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలి

### నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**బీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 1నంది పత్రిక** జిల్లాలో పేదల గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి లక్ష్యాలను సాధించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని, ఇందులో నిర్లక్ష్యం వహించే అధికారులు మరియు ఆప్షన్-3 ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వశిష్ట సమావేశ మందిరంలో గృహ నిర్మాణాల పురోగతిపై గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఏఈలు, డీఈలు, కాంట్రాక్టర్లతో మండలాల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గృహ నిర్మాణాల వేగం పెంచేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమీక్ష సందర్భంగా కొందరు కాంట్రాక్టర్లు బిల్లుల చెల్లింపులు ఆలస్యమవుతున్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ఆమె గృహ నిర్మాణ శాఖాధికారిని వివరణ కోరారు. పూర్తి అయిన గృహాలకు సంబంధించిన బిల్లులు సకాలంలో చెల్లింపులు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. బిల్లుల చెల్లింపుల ప్రక్రియలో మరింత వేగం తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను కాంట్రాక్టర్లు వివరించగా, వాటిని త్వరితగతిన పరిష్కరించి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. గృహ నిర్మాణాలు వేగంగా పూర్తి కావడానికి అన్ని విధాలుగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. గృహ నిర్మాణ శాఖ ఏడీలు, డీఈలు, వర్క్ ఇన్స్పెక్టర్లు లబ్ధిదారుల పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. తదుపరి సమీక్ష సమావేశం నాటికి గృహ నిర్మాణాల్లో స్పష్టమైన పురోగతి చూపించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా గృహ నిర్మాణ శాఖాధికారి జి.పిచ్చయ్య, జిల్లాలోని డీఈలు, ఏఈలు, గృహ నిర్మాణ కాంట్రాక్టర్లు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.



# ఈ నెల 4వ తేదీన రన్ ఫర్ జీసస్ కార్యక్రమం ను విజయవంతం చేయండి-పాస్టర్లు




**ఆళ్లగడ్డ ప్రతినిధి ఏప్రిల్ 1 నంది పత్రిక** ఆళ్లగడ్డ పట్టణంలోని సిఎస్ఐ టౌన్ చర్చిలో కలవరి యూత్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావే శానికి పట్టణంలోని వివిధ చర్చిల పాస్టర్లు, సంఘ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించి, రాబోయే ఏప్రిల్ 4వ తేదీన జరగనున్న "రన్ ఫర్ జీసస్" కార్యక్రమంలో అన్ని సంఘాలు కలిసి పాల్గొనాలని నిర్ణయించారు.కల్వరి యూత్ అధ్యక్షులు సుదీర్ పాల్ మాట్లాడుతూ యేసు పునరుత్థాన మహిమను స్మరించుకుంటూ, క్రైస్తవుల ఐక్యతను సమాజానికి తెలియజేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రన్ ఫర్ జీసస్ విజయవంతం కావాలని దేవుని ఆశీస్సులు కోరుతూ అందరూ ప్రార్థనలు చేశారు. ఈ సమావేశంలో ఎం దేవదానం, మాదం కిషోర్, కల్వరి యూత్ సభ్యులు డాక్టర్ రాజ్ కుమార్, ఎద్దుల అనిల్ కుమార్,ఎద్దుల రాజేష్ చిన్న రాజు, బెల్లం ఐజాక్ ఎద్దుల జై సింగ్, కన్నాలల్ వివిధ చర్చిల పాస్టర్లు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

# పింగళి వెంకయ్యకు భారతరత్న ఇవ్వాలి





**మహానంది ఏప్రిల్ 01 (నంది పత్రిక):-** పింగళి వెంకయ్యకు భారతరత్న ఇవ్వాలని శ్రీ పింగళి వెంకయ్య ట్రస్టు రాయలసీమ ఇన్చార్జ్ షేక్ కరీం భాష అన్నారు. మహానంది మండలం ఎం తిమ్మాపురం గ్రామం నందు జడ్పీహెచ్ఎస్ స్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింగళి వెంకయ్య.. 'భారత జాతీయ పతాక రూపశిల్పి...' అనేది తెలుగు వారే కాదు.. భారతీయులు చాలా మంది చెప్పే మాట. చిన్నప్పటినుంచి పాఠ్యపుస్తకాల్లో చదవుకున్న మాట. తెలుగు ఆంగ్ల పత్రికల రిపోర్ట్స్‌లో తరచుగా అలాగే ప్రస్తావిస్తూ ఉంటారు. కానీ.. అటు ప్రభుత్వానికి చెందిన అధికారిక వెబ్‌సైట్లలో కనిపించే జాతీయ పతాక చరిత్రలో ఎక్కడా పింగళి వెంకయ్య పేరు ప్రస్తావన లేదు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మన జాతీయ పతాకం.. ప్రతి రోజూ సమున్నతంగా ఎగురుతుంటే ప్రతి భారతీయుడి శరీరం పులకరిస్తుంది. అఖండ భారతావని సగర్వంగా నిలబడుతుంది. దీని రూపశిల్పి మన అచ్చ తెలుగు బిడ్డ పింగళి వెంకయ్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణ,నాయక్, తిమ్మయ్య ,హుస్సేన్ వలి, అన్వర్ భాష, తదితరులు పాల్గొన్నారు.



# కార్మికులకు ఉరితాళ్లుగా మారిన లేబర్ కోడులు.



**కేసముద్రం, ఏప్రిల్ 01(నంది పత్రిక):**కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడులు కార్మికులకు ఉరితాళ్లుగా మారాయని ఏఐటీయూసీ మండల కార్యదర్శి మంద భాస్కర్ అన్నారు. బుధవారం కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రంలో ఎఐటియుసి అనుబంధ ట్రాన్స్ పోర్ట్ హమాలి యూనియన్ సమావేశంలో మంద భాస్కర్ మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలోనే కార్మికులకు హక్కులు కావాలని అనేక పోరాటాలు చేయడం ద్వారా కార్మికులకు హక్కులు, చట్టాలు ఏర్పడ్డాయన్నారు. కేంద్రంలోని బిజెపి సర్కార్ కార్పోరేట్ బడా పారిశ్రామిక శక్తులకు అనుకూలంగా ఉండే విధంగా కార్మిక చట్టాలను సవరించి నాలుగు కోడులుగా విభజించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరించే విధానాల వల్ల కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. కార్మికుల శ్రమను కారు చౌకగా దోచుకునేందుకే చట్టాలను సవరించిందన్నారు. ఇప్పటికే బిజెపి పాలిత రాష్ట్రాలలో 8 గంటల పని దినాన్ని 12 గంటల పని దినాలుగా మార్చిందన్నారు. ఈ విధానం బిజెపి సర్కార్ కార్మికుల త్యాగాలను, పోరాటాలను కించపరచడమేనన్నారు. ఒకవైపు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే, కార్మికుల రేట్లు దానికి అనుకూలంగా పెరగడం లేదని విమర్శించారు. హమాలీ కార్మికుల సంక్షేమం కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేస్తున్న హమాలీలను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నల్గొండ వెంకన్న, ఎస్కె మౌలానా, ఉప్పలయ్య, వెంకన్న, పాషా, పయ్యావుల వెంకన్న, జిలాని తదితరులు పాల్గొన్నారు.

# ఒంటిమిట్టలో ఘనంగా బ్రహ్మోత్సవాలు

### శివధనుర్భంగాలంకారంలో శ్రీ కోదండరాముడు

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు బుధవారం ఉదయం శివధనుర్భంగాలంకారంలో శ్రీ కోదండ రాములవారి రాజసం భక్తులకు కనువిందు చేసింది. ఉదయం 7.30 గంటల నుండి స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.స్వయంవరం సమయంలో శ్రీరాముడు శివుని విల్లును విరిచి సీతమ్మవారిని వివాహమాడే ఘట్టాన్ని గుర్తుచేసేది శివధనుర్భంగాలంకారం. సీతారాముల కల్యాణం రోజున ఉదయం ఈ అలంకారంలో స్వామివారు భక్తులను కటాక్షించారు. ఇకపోతే వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదోరోజు మంగళవారం రాత్రి గరుడ వాహనంపై శ్రీ సీతారామలక్ష్మణులు భక్తులకు అభయమిచ్చారు. రాత్రి 7 నుండి వాహనసేవ వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారి ని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. గరుత్మంతుడు శ్రీమహావిష్ణువుకు నిత్యవాహనం. దాసుడుగా, సఖుడుగా, విసనకఱ్ఱగా, చాందినిగా, ఆసనంగా, ఆవాసంగా, వాహనంగా ధ్వజంగా అనేక విధాల సేవలందిస్తున్న నిత్యసూరులలో అగ్రగణ్యుడైన వైనతేయుడు కోదండరామస్వామిని వహించి కదిలే తీరు సందర్శనీయమైనది. 108 దివ్య దేశాలలోనూ గరుడసేవ విశిష్టమైనది.

# సిద్ధాంతం ఘాట్ వద్ద రూ.3 కోట్లతో అత్యాధునిక స్మశాన వాటిక నిర్మాణం

### పుష్కరాల నాటికి పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

### కేదారేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణానికి చర్యలు

### అన్ని పుష్కర ఘాట్ల అభివృద్ధికి ప్రాధాన్యం

### శాసనసభ్యులు పితాని సత్యనారాయణ

**బీమవరం బ్యూరో చీఫ్ ఏప్రిల్ 1నంది పత్రిక** పెనుగొండ మండలం సిద్ధాంతం పుష్కర ఘాట్ ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ ఆకస్మికంగా సందర్శించి ఘాట్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఘాట్ అభివృద్ధికి సంబంధించి అధికారులకు పలు మార్గదర్శకాలు జారీ చేశారు. అనంతరం సుమారు రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అత్యాధునిక స్మశాన వాటిక స్థలాన్ని పరిశీలించి, ప్రతిపాదిత మ్యాపులను పరిశీలించారు. పుష్కరాల నాటికి ఈ పనులను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సిద్ధాంతంలో నిర్మించబడనున్న స్మశాన వాటిక రాష్ట్రంలోనే ఒక ఆదర్శ ప్రాజెక్ట్‌గా నిలుస్తుందని తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమంలో గ్రామస్థులు సహకరించాలని కోరారు. ఆచంట నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. శాసనసభ్యులు పితాని సత్యనారాయణ మాట్లాడుతూ, సుమారు రూ.3 కోట్లతో ఆధునిక సౌకర్యాలతో స్మశాన వాటిక నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. హైదరాబాదులో "ప్రస్థానం" స్మశాన వాటికను నిర్మించిన సంస్థకే ఈ పనులు అప్పగించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. గోదావరి ప్రాంతానికి అనుగుణంగా వరదల సమయంలో ఇబ్బందులు కలగకుండా నిర్మాణాన్ని రూపకల్పన చేస్తున్నామని తెలిపారు. అలాగే శ్రీ కేదారేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణానికి దేవాదాయ శాఖ అధికారులతో చర్చలు జరుపుతున్నామని తెలిపారు. జిల్లాలోని పుష్కర ఘాట్లను సమగ్రంగా అభివృద్ధి చేయడానికి చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశయాల మేరకు కుంభమేళాను మించిపోయే స్థాయిలో పుష్కరాలను నిర్వహించేందుకు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో దాసిరాజు, తహసీల్దార్ అనిత కుమారి, రెవిన్యూ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# మొక్కజొన్న రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

**- రైతులకు గిట్టుబాటు ధర అందేలా అన్ని చర్యలు తీసుకుంటాం**
**- ధరల తేడాపై కేంద్రంతో చర్చలుడ రైతులకు నష్టం జరగనివ్వం**
**- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**అమరావతిబ్యూరో చీఫ్ , ఏప్రిల్ 1నంది పత్రిక** మొక్కజొన్న రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులు నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. మొక్కజొన్న ధరల విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రాష్ట్ర ప్రభుత్వం రైతుల వెంటే నిలుస్తుందని అన్నారు. మొక్కజొన్న రైతుల సమస్యను సీఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారని, కేంద్రానికి లేఖ రాసి పరిస్థితిని వివరించారని తెలిపారు. రైతులకు భారం కాకుండా ఉండేలా కేంద్రం నుంచి అదనపు సహాయం, నిధులు తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందన్నారు. కేంద్రం కూడా రాష్ట్ర రైతుల సమస్యలను అర్థం చేసుకుని సహకరిస్తుందనే నమ్మకం తమకు ఉందన్నారు. అధిక వ్యయాలు, అంతర్జాతీయ పరిస్థితులు, ముఖ్యంగా గల్ఫ్ యుద్ధ ప్రభావం వంటి కారణాలతో మార్కెట్‌లో కొన్ని ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెప్పారు. అయినప్పటికీ రైతులకు నష్టం జరగకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోందన్నారు. ఈ సమయంలో కొన్ని రాజకీయ పార్టీలు మార్కెట్లో ధరలు పూర్తిగా పడిపోయాయని ప్రచారం చేసి రైతుల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయని మండిపడ్డారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలు రైతులకు మరింత నష్టం కలిగించే ప్రమాదం ఉందన్నారు. గతంలో కూడా పలు పంటల విషయంలో మార్కెట్ ధరలు తగ్గినప్పుడు ప్రభుత్వం నేరుగా జోక్యం చేసుకుని రైతులను ఆదుకుందని మంత్రి గుర్తు చేశారు. ధాన్యం, మిర్చి, మామిడి, కోకో, పొగాకు, ఉల్లి, టమాటా,బొప్పాయి వంటి పంటల విషయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వ కొనుగోళు చేపట్టి రైతులకు భరోసా కల్పించిందన్నారు. అదే విధంగా ఇప్పుడు మొక్కజొన్న రైతుల విషయంలో కూడా ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన విద్యుత్, సాగునీరు, నీటి భద్రత, పెట్టుబడి సహాయం వంటి అంశాల్లో ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. పీఎం కిసాన్, అన్నదాతా సుఖీభవ పథకాల



కింద గత నెలలోనే మూడో విడత సాయం రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. మొక్కజొన్న కొనుగోలు దారులు, కంపెనీలు కూడా రైతులు పెట్టిన ఖర్చును దృష్టిలో పెట్టుకుని కొనుగోలు ధరలను పెంచాలని మంత్రి కోరారు. రైతులు, కొనుగోలు దారులు పరస్పర విశ్వాసంతో వ్యవహరించి రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కొనుగోళ్లు జరపాలని సూచించారు. ప్రభుత్వం, కొనుగోలు దారులు, రైతులు కలిసి పనిచేస్తేనే రైతులకు గిట్టుబాటు ధర అందుతుందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# బిజెపి కార్మిక వ్యతిరేక నల్ల చట్టాలను రద్దు చేయాలి.

**కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన.**



**కేసముద్రం, ఏప్రిల్ 01(నంది పత్రిక):**బుధవారం కేసముద్రం మండల కేంద్రంలోని కల్వల గ్రామంలో సిఐటియు బిల్డింగ్ రంగం, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి కేంద్ర ప్రభుత్వ ప్రజా కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు విడనాడాలని నిరసన వ్యక్తం చేశారు. బ్రిటిష్ కాలంలో కార్మికులు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అనేక పోరాటాలు, ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక హక్కులను హరించే విధంగా బిజెపి ప్రభుత్వం అవలంబిస్తుందని, కార్మికులకు నష్టం చేకూర్చే నాలుగు లేబర్ కోడులను తక్షణమే రద్దు చేయాలని, 12 గంటల పని దినాన్ని 8 గంటలకు కొనసాగించాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయవద్దని, నిరుద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుసంధానంగా విధులు నిర్వహిస్తున్న కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 లు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, అదేవిధంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం లేబర్ కార్డు కలిగిన కార్మికులకు టెస్టులు చేయడం వల్ల కార్మికుల నిధులను వృధా చేయడమే తప్ప కార్మికులకు ఎలాంటి ఉపయోగం లేదని టెస్టులను తక్షణమే రద్దు చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నిధులను ఇతర సంక్షేమ పథకాలకు మళ్లించడం సరికాదని, ఇతర సంస్థలకు మళ్లించిన నిధులను భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో జమ చేయాలని, సంక్షేమ బోర్డులో పెండింగ్ లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తాడబోయిన శ్రీశైలం, సిఐటియు మండల కార్యదర్శి జల్లే జయరాజు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గొడిషాల వెంకన్న, రైతు సంఘం జిల్లా నాయకులు బొబ్బాల యాకూబ్ రెడ్డి, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మోడెం వెంకటేశ్వర్లు, ఏదునూరి శ్రీనివాస్, చెక్కల కట్టయ్య, ఉప్పలయ్య, వెంకన్న, వెంకటస్వామి, కూనం మల్లేశం తదితరులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వివర్స్ కు 500 యూనిట్ల విద్యుత్ ఉచితం







**ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ**
**వైసీపీ ప్రభుత్వంలో కరెంటు రేట్లు 9సార్లు పెంచడం జరిగింది ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ**

**ఆళ్లగడ్డ ప్రతినిధి ఏప్రిల్1, నంది పత్రిక** సీఎం చంద్రబాబు నాయుడు యిచ్చిన హామీ మేరకు ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి వివర్స్ కు 500 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ తెలిపారు. బుధవారం ఆళ్లగడ్డ పరిధిలోని పడకండ్ల లో ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మన ప్రభుత్వం ప్రజలను అన్నివిధాల ఆదుకొని పెన్షన్ తోపాటు సంక్షేమ ఫలాలు అందిస్తుందన్నారు. ఈ విషయం ప్రజలందరికీ అర్థమవుతుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో గవర్నమెంట్ ఉద్యోగస్తులకు జీతలు సరైన సమయానికి ఇవ్వలేక పోయారన్నారు. మన ప్రభుత్వం అలా కాదని ఒకటో తారీకు ఆదివారం పడితే ముందు రోజే పింఛన్ పంపిణీ చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలో కరెంటు రెట్లు తొమ్మిది సార్లు పెంచడం జరిగిందని టిడిపి ప్రభుత్వం వచ్చాక రెండు సంవత్సరాలైనా కూడా ఒక రూపాయి కూడా పెంచలేదన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఒక్కటి చేసి చూపిస్తున్నారని ఆమె తెలిపారు. అలాగే ఆళ్లగడ్డ పరిధిలోని పడకండ్ల గ్రామంలో వీవర్స్ ఎక్కువగా ఉండేవారని, గత వైసిపి ప్రభుత్వంలో కరెంటు చార్జీలు ఎక్కువ పెంచడంతో చాలామంది వలస వెళ్లడం జరిగిందన్నారు. ఇప్పుడు అలా కాకుండా మళ్లీ ఆళ్లగడ్డ ఏరియాలో వివర్స్ ఎక్కువగా ఉండి చీరలు నేసేలాగా చూస్తామని అన్నారు. శ్రీకాళహస్తిలో కలంకారి వర్క్ ఎలా చేసి చూపిస్తున్నారో అలాగే అహోబిలంలో ప్రమోషన్ చేసి చూపించి వారికి ఉపాధి కల్పించేలాగా చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ హుస్సేన్ భాష, శేఖర్ రెడ్డి, కృష్ణారెడ్డి, నాగాంజనేయులు అధికారులు టిడిపి నాయకులు టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఆంధ్రప్రదేశ్‌లో రామరాజ్యం స్థాపన

**- సీఎం నారా చంద్రబాబు నాయుడు**
**- జై శ్రీరామ్ నినాదాలతో మార్మోగిన కళ్యాణ వేదిక**
**- శ్రీరాముడు, శ్రీవారి అనుగ్రహంతో ప్రజా రాజధానిగా అమరావతి**



**ఒంటిమిట్ట బ్యూరో చీఫ్ ఏప్రిల్ 1నంది పత్రిక** శ్రీ కోదండరామస్వామివారి సన్నిధిలో బుధవారం సాయంత్రం నిర్వహించిన శ్రీ సీతారాముల దివ్య కళ్యాణోత్సవం అనంతరం కళ్యాణ వేదిక వద్ద భక్తులను ఉద్దేశించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగించారు. జై శ్రీరామ్ నినాదాలతో ముఖ్యమంత్రి వేదికపై తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఒంటిమిట్ట శ్రీరాముడు మరియు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి అనుగ్రహంతో ఆంధ్రప్రదేశ్‌లో రామరాజ్యం స్థాపన జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన అనంతరం ఒంటిమిట్టలోని ప్రాచీన శ్రీ కోదండరామాలయాన్ని టీటీడీ ఆధీనంలోకి తీసుకుని అభివృద్ధి దిశగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ పుణ్యక్షేత్రం ఆధ్యాత్మిక కేంద్రంగా మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఇటీవల పార్లమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని ఏర్పాటు చేసే బిల్లుకు ఆమోదం లభించినట్లు వెల్లడించిన ముఖ్యమంత్రి, దేవేంద్రుడు పాలించిన దేవతల రాజధాని అమరావతి స్ఫూర్తితో ప్రజల రాజధానిని అభివృద్ధి చేయాలని సంకల్పం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం శ్రీరాముడు, శ్రీవారి ఆశీస్సులు కోరినట్లు తెలిపారు. కళ్యాణ వేదిక వద్ద భారీగా తరలివచ్చిన భక్తజన సమూహం మధ్య జై శ్రీరామ్ నినాదాలు మార్మోగగా, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# ట్రంప్ చితిమంటల్లో ప్రపంచం విలవిల !

పశ్చిమాసియా యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో అంతుచిక్కడం లేదు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. అయితే ఈ యుద్ధం వల్ల ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతున్నా అగ్రరాజ్యం అమెరికా పట్టించుకోవడం లేదు. అమెరికా షరతులకు లొంగేది లేదని ఇరాన్ కరాఖండిగా చెప్పడంతో ఎటు వెళుతుందో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. పరిస్థితి ఇలాగే ఉంటే పశ్చిమాసియా సంక్షోభంతో ప్రపంచంలో తలెత్తే ఆర్థిక సమస్యల గురించి చర్చ మొదలైంది. నెల రోజులు దాటిన యుద్ధంతో చమురు నుంచి ఆహారం వరకు ప్రభావితం అవుతున్నాయి. అమెరికాకు మంగళవారం నాటి వరకు 36 బిలియన్ డాలర్లకు పైగా నష్టం జరిగింది. ప్రతి సెకనుకు 11,574 డాలర్లు ఖర్చు అవుతున్నాయి. ట్రంప్‌కు వ్యతిరేకంగా అమెరికాలో గడచిన తొమ్మిది నెలల్లో మూడుసార్లు అక్కడి కార్మికవర్గం ప్రదర్శనలు చేశారు. ఎవరినైనా అదుపులోకి తెచ్చుకోవాలంటే అంతర్జాతీయ సూత్రాలను పక్కన పెట్టు, జనం మీద బాంబులు వేసి చంపు, దేశాలను నాశనం చేయి, అప్పుడు జనం నిరాశతో లొంగిపోతారనే అమెరికా అనుసరిస్తున్న విధానం ప్రపంచ దేశాలకు గుదిబండగా మారాయి. అమెరికా అడుగుజాడల్లో నడుస్తున్న ఇజ్రాయిల్ కూడా రెచ్చిపోవడం దారుణం. ఇదే క్రమంలో భారత ఆర్థిక వ్యవస్థ దిగజారుతుండటం ఆందోళనకరం. మన ఆర్థిక వ్యవస్థ త్వరలోనే ఐదు ట్రిలియన్ డాలర్ల మైలురాయిని చేరుకుంటుందన్న మోడీ లక్ష్యానికి గండిపడినట్లే. ఎందుకంటే మన ఆర్థిక వ్యవస్థ కూడా ప్రపంచ దేశాల మీద ఆధారపడి నడుస్తోంది. దీనికితోడు చమురు దిగుమతులపై ప్రభావం కారణంగా దేశంలో ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా తయారయ్యింది. చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ 95కి పడిపోయింది. నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చేనాటికి 2013లో డాలర్‌తో రూపాయి విలువ పోలిస్తే 62గా ఉండేది. రూపాయి విలువ అత్యంత ప్రమాదకర స్థాయికి చేరిందని అప్పట్లో నిర్మలా సీతారామన్, మోడీ విమర్శించారు. ఇప్పుడు అంతా బాగుందని పార్లమెంట్ సాక్షిగా ఆర్థిక మంత్రి ప్రకటించడం విడ్డూరం. డాలర్ పడిపోతున్న సమయంలో సైతం రూపాయి విలువ దిగజారడం, ఆసియా లోనే అత్యంత అధ్వాన స్థితికి చేరుకోవడం కేంద్రం వైఫల్యాన్ని చాటిచెప్పేదే. పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావంతో ఆర్థిక సూచీల వృద్ధి మందగించిందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ తన తాజా నివేదికలో ప్రకటించింది. వాస్తవానికి యుద్ధం ప్రారంభానికి ముందే మన ఆర్థిక వ్యవస్థ ఆందోళనకర స్థితిలో ఉంది. దేశీయ ముడి చమురు పరిశ్రమ గత 24 నెలల్లో 20 నెలలు కుంచించుకుపోయింది. ప్రస్తుత ఎల్‌పిజి, పెట్రో ఉత్పత్తుల సంక్షోభానికి, తద్వారా ఆర్థిక రంగానికి ముప్పుగా పరిణమించిందనేది నిర్వివాదాంశం. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రెండంకెల స్థాయిలో క్షీణిస్తున్నాయి. ఎగుమతులు గత కొన్ని నెలలుగా 5 శాతం నుండి 7 శాతం ప్రతికూల వృద్ధిని నమోదు చేస్తున్నాయి.సరుకుల ఎగుమతులు 0.8 శాతం పతనమై 36.61 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. పశ్చిమాసియా సంక్షోభం, అమెరికా విధిస్తున్న కొత్త టారిఫ్‌లు భారత తయారీ రంగానికి, ముఖ్యంగా ఐటి, ఫార్మా ఎగుమతులకు గొడ్డలి పెట్టుగా మారాయి. ఉత్పత్తికి డిమాండ్ తగ్గిపోయిందని ఈ గణాంకాలన్నీ చెబుతూనే ఉన్నాయి. కేంద్రం చెబుతున్నట్టు 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని చేరుకోవాలంటే దేశ జిడిపి కనీసం 8 నుండి 9 శాతం స్థిరమైన వృద్ధిని నమోదు చేయాలి. వాస్తవంగా 5 శాతానికి మించదనేది నిపుణుల వాదనగా ఉంది. స్టాక్ మార్కెట్‌కు ఈ యేడాది 'బ్లాక్ ఇయర్'గానే మిగిలిపోయింది. లక్షల కోట్ల సంపద ఆవిరైంది. విదేశీ పెట్టుబడిదారులు గత ఏడాది కాలంలో రూ.1.80 లక్షల కోట్ల నిధులను వెనక్కి తీసుకోవడం మార్కెట్లను అగాథంలోకి నెట్టేసింది. పశ్చిమాసియాలో అమెరికా– ఇజ్రాయిల్ రుద్దిన యుద్ధం మనదేశాన్ని గణనీయంగా దెబ్బతీసింది.ద్రవ్యోల్బణం, నిరుద్యోగం సామాన్యుల జీవితాలను అల్లకల్లోలం చేస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం 3.2 శాతానికి ఎగిసి 10 నెలల గరిష్ట స్థాయికి చేరుకోవడం ప్రమాద ఘంటికగా చూడాలి. ప్రస్తుత ఆర్థిక వ్యవస్థ విద్యావంతులకు సరిపడా ఉద్యోగాలను సృష్టించలేక పోతోంది. ప్రభుత్వ విధానాలు కొన్ని కార్పొరేట్ సంస్థల లాభాలకూ, కుబేరుల సంపద పెరుగుదలకూ ఉపయోగపడుతున్నాయి. అసమానతలు తీవ్రమవుతున్నాయి. సామాన్యులు, మధ్యతరగతి వర్గాలు దారిద్ర్యంలోకి నెట్టబడుతున్నారు. ప్రజల కొనుగోలు శక్తి పడిపోవడం, చిన్న పరిశ్రమలు కునారిల్లడం ఇందుకు నిదర్శనం. వాస్తవ సమస్యలను గుర్తించి పరిష్కరించినప్పుడే దేశానికి నిజమైన ఆర్థిక పురోగతి సాధ్యం. ఇరాన్‌పై దాడుల తరువాత అనేక దేశాల్లో స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. వాటి విలువ ఎంత అన్నది స్పష్టంగా చెప్పలేము. మన దేశంలో రూ.51 లక్షల కోట్లు నష్టపోయినట్లు అంచనా, ఇంకా పతనం కొనసాగితే నష్టాలు పెరుగుతాయి. ఈ ఏడాది చివరి నాటికి అమెరికా మాంద్యంలోకి వెళ్లేందుకు 37 శాతం అవకాశాలున్నట్లు పోలీ మార్కెట్ అంచనా వేసింది. కార్పొరేట్ కంపెనీలు పెరిగిన ఖర్చులను వినియోగదారుల మీద మోపితే ద్రవ్యోల్బణం పెరుగు తుంది, పెట్టుబడులు పెట్టేవారు ఆచితూచి అడుగేస్తారు, నియామకాలు తగ్గిపోతాయి. పశ్చిమాసియా సంక్షోభాన్ని ట్రంప్ ఎలా ముగిస్తాడో తెలియదు. స్వస్తి పలకటం అనివార్యం, అయితే అది అమెరికా నిర్దేశించినట్లు కాదు. ఇప్పుడు ఇరాన్ తన షరతులను ముందుకు తెస్తున్నది, ఇది ట్రంప్ కలలో కూడా ఊహించి ఉండడు.

## యుద్ధం ముగింపునకు సిద్ధమే షరతులు వర్తిస్తాయనన ఇరాన్

అమెరికా– ఇజ్రాయెల్‌తో కొనసాగుతోన్న యుద్ధాన్ని ముగించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ పేర్కొన్నారు. అయితే, తమకు కొన్ని బలమైన హామీలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారని ఇరాన్ అధ్యక్ష కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. యుద్ధం ముగించాలంటే తాము విధించిన షరతులకు అంగీకరించాలని ఇరాన్ అధ్యక్షుడు పేర్కొన్నారు. ముఖ్యంగా భవిష్యత్తులో ఇలాంటి దాడులు పునరావృతం కావనే బలమైన హామీ ఇవ్వాలన్నారు.

# ప్రపంచానికి ఒరాకిల్ భారీ కుదపు

**30వేల మంది టెక్కీల తొలగింపు**
**అందులో 12వేమంది భారీతయులు**

అమెరికా టెక్ దిగ్గజం ఒరాకిల్ మంగళవారం ఒక్కసారిగా భారీ లేఆఫ్స్‌కు శ్రీకారం చుట్టింది. ప్రపంచవ్యాప్తంగా పనిచేస్తున్న సుమారు 1.62 లక్షల మంది సిబ్బందిలో 18 శాతం, అంటే దాదాపు 30,000 మందిని తొలగించినట్లు సమాచారం. వీరిలో ఏకంగా 12,000 మంది భారతదేశానికి చెందిన ఉద్యోగులే కావడం గమనార్హం. అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 6 గంటలకు వేలాది మంది ఉద్యోగులకు ఒకేసారి లేఆఫ్ మెయిల్స్ పంపించారు. కంపెనీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా వారి రోల్స్ అవసరం లేదని పేర్కొంటూ తొలగింపు ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 31నే వారి చివరి పనిదినంగా ప్రకటించడంతో పాటు, కంపెనీ ల్యాప్‌టాప్‌లు, సిస్టమ్‌ల యాక్సెస్‌ను వెంటనే నిలిపివేయడం ఉద్యోగులకు షాక్ ఇచ్చింది. ఈ లేఆఫ్స్ ప్రభావం భారత్‌పై తీవ్రంగా పడింది. ఒరాకిల్ ఇండియాలో సుమారు 30,000 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, వారిలో గణనీయమైన శాతం ఈ కోతలకు గురైనట్లు సమాచారం. అమెరికా, కెనడాలో తొలగించిన ఉద్యోగుల్లో కూడా పెద్ద సంఖ్యలో భారతీయులే ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మేనేజీరియల్ స్థాయిలో ఉన్న ఉద్యోగులే ఎక్కువగా ఈ వేటుకు గురైనట్లు సమాచారం. ఇది ఒక్క విడత మాత్రమేనని, ఇంకా మరిన్ని లేఆఫ్స్ ఉండే అవకాశం ఉందన్న వార్తలు ఉద్యోగుల్లో ఆందోళన పెంచుతున్నాయి. ఏ సమయంలోనైనా మరో చేదు వార్త వినాల్సి వస్తుందేమోనని ఐటీ ఉద్యోగులు టెన్షన్ పడుతున్నారు. ఒరాకిల్ ప్రస్తుతం నష్టాల్లో లేదు. ఇటీవల ముగిసిన త్రైమాసికంలో కంపెనీ లాభాలు గత ఏడాదితో పోలిస్తే 95శాతం పెరిగి 6.13 బిలియన్ డాలర్లకు చేరాయి. అయితే, కంపెనీ ఇప్పుడు ఏఐ డేటా సెంటర్ రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టుతోంది. సుమారు 156 బిలియన్ డాలర్ల ప్రాజెక్ట్ చేపట్టగా, అందులో భాగంగా ఇప్పటికే 50 బిలియన్ డాలర్లు అప్పు తీసుకుంది. ఈ నేపథ్యంలో ఖర్చులను తగ్గించేందుకు ఉద్యోగాల కోతలు విధిస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చర్యల ద్వారా కంపెనీకి దాదాపు 10 బిలియన్ డాలర్ల వరకు నగదు ఆదా అవుతుందని అంచనా. ఇక తొలగించిన ఉద్యోగులకు కంపెనీ కొన్ని పరిహారాలు ప్రకటించింది. అదనంగా మూడు నెలల జీతం,కంపెనీలో పని చేసిన ప్రతి ఏడాదికి 15 రోజుల జీతం, మిగిలిన సెలవులను నగదుగా మార్చుకునే అవకాశం,కార్మిక చట్టాల ప్రకారం గ్రాట్యుటీ.అయితే, ఈ ప్రయోజనాలు కంపెనీ నిర్దేశించిన గడువులోపు రాజీనామా చేసిన వారికే వర్తిస్తాయని పేర్కొన్నారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com